www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
39 YEARS Safeguarding Trust
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

సంపుటి : 68 సంచిక : 197 | బుధవారం 09-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు: 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



ఆగ్రహజ్వాల



పెల్లుబికిన కార్మికుల నిరసన

- బస్సుల నిలిపివేత, రైల్ రోకోలు
- తొలిరోజు సమ్మె సక్సెస్
- బ్యాంకుల మూత- స్కూళ్లకు సెలవులు- వాణిజ్యానికి తాళం
- పశ్చిమ బెంగాల్‌లో ఉద్రిక్తం
- ఒడిశాలో స్వచ్ఛందం
- కేరళలో జనజీవనం అస్తవ్యస్తం
- కర్ణాటకలో నిరసన వెల్లువ
- మహారాష్ట్రలో రవాణా కకావికలం
- తెలుగు రాష్ట్రాల్లో ప్రశాంతం

9లో


విజయవాడలో మహాప్రదర్శన నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు, నేతలు

కార్మికలోకం కన్నెర్ర

- రాష్ట్రంలో కూడా సక్సెస్
- కదం తొక్కిన కార్మికులు
- గుణపాఠం తప్పదని హెచ్చరిక

11లో

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కార్మికులు కన్నెర్ర చేశారు. పోరాడి సాధించుకున్న తమ హక్కులను హరిస్తున్న సర్కారుపై దండెత్తారు. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు, ఏకపక్ష కార్మిక చట్టాల సవరణలు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, ఉద్యోగ భద్రతను ధ్వంసం చేయటం, కార్మిక సంఘాల చట్టానికి తూట్లు పొడుస్తున్న కేంద్రంలోని మోడీ సర్కారును గద్దె దించే లక్ష్యంతో... దేశ వ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులు రెండు రోజుల సమ్మెకు నడుం బిగించారు. తొలిరోజు... బస్సులు నిలిచిపోయాయి. రహదారుల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. అనేక పరిశ్రమల్లో చక్రాలు తిరగలేదు. హమాలీలు మూటలు మోయలేదు. బ్యాంకులు తెరుచుకోలేదు. విద్యాసంస్థలకు తాళాలు పడ్డాయి. రైల్ రోకోలు, రాస్తారోకోలతో కార్మిక సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి.

కేంద్రానికి మొట్టికాయ

- సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మ
- తక్షణమే విధుల్లోకి తీసుకోండి
- విధానపరమైన నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం
- వారంలోగా సెలెక్ట్ కమిటీ నిర్ణయం తీసుకోవాలని ఆదేశం



న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) డైరెక్టర్ అలోక్ కుమార్ వర్మను బలవంతంగా సెలవులో పంపించిన కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తక్షణమే అలోక్ కుమార్ వర్మను విధుల్లోకి తీసుకోవాలని ప్రధాన న్యాయ మూర్తి (సీజేఐ) రంజన్ గొగోయ్ నేతృత్వంలోని జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా తనను సెలవులో పంపించటాన్ని సవాల్ చేస్తూ అలోక్ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా, దానిపై ధర్మాసనం విచారణ చేపట్టింది. సీజేఐ సెలవులో ఉన్నందున న్యాయమూర్తులు కౌల్, జోసెఫ్ ఈ తీర్పును వెలువరించారు. సీబీఐ డైరెక్టర్ వర్మ అని కేంద్రం

- మిగతా 2 లో

కేంద్రానికి చెంపపెట్టు

సుప్రీం తీర్పుపై సీపీఐ వ్యాఖ్య

2లో

పారిశ్రామిక హబ్‌గా ఓర్వకల్లు

- హైకోర్టు బెంచ్ ఏర్పాటునకు హామీ
- కర్నూలు ప్రజలకు చంద్రబాబు వరాల జల్లు
- కేన్సర్ పరిశోధనా కేంద్రం, పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన



2లో

రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ : ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారికి విద్యా, ఉద్యోగ రంగాలలో పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం మంగళవారం లోక్‌సభ ఆమోదించింది. కేంద్ర మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ ఈ బిల్లును సభలో ప్రవేశ పెట్టారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే ఉభయసభల్లో 2/3 వంతు మెజారిటీ

- మిగతా 2 లో

తాయిలాలకు తయారు..

2లో

70 ఏళ్లు దాటిన..
పెన్షనర్లకు తీపికబురు..!
10శాతం పెంచిన సర్కారు

11లో

యుద్ధాలు అంతిమంగా గొప్పగా ముగుస్తాయి : ట్రంప్

వాషింగ్టన్ : నిరంతరాయంగా సాగిన యుద్ధాలు చివరికి గొప్పగా ముగుస్తాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. సంపన్నదేశాలనుండి సైనిక, ఆర్థిక సహాయాన్ని ఇవి పొందుతాయని ఆయన అన్నారు. ఆయన ఈ మేరకు సోమవారం రాత్రి ఒక ట్వీట్ చేశారు. దాదాపు ఏడుళ్లుగా అంతర్యుద్ధం జరుగుతున్న సిరియానుండి పదాతి దళాలను ఉపసంహరించుకుంటున్నట్టు గతంలో ప్రకటన చేశారు. అయితే తమ దళాలన్నింటినీ వెనక్కు పిలిపించడంలేదని తాజాగా ప్రకటించారు. జాతీయ భద్రతా సలహాదారు జాన్‌బోల్టన్ ఇదే అంశంపై మాట్లాడుతూ తాము అనుకున్న లక్ష్యాలు నెరవేరేవరకు సిరియానుండి తమ దళాలు పూర్తిగా వైదొలగవని స్పష్టం చేశారు. సిరియాలోని ఇస్లాం ప్రభుత్వం ఓటమిచెందేవరకు తమ దళాలు అక్కడవుంటాయని అన్నారు. ట్రంప్ తన ట్వీట్‌లో ప్రత్యేకించి యుద్ధాలు జరుగుతున్న దేశాల పేర్లు చెప్పకపోయినప్పటికీ సిరియా, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధాలనుద్దేశించే మాట్లాడారని తెలుస్తూనేవుంది. రెండువేల మంది పదాతిదళాలను వెనక్కు పిలిపిస్తున్నట్టు గతనెలలో ట్రంప్ ప్రకటించారని, అయితే దళాల ఉపసంహరణను నెమ్మదిగా జరిగేలా చూడాలని వైట్‌హౌస్ అధికారులు ఆదిశలో కృషి చేస్తున్నారని బోల్టన్ చెప్పారు. ఐఎస్ ఉగ్రవాద సంస్థపైన విజయం సాధించామని కూడా ట్రంప్ చాలా గొప్పగా చెప్పుకున్నారు. అయితే ఇప్పటికీ కుర్దిష్ తిరుగుబాటుదారులు, ఐఎస్ ఉగ్రవాదులు సిరియా అధ్యక్షుడు బషర్‌అల్‌అసద్ ప్రభుత్వంపైన తమ పోరాటం కొనసాగిస్తున్నాయి. సైన్యాన్ని వెనక్కు పిలిపిస్తున్నట్టుగా ట్రంప్ చేసిన ప్రకటనను మిత్రదేశాలు బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలోని చాలామంది కాంగ్రెస్ సభ్యులు వ్యతిరేకించారు.

మదురొ ప్రమాణస్వీకారానికి మెక్సికో

మెక్సికోసిటీ : వెనిజులా అధ్యక్షుడుగా నికొలస్ మదురొ ప్రమాణ స్వీకారానికి మెక్సికొ ప్రభుత్వ ప్రతినిధిగా దౌత్యాధికారి జాన్‌మాన్యుయల్ నన్‌గారి హాజరవుతున్నారు. వెనిజులా విదేశాంగశాఖ ఈ అంశాన్ని ధృవీకరించింది. మెక్సికొ ప్రభుత్వం నుండి వెనిజులాకు ఈ మేరకు లేఖ అందింది. మెక్సికొ ప్రభుత్వం తరఫున లాటిన్ అమెరికా విభాగం సహాయమంత్రి ఈ కార్యక్రమానికి హాజరవనున్నారు. లేఖను వెనిజులా విదేశాంగశాఖ మంత్రి జార్జిఅర్రియజమాంటిసెర్రట్‌కు మెక్సికొ రాసింది. విదేశాంగశాఖ రాజ్యాంగ సూత్రాలను అనుసరించి వెనిజులా ప్రభుత్వ న్యాయబద్ధతను ధృవీకరించి ప్రకటన చేయడంలేదని మెక్సికొ సహాయమంత్రి వెల్లడించారు. రాజ్యాంగ సూత్రాల ప్రకారం ఇతర దేశాల వ్యవహారాలలో జోక్యం చేసుకోరాదని ప్రజల స్వీయనిర్ణయాన్ని అనుసరించి మెక్సికో నడుచుకుంటుందని ఆయన తెలిపారు.

విశాలాంధ్ర ప్రపంచం

ఉత్తరకొరియా నేత కిమ్, జిన్‌పింగ్ చర్చలు

బీజింగ్ : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆహ్వానంమేరకు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్ చైనాలో పర్యటిస్తున్నారు. మంగళవారం నుండి ఆయన పర్యటన ప్రారంభమైంది. త్వరలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, కిమ్ రెండవసారి భేటీకానున్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యత సంతరించుకున్నదని మీడియా తెలియజేసింది. కిమ్ చైనాలో 4 రోజులు పర్యటిస్తారు. గత ఏడాదికాలంనుండి కిమ్ చైనాలో పర్యటించడం ఇది 4వసారి. ట్రంప్‌తో భేటీకిముందు జిన్‌పింగ్‌తో చర్చలు ఎంతో ప్రాధాన్యత కలిగివున్నాయి. గత ఏడాది జూన్‌లో సింగపూర్‌లో ట్రంప్, కిమ్ శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొరియా ద్వీపకల్పంలో అణునిరాయుధీకరణను అమలుచేయాలన్న అవగాహనకు వచ్చారు.



అయితే దీనిపైన నిర్దిష్టమైన నిర్ణయాలు జరగలేదు. ఈ సమావేశం తరువాత ఉత్తరకొరియా, అమెరికా మధ్య చర్చలు వేగవంతం కాలేదు. త్వరలో తాను కిమ్‌ను తప్పనిసరిగా కలుసుకుంటానని ఆయన వద్దనుండి తనకు గొప్ప లేఖ అందిందని ఇటీవల ట్రంప్ ప్రకటించారు. తమ దేశానికి పూర్తి భద్రత కల్పించేవిషయంలో అమెరికా నిర్దిష్టమైన హామీ ఇవ్వనిదే పూర్తి అణునిరాయుధీకరణను పాటించటం ఎలా సాధ్యమని ఉత్తరకొరియా తాజాగా ప్రశ్నించింది. అనంతరం ట్రంప్ స్పందిస్తూ తాను త్వరలోనే కిమ్‌తో భేటీకానున్నట్టు వెల్లడించారు. కిమ్ తన భార్య రిసొల్-జు, అనేకమంది సీనియర్ అధికారులతో పాటు చైనాలో పర్యటిస్తున్నారు. కిమ్ ఈసారి కూడా కట్టుదిట్టమైన భద్రతతో రైలుమార్గంలోనే ప్రయాణించి చైనాలో ప్రవేశించారు. ఆయన బయలుదేరిన రైల్వేస్టేషన్ చుట్టూ అనేక డజన్లమంది అర్ధసైనిక దళాలు, పోలీసులు పహారా కాశారు. ట్రంప్‌తో జరగబోయే రెండవ శిఖరాగ్ర సమావేశానికి ఇది మొదటి అడుగుఅని దక్షిణకొరియా అధ్యక్షుడి ప్రతినిధి వ్యాఖ్యానించారు.

ఉత్తరకొరియా, అమెరికా మధ్య సంబంధాలను, చర్చలను తాము ఆహ్వానిస్తున్నట్టు చైనా విదేశాంగశాఖ ప్రతినిధి వెల్లడించారు. కొత్త సంవత్సరం సందర్భంగా దేశప్రజలనుద్దేశించి మాట్లాడిన కిమ్ ట్రంప్‌తో సమావేశం కావడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఒకవేళ తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయకపోతే ప్రత్యామ్నాయ పంథాను తాము ఎన్నుకుంటామని కిమ్ స్పష్టంగా ప్రకటించారు. ఉత్తరకొరియా అణు కార్యక్రమం సమస్యను పరిష్కరించడంలో చైనా తీసుకుంటున్న చొరవను అమెరికా విదేశాంగశాఖ మంత్రి మైక్‌పాంపియో తన తోడ్పాటును ప్రకటించారు.

తాలిబన్లు, అమెరికా ప్రతినిధుల భేటీ



కాబూల్ : తీవ్రవాద సంస్థ తాలిబన్ల నాయకులు, అమెరికా ప్రతినిధి జల్మాయ్‌ఖలీల్‌జాద్ ఇక్కడ భేటీ అయ్యారు. తాలిబన్ల ప్రతినిధులు అమెరికా అధికారులు రెండురోజులపాటు సమావేశమై శాంతి చర్చలు జరుపుతారు. ఈ సమావేశంలో ఆఫ్ఘన్ ప్రభుత్వ అధికారులు పాల్గొనడంలేదని తాలిబన్లు తెలిపారు. చర్చలలో ఆఫ్ఘన్ అధికారులను కూడా భాగస్వాములను చేయాలని పలుదేశాలు ప్రతిపాదించినప్పటికీ తాలిబన్లు తిరస్కరించారు. దాదాపు 17 ఏళ్లుగా దేశంలో అంతర్యుద్ధం జరగడానికి అమెరికా ప్రధాన కారణమని, ఆఫ్ఘన్ ప్రభుత్వం అమెరికా చేతిలో కీలుబొమ్మ అని తాలిబన్లు విమర్శిస్తున్నారు. అమెరికా సైన్యం దేశంనుండి తక్షణం వెళ్లిపోవాలని అనేకమార్లు తాలిబన్లు డిమాండ్ చేశారు. 2001లో అమెరికా నాయకత్వంలోని సంకీర్ణదళాలు చాలావరకు ఆఫ్ఘనిస్తాన్‌ను విడిచివెళ్లాయి. ఆ తరువాత ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయడానికి తాలిబన్లు పూనుకున్నారు. పశ్చిమదేశాల తోడ్పాటుతో ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రభుత్వం ఏర్పడాలని డిమాండ్ చేసిన సౌదీ అరేబియా ఈ సమావేశంలో పాల్గొనేందుకు తిరస్కరించింది. తాలిబన్లు అమెరికా ప్రత్యేక దౌత్యాధికారి ఖలీల్‌జాద్ మధ్య సమావేశం జరగడం ఇది నాలుగవసారి. ఇక్కడ సమావేశం ముగిసిన తరువాత ఇందులో పాల్గొన్నవారంతా బుధవారం ఖతార్ నగరం దోహాకు చేరుకుంటారు. ఇక్కడ కూడా రెండు రోజులపాటు సమావేశం జరుగుతుందని తాలిబన్ల ప్రతినిధి తెలిపారు. ఆఫ్ఘన్ అధికారులతో సమావేశం కావల్సిందిగా తాలిబన్లను ఒప్పించేందుకు పాకిస్థాన్, ఇరాన్ అధికారులు కూడా ప్రయత్నిస్తున్నారు. తమ మధ్య జరిగే చర్చలలో మరోదేశాన్ని భాగస్వామిని చేయబోమని తాలిబన్ నాయకులు చెబుతున్నారు. గత డిసెంబర్‌లో జరిగిన సమావేశంలో సౌదీ అరేబియా, పాకిస్తాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల ప్రతినిధులు పాల్గొని శాశ్వత శాంతి సాధనకు చర్చలు జరిపారు.

చైనాలో భారత రాయబారి మిశ్రీ

బీజింగ్ : చైనాలో భారత రాయబారిగా విక్రమ్ మిశ్రీని నియమించారు. ఆయన తన నియామక అర్హత పత్రాన్ని చైనా విదేశాంగశాఖ ప్రోటొకాల్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ హోంగ్‌లీకి అందజేశారు. సోమవారం ఆయన తన పదవీ బాధ్యతలను స్వీకరించి అనంతరం చైనా ఉన్నతాధికారులతో రెండు దేశాల మధ్యగల సంబంధాలను చర్చించారు. చైనా విదేశాంగశాఖలో ఆసియా వ్యవహారాల డైరెక్టర్ జనరల్ ఊజియాంగ్ ను కలుసుకుని ద్వైపాక్షిక సంబంధాలపైన సంప్రదింపులు జరిపారు. మిశ్రి 1989 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి. ఆయన వయస్సు 54 ఏళ్లు. ఇంతవరకు చైనాలో భారత రాయబారిగా పనిచేసిన గౌతమ్‌బంబావాలె గత నవంబరులో పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో మిశ్రి నియమితులై పదవీ స్వీకారం చేశారు. ఇటీవలకాలంలో భారత్, చైనాలు రెండు దేశాల మధ్య వివిధరంగాలలో సహకారాన్ని పెంపొందించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. మిశ్రీ నియామకం ఈ నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్నది. మిశ్రి చైనాలో బాధ్యత స్వీకరించడానికి ముందు మియన్మార్‌లో భారత దౌత్యవేత్తగా పనిచేశారు. భారత



విదేశాంగశాఖలో వివిధ హోదాలలో మిశ్రి పనిచేశారు. అలాగే ప్రధానమంత్రి కార్యాలయంలోను ఆయన పనిచేశారు. ఐరోపా, ఆఫ్రికా, ఆసియా, ఉత్తర అమెరికా దేశాలలోను భారత రాయబార కార్యాలయాలలో పనిచేశారు. 1964 నవంబర్ 7న ఆయన శ్రీనగర్‌లో జన్మించారు. ఆయన తన ఎంబిఎ విద్యను జంషెడ్‌పూర్‌లో పూర్తిచేశారు.

క్యూబాకు విప్లవాభినందనలు

హవానా : క్యూబా విప్లవం సాధించి 60 ఏళ్లు అయిన సందర్భంగా ప్రపంచంలోని వివిధ దేశాలు అక్కడి ప్రభుత్వాన్ని అభినందిస్తూ సందేశాలను పంపాయి. క్యూబా విప్లవ 60వ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా వేడుకలు జరిగాయి. వివిధ దేశాలలోని ప్రగతిశీల శక్తులు అభినందన సందేశాలను పంపాయి. అమెరికా దిగ్బంధం మధ్య ఫిడెల్‌కాస్ట్రో నాయకత్వంలో క్యూబా అనేకరంగాలలో ప్రత్యేకించి విద్య, వైద్య రంగాలలో సంపన్నదేశాలకు మించి విశిష్టమైన విజయాలను సాధించింది. క్యూబా విప్లవం ప్రపంచంలోని జాతీయ విముక్తి పోరాటాలకు స్ఫూర్తిగా, చిహ్నంగా నిలిచింది. దక్షిణాఫ్రికాలో ఫాసిస్టుజాతి వివక్షను నిర్మూలించేందుకు అనేక దశాబ్దాలుగా క్యూబా కీలకపాత్ర వహిస్తోంది. క్యూబా విప్లవం దక్షిణాఫ్రికాకు మరువలేని బహుమతి మాత్రమేకాదు. మొత్తం ఆఫ్రికాకు, మానవాళికి గొప్ప బహుమతి. 1980ల చివరినుండి 1991 నాటివరకు సోవియట్ యూనియన్‌తో పాటు ఇతర తూర్పు ఐరోపా దేశాలలోని పలు సోషలిస్టు దేశాలు పతనమైనప్పటికీ క్యూబా అజేయంగా నిలిచి సామాజిక విప్లవాన్ని సాధించింది. అమెరికానుండి



ఎదురయ్యే ముప్పును అది సమర్థంగా ఎదుర్కొన్నది. క్యూబా విప్లవం ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు మార్గదర్శిగా పనిచేసింది. ఆరోగ్యం, విద్య, క్రీడారంగాలలో అసాధారణమైన విజయాలను సాధించి కొనసాగిస్తున్నది. సామ్రాజ్యవాదం నుండి ఎదురయ్యే ముప్పును నేటికీ సమర్థంగా ఎదుర్కొంటున్నది. గొప్ప సంపన్నదేశంగా పేరుపొందిన అమెరికాకంటె మిక్కిలిగా పోరాడి విప్లవం సాధించిన క్యూబా సామాజిక జీవనం ఇతర సమాజాలకు గొప్ప స్ఫూర్తినిస్తున్నది.

కేంద్రానికి చెంపపెట్టు

సుప్రీం తీర్పుపై సీపీఐ వ్యాఖ్య

న్యూఢిల్లీ : సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) స్వాగతించింది. సీబీఐ చీఫ్‌గా ఆయనను అధికారాలు లేకుండా చేసి పక్కనపెడుతూ అక్టోబరులో ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను సుప్రీంకోర్టు రద్దుచేసింది. సెలెక్ట్ కమిటీ సమావేశమై ఈ అంశాన్ని చర్చించాలని, వారం రోజుల్లోగా వర్మ భవిష్యత్‌పై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించడాన్ని మంగళవారం ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం స్వాగతించింది. సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టువంటిదని ఆ ప్రకటన పేర్కొన్నది. సీబీఐ స్వయంప్రతిపత్తిని కాపాడాలని, సీబీఐ డైరెక్టర్‌ని నిరోధించడాన్ని అడ్డుకోవాలన్న ఉద్దేశం సుప్రీంకోర్టు తీర్పులో స్పష్టంగా కనిపిస్తోందని తెలిపింది. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడిచే బీజేపీ నేతృత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఈ తీర్పు చెంపపెట్టు వంటిదని పేర్కొన్నది. సెలెక్టు కమిటీ సమ్మతిలేకుండా డైరెక్టర్‌ని బదిలీచేయవద్దని, సీబీఐ స్వయంప్రతిపత్తిని కాపాడాలని కూడా తన తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని తెలిపింది. సీబీఐ డైరెక్టర్‌గా వర్మ రెండేళ్ల పదవీకాలం జనవరి 31తో ముగుస్తుందని, బలవంతంగా సెలవుపై పంపించిన కాలానికి అయినా ఆయన పదవిని పొడిగించాలని ఆ ప్రకటనలో పార్టీ కోరింది. వర్మ, ఆయన నంబరు టూ మధ్య వివాదం అసలైన సమస్య అన్నది అందరికీ తెలిసిన విషయమే, ఇరువురూ ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. అస్థానాపై సీబీఐ బృందం ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించింది. సీబీఐ తాత్కాలిక చీఫ్‌గా జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావును నియమిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని కూడా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రాఫెల్ కుంభకోణంపై అలోక్ వర్మ దర్యాప్తు జరుపుతున్న విషయం తెలిసిందే.

కేంద్రానికి మొట్టికాయ

(మొదటిపేజీ తరువాయి)

చెబుతున్నప్పటికీ, ఎలాంటి అధికారాలు లేకుండా గతేడాది అక్టోబరు 23న నిర్ణయం తీసుకోవటాన్ని కోర్టు తప్పుపట్టింది. వర్మను సెలవులో పంపించటం కుదరదని, వెంటనే బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తితో కూడిన సెలెక్ట్ కమిటీ వారం రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. అలాగే తాత్కాలిక డైరెక్టర్‌గా ఉన్న ఎం నాగేశ్వరరావు నియామకాన్ని కూడా కోర్టు పక్కన పెట్టింది. సీబీఐ డైరెక్టర్‌గా నియమితులైన అలోక్ కుమార్ వర్మ విధానపరమైన ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేసింది. సీబీఐ కేసులో కేంద్రం వ్యవహరించిన తీరును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఈ వ్యవహారంలో సీవీసీ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ధర్మాసనం పక్కనబెట్టింది. అలోక్ వర్మపై చర్యలు తీసుకోవడానికి ముందు కేంద్రం సెలెక్ట్ కమిటీని సంప్రదించి ఉండాల్సిందని న్యాయమూర్తి పేర్కొన్నారు. సీబీఐ డైరెక్టర్ వర్మ పదవీకాలం ఈ నెలాఖరున ముగియనుంది. సీబీఐ డైరెక్టర్ వర్మ, ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానా మధ్య తలెత్తిన వివాదాల నేపథ్యంలో కేంద్రం ఇద్దరినీ సెలవులో పంపించిన విషయం విధితమే. అయితే, దీనిని వర్మ సవాల్ చేస్తూ పిటిషన్‌ను దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 ప్రకారం కేంద్రం నిబంధనలకు భిన్నంగా వ్యవహరించిందని, సీవీ, డీఓపీటీ తీసుకున్న నిర్ణయాలను రద్దు చేయాలని కోరారు. వర్మ తరపున సీనియర్ న్యాయవాది ఫాలి ఎస్ నారిమన్ వాదించారు. రెండేళ్ల కాలానికి నియమించిన డైరెక్టర్‌ను ఎట్టి పరిస్థితిలోనూ బదిలీ చేయకూడదని ఆయన వాదించారు.

స్వైన్ ఫ్లూ విజృంభణ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : తెలంగాణలో చలి తీవ్రత పెరగడంతో స్వైన్‌ఫ్లూ విజృంభిస్తోంది. కొద్ది రోజులుగా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. తాజాగా ఎన్1హెచ్1 వైరస్‌తో ముగ్గురు గాంధీ ఆస్పత్రిలో చేరారు. వీరిలో సిద్దిపేటకు చెందిన వ్యక్తి(39), ఉప్పల్‌లో నివసించే యువతి(28), ఆల్వాల్‌కు చెందిన మరొకరు(43) ఉన్నారు. ఈ ముగ్గురికీ వైరస్ సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. ఇప్పటికే మరో ఇద్దరు ఈ లక్షణాలతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పారిశ్రామిక హబ్‌గా ఓర్వకల్లు

- హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు హామీ
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వస్తుంది
- ఏడాదిన్నరలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం
- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- కర్నూలు ప్రజలకు చంద్రబాబు వరాల జల్లు
- కేన్సర్ పరిశోధనా కేంద్రం, పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని, కర్నూలు జిల్లా ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. భవిష్యత్‌లో కర్నూలు జిల్లాను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసి నూతన చరిత్రకు శ్రీకారం చుడతామని వరాల జల్లు కురిపించారు. త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.88.50 కోట్లతో నిర్మించిన ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును చంద్రబాబు మంగళవారం ప్రారంభించారు. అలాగే వెయ్యి మెగా వాట్‌ల కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్కును ప్రారంభించారు. రూ.120 కోట్లతో నిర్మించనున్న కేన్సర్ నిర్మూలన పరిశోధనా ఆసుపత్రికి, మూడు ప్రదేశాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కుల నిర్మాణానికి, రూ.5 కోట్లతో నిర్మించనున్న నర్సుల వసతి గృహానికి శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును రాష్ట్ర ప్రభుత్వ సొంత నిధులతో నిర్మించామన్నారు. ఒకేసారి నాలుగు విమానాలు ల్యాండయ్యేలా రన్‌వే, టెర్మినల్ భవనం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. 1,010 ఎకరాల్లో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును నిర్మించినట్లు చెప్పారు. ఎయిర్‌పోర్టు ప్రారంభంతో అమరావతితోపాటు ఇతర ప్రాంతాల నుంచి పెట్టుబడిదారులు జిల్లాకు వచ్చే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్కు ద్వారా వెయ్యి మెగా వాట్‌ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో సోలార్ పవర్ ప్లాంట్‌లతో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. గాలితో విద్యుత్ ఉత్పత్తి



చేయటం వల్ల వాయు కాలుష్యాన్ని అధిగమించే అవకాశం ఉంటుందన్నారు. ప్రపంచంలో పెద్ద సోలార్ పార్కులలో కర్నూలు జిల్లా మూడోస్థానంలో ఉండగా, చైనా మొదటిస్థానం, రాజస్థాన్ రెండోస్థానంలో ఉన్నట్లు తెలిపారు. ఎయిర్‌పోర్టు రాకతో పెట్టుబడిదారులు పెద్ద సంఖ్యలో వస్తారని, ఫలితంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు.

స్వశక్తితోనే అభివృద్ధి

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా స్వశక్తితోనే అభివృద్ధి చెందుతున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో 15 వేల పంపుసెట్లు ఉన్నాయని, త్వరలోనే అందరికీ సోలార్ విద్యుత్ పంపుసెట్లను ఇస్తామన్నారు. రైతులకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు వల్ల అమరావతి, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతికి అతి తక్కువ సమయంలోనే వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. కర్నూలు జిల్లా పర్యాటకానికి అనుకూలమని తెలిపారు. జిల్లాలోని బెలూం గుహలు, శ్రీశైలం, యాగంటి, మహానంది, కర్నూలు కొండారెడ్డి బురుజు వంటి ప్రసిద్ధి పుణ్యక్షేత్రాలు ఉన్నాయన్నారు. కొలిమిగుండ్లను భవిష్యత్‌లో సిమెంట్ హబ్‌గా మారుస్తామన్నారు. ఉద్యానపంటల్లో జిల్లా మూడోస్థానంలో ఉందని, రానున్న రోజులలో మొదటిస్థానానికి తీసుకువెళతామన్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని తెలిపారు. పత్తికొండ, డోన్, ఆలూరు నియోజకవర్గాలలో తాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు చెరువులను హంద్రీ - నీవా నీటితో నింపేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ప్రతి ఇంటికీ స్మార్ట్ ఫోన్‌ను ఇస్తామని చంద్రబాబు వివరించారు. అనంతరం తిత్లీ తుపాను బాధితులకు ఓర్వకల్లు పొదుపు సంఘం సభ్యులు రూ.30 లక్షల చెక్కును చంద్రబాబుకు అందజేశారు.

ఘన స్వాగతం

ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి చంద్రబాబు గన్నవరం నుంచి విమానంలో ఓర్వకల్లు చేరుకున్నారు. చంద్రబాబుతోపాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖ మంత్రి లోకేష్‌కు డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్, ఎంపీ ఎస్పీవై రెడ్డి, జడ్పీ చైర్మన్ మల్లెల రాజశేఖర్, ఎమ్మెల్యేలు బీసీ జనార్ధనరెడ్డి, మణిగాంధీ, ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ మల్లిఖార్జునరెడ్డి, టీడీపీ నాయకులు కేఈ ప్రతాప్, ఏరాసు ప్రతాపరెడ్డి, కేఈ శ్యాంబాబు, టీజీ భరత్, చల్లా రామకృష్ణారెడ్డి, కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, విష్ణువర్ధనరెడ్డి, ఇంధన వనరులశాఖ కమిషనర్ అజయ్‌జైన్, రామాంజనేయులు, కలెక్టర్ సత్యానారాయణ ఘనస్వాగతం పలికారు.


ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ే అవసరం. రాజ్యాంగ (124వ సవరణ)బిల్లు 2019ని కేంద్ర కేబినెట్ సోమవారం ఆమోదించింది. లోక్‌సభ శీతాకాల సమావేశాల చివర రోజున సభ ముందు వుంచారు. మంత్రి బిల్లును సభలో ప్రవేశపెట్టినప్పుడు సమాజ్‌వాదీపార్టీ సభ్యులు తీవ్ర నిరసన తెలిపారు. 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్రం రాజకీయ ప్రయోజనాల కోసం ఈ కీలక నిర్ణయం తీసుకుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జనరల్ విభాగంలో ఆర్థికంగా వెనకబడిన వారికి 10% రిజర్వేషన్లు కల్పించాలని సోమవారం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీర్మానించారు. విద్య, ఉద్యోగ రంగాల్లో దీనిని వర్తింపజేస్తారు. 10 శాతం కోటా వల్ల బ్రాహ్మణులు, రాజ్‌పుట్‌లు, జాట్లు, మరాఠాలు, భూమిహార్‌లు, వైశ్య, కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ వంటి పలు సామాజిక వర్గాలు లబ్ధి పొందనున్నాయి. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలకున్న 49.5% రిజర్వేషన్లకు ఇది అదనం. అంటే రిజర్వేషన్లు 59.5% అవుతాయి.

తాయిలాలకు తయారు..

- సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధికి బీజేపీ తహతహ
- పన్ను కోతలకు కసరత్తు..?
- మధ్యతరగతి ఓటర్లే లక్ష్యం
- వేతన, పెన్షన్‌దారులకు పన్ను ప్రయోజనాలు
- గృహ రుణ వడ్డీపై మరింత రాయితీ



న్యూఢిల్లీ : కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రధాని మోడీ ప్రభుత్వం తన నాలుగేళ్ల పాలనలో పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ వంటి అనాలోచిత నిర్ణయాలతో సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనాన్ని ఛిద్రం చేసింది. వామపక్ష, ఇతర ప్రతిపక్ష పార్టీల నుంచి పెద్ద ఎత్తు విమర్శలు ఎదుర్కొంది. అయితే 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ లబ్ధి కోసం తాయిలాల తయారీపైనే దృష్టిపెట్టింది. ఇప్పటికే అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చింది. ఇప్పుడు మధ్యతరగతి ప్రజల ఓట్ల కోసం తహతహలాడుతోంది. ఇటీవల ప్రధాని మోడీ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ మధ్యతరగతి గురించి అవగాహనను పునర్నిర్వచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మధ్యతరగతి ప్రజల కోసం వేర్వేరు విధానాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెడతారు. ఈ సందర్భంగా వేతన, మధ్యతరగతి జీవులకు, పెన్షనర్‌లకు పన్ను ప్రయోజనాలు, పొదుపు పరిమితి పెంపు, గృహ రుణ వడ్డీపై మరింత రాయితీ వంటి ఉపశమనాలు కల్పించే అవకాశాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిశీలిస్తున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. 'దేశంలో అత్యంత నిజాయితీ పన్ను చెల్లింపుదారులుగా ఉన్న వేతన తరగతికి గత నాలుగు బడ్జెట్‌ల్లో ఉపశమనం కల్పించాం. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టనున్న తాత్కాలిక బడ్జెట్‌లో ఈసారి కూడా పరిమితుల లోపల చేయగలమని ఆ వర్గాలు వివరించాయి. ప్రాథమిక కస్టమ్స్ సుంకం అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సూచించబడుతుంది. కానీ పరిగణనలోకి తీసుకునే వస్తువుల వివరాలను మాత్రం వెల్లడించలేదు. చర్చలు తుది దశలో ఉన్నాయి.



మహిళా బిల్లుపై పాలకుల నిర్లక్ష్యం

దుర్గాభవాని ఫైర్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు ఆమోదంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని ఆగ్రహం వ్యక్తం చేశారు. శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో మహిళా బిల్లును ఆమోదించాలని దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ లెనిన్‌సెంటరులో నిరసన కార్యక్రమం జరిగింది. రిజర్వేషన్ల బిల్లు విధివిధానాలపై అధ్యయనం చేసేందుకు 1996 లో పార్ల మెంటరీ కమిటీ దేశ వ్యాప్తంగా పర్యటించి కేంద్రానికి నివేదిక ఇచ్చిందన్నారు. అయితే ఈ బిల్లు రెండు దశాబ్దాలుగా రాజ్యసభలో పెండింగ్‌లో ఉన్నా పాలకులు పట్టించు కోకపోవడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 71 ఏళ్లు దాటినప్పటికీ మహిళలు ఇంకా వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నారని దుర్గాభవాని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవా లయాల్లో ప్రవేశించకుండా అడ్డుకుంటున్న బీజేపీ నిజస్వరూపం బయటపడిందన్నారు. సమాఖ్య నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ మాట్లా డుతూ మహిళా సాధికారత, రుణమాఫీ కార్యక్రమాలు కేవలం ఎన్నికల హామీలుగా ఉన్నాయన్నారు. పోరాటాల ద్వారా సాధించు కున్న చట్టాలు, హక్కులు నిర్వీర్యమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు తమ్మిన దుర్గ, మైనంపాటి సుబ్బలక్ష్మి, ఆర్.అన్నపూర్ణ, చింతాడ పార్వతి, మచ్చాలక్ష్మి, నక్కా రాజ్య లక్ష్మి, అండమాని నాగమణి, శాంతి, ఠాకూర్ లక్ష్మి, దుర్గాశి రమణమ్మ, ఖైరున్నీసా బేగం పాల్గొన్నారు.



శ్రీకృష్ణ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పిస్తున్న సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి ఎ.వనజ, మేరుగు విజయకుమార్, మున్నంగి నరసింహారావు, దమ్ము సత్యనారాయణ, పోతరాజు నాగేశ్వరరావు. (ఇన్నర్‌లో శ్రీకృష్ణ)

తొలగించిన సాక్షర భారత్ సిబ్బందిని తిరిగి తీసుకోవాలి

ముఖ్యమంత్రికి సీపీఐ రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : వయోజన విద్యాశాఖలో తొలగించిన సాక్షర భారత్ సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, వారి న్యాయమైన కోర్కెలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం సీఎం చంద్రబాబుకి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ వయోజన విద్యాశాఖ సాక్షర భారత్‌లో మండల సమన్వయ కర్తలుగా (ఎంసీఓలు) 504 మంది, జిల్లా సమన్వయకర్తలుగా (డీసీఓలు) 40 మంది, గ్రామ సమన్వయకర్తలుగా (వీసీఓలు) రాష్ట్రంలో మొత్తం 19,959 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రాడ్యుయేషన్ వంటి ఉన్నత చదువులతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం వంటి అదనపు విద్యార్హతలు గల వారిని మండల సమన్వయకర్తలుగా నియమించగా గ్రామస్థాయిల్లో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు వీరు ఎంతో కృషి చేశారు. అన్ని ప్రభుత్వ పథకాలను మండల, గ్రామ స్థాయిల్లో లబ్ధిదారులకు చేరవేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు. 2010వ సంవత్సరం నుంచి చాలీచాలని వేతనాలతో విధులు సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న వీరిని తొలగిస్తున్నట్లుగా గత ఏడాది జూన్ 14న రాష్ట్ర వయోజన విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో సాక్షర భారత్ సిబ్బందిలో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా ఉద్యోగాలు కోల్పోయిన వీరి కుటుంబాలు వీధుల పాలయ్యే ప్రమాదం దాపురించింది. దిక్కుతోచని సాక్షర భారత్ సిబ్బంది ఆందోళనబాట పట్టారు. తక్షణమే తొలగించిన మండల, జిల్లా, గ్రామ సమన్వయకర్తలను విధుల్లోకి తీసుకోవాలి. వీరికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ హెల్త్ కార్డులు, హెచ్ఆర్ఏ వర్తింపచేయాలి. పెండింగ్‌లో ఉన్న వేతనాలను, టీఏ, డీఏలను చెల్లించాలి. వయో పరిమితితో నిమిత్తం లేకుండా గ్రామ పంచాయితీ, మండల పరిషత్ కార్యాలయాల్లో, డ్వామా, డీఆర్‌డీఏ, సర్వశిక్షా అభియాన్ వంటి శాఖల్లోని పలు విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రామకృష్ణ కోరారు.

రైతుల పడిగాపులు

- అందని మొక్కజొన్న బోనస్
- ఇప్పటివరకు రూ.96 కోట్లు జమ పెండింగ్‌లో రూ.194 కోట్లు
- మోకాలడ్డుతున్న ఆర్థికశాఖ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : బోనస్ కోసం మొక్కజొన్న, జొన్న రైతులు 6 నెలలుగా పడిగాపులు గాస్తున్నారు. నిధులు విడుదలైనప్పటికీ క్లియరెన్సు ఇవ్వడానికి ఆర్థికశాఖ మోకాలడ్డటంతో రైతుల బ్యాంకు ఖాతాలలో సొమ్ములు జమకావడంలేదు. దీంతో రైతాంగం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత రబీ సీజన్‌లో 2.28లక్షల హెక్టార్లలో మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేయగా, 1.52కోట్ల క్వింటాల్ దిగుబడులు వచ్చాయి. అయితే ఈ పంటలకు కనీస మద్దతు ధర లభించలేదు. మొక్కజొన్న కనీస మద్దతు ధర క్వింటా రూ.1,450 ఉండగా మార్కెట్‌లో కేవలం రూ.1,050 మాత్రమే ధర పలికింది. జొన్న కనీసమద్దతు ధర క్వింటా రూ.1,725 ఉండగా,రూ.1,100 మాత్రమే ధర పలకడంతో రైతులు నష్టపోయారు. ఈ నేపథ్యంలో క్వింటాకి రూ.200 చొప్పున గరిష్ఠంగా రూ.20వేలు వరకు బోనస్ ఇచ్చి ఆదుకుంటామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించి రూ.290 కోట్లు నిధులు 3.21లక్షల మంది రైతులకు పంపిణీ చేసేందుకు విడుదల చేసింది. నిధులు విడుదలై ఆరునెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు కేవలం 97వేల మంది రైతుల బ్యాంకు ఖాతాలలో రూ.96 కోట్లు మాత్రమే జమ అయ్యాయి. ఇంకా 2.24లక్షల రైతుల ఖాతాలలో రూ.194కోట్లు జమ కావాల్సిఉంది. ఈనేపథ్యంలో అధికారులు ఆర్థికశాఖ క్లియరెన్సు కోసం బిల్లులు పంపినప్పటికీ క్లియరెన్సు లభించలేదు. దీంతో బోనస్ జమకాక రైతులు విలవిలలాడుతున్నారు. ఇప్పటివరకు గుంటూరుజిల్లాలో 45,315 మందికి రూ.50.44కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 33,100 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.38.82కోట్లు జమ అయ్యాయి. కర్నూలు జిల్లాలో రూ.5.19కోట్లు 16,700 బ్యాంకు ఖాతాలలో, విశాఖ పట్నం జిల్లాలో రూ.78లక్షలు 1,312 బ్యాంకుఖాతాలలో, కడపజిల్లాలో రూ.26లక్షలు వెయ్యిమంది రైతుల ఖాతాలలో జమ చేశారు. మిగిలిన మరో ఏడు జిల్లాల్లో రైతులకు నిధులు జమ చేయాల్సిఉంది. ఈనేపథ్యంలో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం సాంకేతిక కారణాలను సాకుగా చూపి నిధులను జమ చేయడంలేదని రైతులు విమర్శిస్తున్నారు.

15 రోజుల్లో జమ చేయకుంటే నిరసనలు

మరో 15రోజుల్లో బోనస్ జమ చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని రైతు సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు. ఆర్థికంగా చితికిపోయిన రైతాంగానికి అండగా ఉండాల్సిన ప్రభుత్వం ఆర్థికశాఖ క్లియరెన్సు పేరుతో జాప్యం చేయడం తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కరవు నేపథ్యంలో రాష్ట్రంలో 347 మండలాల్లో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందనీ, ఈనేపథ్యంలో ప్రభుత్వం త్వరితగతిన బోనస్ ఇవ్వాలని నాయకులు డిమాండు చేస్తున్నారు.

ఓవర్‌డ్రాఫ్ట్ వల్లే..

రాష్ట్రప్రభుత్వ ఖజానాలో సొమ్ములు లేకపోవడంతో ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే బిల్లులు క్లియర్ అవ్వడంలేదని అధికారులు చెబుతున్నారు.

ప్రజానాట్యమండలి సీనియర్ నేత శ్రీకృష్ణ మృతి

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు, బుర్రకథ కళాకారులు పడవల శ్రీకృష్ణ(90) కృష్ణాజిల్లా కంకిపాడు సమీపంలోని ఉప్పులూరు గ్రామంలో తన స్వగృహంలో సోమవారం మరణించారు. ఆయన భార్య గతంలోనే మరణించగా, ఒక కుమారుడు ఉన్నారు. శ్రీకృష్ణ స్వస్థలం కూచిపూడి సమీపంలోని కాజా గ్రామం కాగా, ఉప్పులూరులో స్థిరపడ్డారు. ఆయన 1929లో కాజాలో జన్మించారు. చిన్నతనంలోనే ఆయన తల్లిదండ్రులు చనిపోగా మేనమామల ఇంట పెరిగారు. ప్రముఖ సినీనటులు శోభన్‌బాబుకి పీఏగా పనిచేసినా అంగలూరు గ్రామానికి చెందిన కళాకారుడు ఉమామహేశ్వర్‌రావు వద్ద బుర్రకథను నేర్చుకున్నారు. 12ఏళ్ల వయసులోనే మీర్జాపురం, మైలవరం జమిందారుల ప్రోత్సాహంతో కళాకారుడిగా ఎదిగారు. కంజీర వాయించడంలో మంచి నైపుణ్యంకల కళాకారుడు. 15ఏళ్ల లోపు వయసులోనే ప్రేమలీల నాటకం నేర్చుకుని ఇతర మిత్రులతోకలిసి రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో నాటకప్రదర్శన ఇచ్చారు. అప్పట్లో అక్కినేని నాగేశ్వరరావు స్త్రీ వేషంతో గుడివాడలో తెలుగుతల్లి నాటకం ప్రదర్శించారు. ఆనాటకాన్ని వీక్షించిన శ్రీకృష్ణ సహచర పిల్లలతోకలిసి నాటకం నేర్చుకుని అనేక ప్రాంతాలలో ప్రదర్శించారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో ఈ ప్రాంతంలో క్రియాశీలంగా పనిచేసారు. అలాగే ప్రజానాట్యమండలి రాష్ట్ర దళంలో ఉంటూ అనేక ప్రదర్శనలు ఇచ్చారు. వంతులుగా నాగిరెడ్డి, రంగనాయకులుతో కలిసి రాష్ట్ర బుర్రకథ దళాన్ని ఏర్పాటుచేసి రాష్ట్రమంతటా తిరిగి బుర్రకథను ప్రదర్శించి ప్రశంసలు, సన్మానాలు పొందారు. కమ్యూనిస్టు పార్టీ విడిపోయిన తర్వాత వంతులుగా బుర్రకథల్లో పనిచేసిన నాగిరెడ్డి, రంగనాయకులు సీపీఎంలో చేరగా, శ్రీకృష్ణ సీపీఐలోనే కొనసాగి పార్టీ కార్యకలాపాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగానే కొత్త బుర్రకథ దళాన్ని తయారుచేసారు. కొంతకాలం విజయవాడలో నివసించారు. అనంతరం పెదఓగిరాలలో కొంతకాలం ఉన్నారు. నాటకరంగంలో హేమాహేమీలైన ఆంజనేయరాజు, పులిపాటి వెంకటేశ్వర్లు, పూల సూరిబాబు, వేమూరి గగ్గయ్యలాంటి ఉద్దండులైన నటులతో కలిసి ఎన్నో ప్రదర్శనలను ఇచ్చారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా కష్టజీవులు బుర్రకథను, మాభూమి నాటకాన్ని అనేక ప్రాంతాలలో ప్రదర్శించారు. బుర్రకథ కళాకారుడిగా ప్రసిద్ధిచెందిన నాజర్‌కు పద్మశ్రీ వచ్చిన సందర్భంగా కాజాగ్రామంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా నాజర్ మాట్లాడుతూ, అభినయంలో తనతో సమానంగా లేకపోయినా శ్రీకృష్ణ గళంముందు ఎవరూ ఆగరని ప్రశంసించారు. ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాలతో సమంగా పాటలుపాడేవారని ప్రశంసలుఅందుకున్నారు. కవిరాజు రచించిన 'ఖూనీ' నాటకంలో గౌతమ మహర్షి శిష్యుడి పాత్రను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. శ్రీకృష్ణకు బుర్రకథలో కొంతకాలం ఒంటరిగా కర్నాటి లక్ష్మీ నరసయ్య, ఆ తరువాత విరసంలోచేరిన సలాది భాస్కరరావు నటించారు. పోరంకి, చల్లపల్లి గ్రామాలలో శ్రీకృష్ణను ఘనంగా సత్కరించారు.

సంపాదకీయం

మోడీ.. కోటా కుట్ర!

ఎన్నికలు సమీపిస్తున్న దశలో కేంద్రంలోని మోడీ సర్కారు అగ్రకులాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించడం కల్లోల జలాల్లో చేపల వేటకు సిద్ధమైన చందంగా ఉంది. అత్యంత సున్నితమైన ఈ అంశాన్ని ఎంతో సంయమనంతో, తగిన జాగ్రత్తలు తీసుకొని పరిష్కరిం చాల్సి ఉండగా, ఎన్నికల జిమ్మిక్కుగా హడావుడిగా చేపట్టడమే సర్కారు చిత్తశుద్ధి ఏపాటిదో వెల్లడిస్తోంది. సవాలక్ష కష్టాల్లో ఉన్న మోడీ ఎన్నికల్లో గట్టెక్కాలన్న ఆత్రుతతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. పార్లమెంటు లోపలా, వెలుపలా ఎంతో లోతుగా చర్చించాల్సిన అంశాన్ని ఒకటి, రెండు రోజుల్లో ఆమోదింపచేయాలనుకోవడమే పొరపాటు. వ్యవసాయ రంగం దెబ్బతినడమో, ప్రతిభకు ప్రాధాన్యత కరవవుతున్నదనే బాధో, అణగారిన సామాజిక వర్గాలపై అక్కసో... కారణం ఏమైనా ఝాట్‌లు, పటేల్‌లు, మరాఠాలు, కాపులు వంటి బలమైన అగ్రకులాలు తమకు రిజర్వేషన్లు కావాలంటూ ఆందోళన చేస్తున్నాయి. ఈ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలు న్యాయస్థానాల్లో నిలవలేదు. అగ్రవర్ణ అనుకూలమైనదిగా ముద్రవేయించుకొన్న బీజేపీకి ఆ వర్గాలు గట్టి ఓటు బ్యాంకుగా ఉన్నాయి. అదే విధంగా వెనుకబడిన తరగతుల్లో కూడా ఆ పార్టీకి గట్టి బలం ఉంది. హిందూత్వ పునాదితో ఆ రెండు వర్గాల మద్దతుతో దూసుకుపోతున్న బీజేపీకి ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు చేదు అనుభవాన్ని మిగిల్చాయి. ఇందుకు ఆ వర్గాల్లో నెలకొన్న అసంతృప్తే కారణంటూ బీజేపీలో అంతర్మథనం జరుగుతున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి అధికారం అందుకోవచ్చన్న యావతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తేటతెల్లమవుతోంది. ఎనిమిది లక్షల వార్షికాదాయం, ఐదెకరాల వ్యవసాయ భూమి, వెయ్యి చదరపు అడుగుల ఇల్లు ఇత్యాది పరిమితులు విధించి ఈ రిజర్వేషన్ కల్పించనున్నారు.

అగ్రవర్ణ పేదల కోటాకు సంబంధించి మండల్ కమిషన్ కాలంలో వీపీ సింగ్ ఇచ్చిన హామీ సఫలం కాలేదు. పేదలకు విద్య, ఉద్యోగాల్లో పదిశాతం రిజర్వేషన్ల సదుపాయం కల్పిస్తూ 1991లో పీవీ నరసింహారావు ప్రభుత్వం నిర్ణయించినప్పుడు సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇది రాజ్యాంగంలోని 16వ అధికరణాన్ని ఉల్లంఘించడమేనని ప్రకటించింది. ఆ తర్వాత ఏ ప్రభుత్వమూ దాని జోలికి వెళ్లలేదు. ఆర్థిక సంస్కరణల దుష్ఫలితాల కారణం చేతివృత్తులు దెబ్బతినడం, సాగు సంక్షోభం తలెత్తడంతో వాటిపై ఆధారపడిన కులాల జీవన పరిస్థితులు ఒడుదొడుకులకు లోనయ్యాయి. ఈ క్రమంలోనే తమకు రిజర్వేషన్లు కావాలంటూ ఆ కులాలు గొంతెత్తాయి. అంతేకాదు, తమకు రిజర్వేషన్ల ఫలాలు అందటం లేదంటూ ఎస్సీ కులాల్లో, ఓబీసీ కులాల్లోని అత్యంత వెనుకబడిన వర్గాలు వర్గీకరణకు డిమాండు చేస్తున్నాయి. మన ఆర్థిక వ్యవస్థ పనితీరు అద్భుతం అని చెబుతున్నాం. జీడీపీ క్రమేపీ పెరుగుతూ వస్తున్నదంటాం. ఈ అసంతృప్తికి కారణం క్షేత్రస్థాయిలో వాటి ఫలాలు సక్రమంగా దక్కకపోవడమేనని స్పష్టమవుతోంది. అగ్రవర్ణ పేదలకు లబ్ధి చేకూర్చడానికి ఎవరూ వ్యతిరేకించరు. కానీ, ప్రభుత్వ రంగంలో అసలు ఉద్యోగాలున్నాయా? రిటైరైన వారి స్థానంలో కొత్త నియామకాలు జరుగుతున్నాయా? దేశంలో వివిధ రంగాల్లో లక్షలాది ఉద్యోగ నియామకాలు జరగాల్సి ఉంది. చాలా చోట్ల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లోనే పనులు కానిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కోటా విస్తరణ ఏకైక పరిష్కారం కాగలుగుతుందా? నిరుద్యోగాన్నీ, పేదరికాన్ని సమూలంగా తుడిచి పెడుతుందా? ఆర్థిక సంక్షోభానికీ, వివిధ వర్గాల అసంతృప్తికి మధ్య ఉన్న మూల కారణాలను పట్టుకొని పరిష్కరించకుండా, ప్రభుత్వ రంగంలో ఉపాధి అవకాశాలు పెంచకుండా ఈ కోటా వల్ల ప్రయోజనం ఏమిటి? కాగా, రిజర్వేషన్లు 50శాతం దాటరాదన్న అనుల్లంఘ నీయమైన పరిమితిని ఇంద్రాసహానీ కేసులో సుప్రీంకోర్టు విధించింది. ఈ తాజా కోటాను కలిపితే మొత్తం రిజర్వేషన్లు 60శాతానికి చేరతాయి. అది సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధం. కాబట్టి ఈ అడ్డంకిని తొలగించుకోవడానికి వీలుగా రాజ్యాంగ అధికరణలు 15, 16 సవరించడానికి మోడీ సర్కారు పూనుకొంది. రాజ్యాంగ సవరణ బిల్లు చట్టం కావాలంటే ఉభయ సభల్లో మూడింట రెండొంతుల ఆధిక్యంతో ఆమోదం లభించాలి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లును ఓట్ల కోసం విసిరిన ఎన్నికల వలగా పేర్కొంది. మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ సాగింది. ఇక్కడ గట్టెక్కినా రాజ్యసభలో బీజేపీకి తగిన బలం లేనందున ఈ ప్రయత్నం అక్కడే ఆగిపోయే అవకాశం ఉంది. అంతేకాదు, దేశంలో కనీసం సగం శాసనసభలు కూడా ఈ సవరణను ఆమోదించాల్సి ఉంటుంది. దీన్ని కూడా ఎన్నికల ప్రచారాస్త్రంగా మార్చుకోవాలన్నదే మోడీ ఎత్తుగడ. బీజేపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల ఎనిమిది మాసాలు గడిచిన తర్వాత ఇప్పుడు ఈ ఆలోచన ఎందుకు వచ్చిందంటూ కొన్ని పార్టీలు ప్రశ్నిస్తున్నాయి. ఇటీవల ట్రిపుల్ తలాక్ నిషేధం బిల్లు లోక్‌సభలో ఆమోదం పొంది రాజ్యసభలో విఫలమైన చందంగానే ఈ బిల్లు పరిస్థితి ఉంటుందని విశ్లేషకుల అంచనా. ఒకవేళ ఈ అధికరణలను సవరించితే.. ఆ తర్వాత తమిళనాడు రిజర్వేషన్ చట్టం తరహాలో దీన్ని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి న్యాయస్థానాల నుంచి రక్షణ కల్పించాల్సి ఉంటుంది. అయితే ఈ షెడ్యూల్‌లో చేర్చినవాటిని కూడా రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భంగకరమని అనిపిస్తే.. తప్పక సమీక్షిస్తానని సుప్రీంకోర్టు గతంలోనే ప్రకటించింది. మన రాజ్యాంగం ఆర్థిక వెనుకబాటు తనాన్ని రిజర్వేషన్లకు ప్రాతిపదికగా తీసుకోవడంలేదు. తరతరాలుగా సామాజిక అణచివేత, వివక్షాపూరితమైన కుల వ్యవస్థ కారణంగా అన్ని విధాలా వెనకబడిన వారికి మన రాజ్యాంగం రిజర్వేషన్ల సదుపాయం కల్పించింది. ఇందుకు, రాజ్యాంగంలోని సర్వసమానత్వ నిబంధనను సడలించి సానుకూల వివక్ష సూత్రాన్ని రాజ్యాంగ నిర్మాతలు ఆశ్రయించారు. ఇప్పుడు ఈ పదిశాతం కోటా కల్పించాలంటే రాజ్యాంగంలోని సాంఘికంగా, విద్యావిషయకంగా అనే పదబంధాన్ని మార్చి ఆర్థికంగా అనే దానిని చేర్చాల్సి ఉంటుంది. అంతేకాదు, బీసీ క్రీమీలేయర్‌ను నిర్ధారించే 8లక్షల రూపాయల వార్షిక ఆదాయపరిమితినే ఈబీసీ రిజర్వేషన్లకు హద్దుగా నిర్ణయించడమంటే ఈ రెండు వర్గాలను సమానం చేయడమే అవుతుంది. క్రీమీలేయర్‌ను గుర్తించి వడగట్టడం ఎంతో కష్టమైన పని కనుక, నిజమైన అగ్రవర్ణ పేదలకు ఈ రిజర్వేషన్ల ద్వారా లబ్ధి చేకూరుతుందని కూడా భావించలేం. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో తమను బీసీలుగా గుర్తించి, బీసీ రిజర్వేషన్ ఇవ్వాలని పోరాడుతున్న కులాలు ఈ తాజా రిజర్వేషన్‌తో సంతృప్తి పడతాయా? ఒక పక్క పాతిక లక్షల ఉద్యోగాలను భర్తీచేయకుండా ఖాళీగా వదిలేసి, కొత్త రిజర్వేషన్ల కోసం మోడీ ప్రయోగించిన ఈ ఎన్నికల అస్త్రం సరికొత్త సమస్యలను తెచ్చిపెడుతుంది. సమాజంలో కొత్త వైషమ్యాలకు దారితీస్తుందనడంలో సందేహం లేదు. హార్దిక్ పటేల్ అంటున్నట్టుగా ఇది చివరి లాలీపాప్ కాదు, బూమ్‌రాంగ్ అవుతుంది.

చురక

అగ్రవర్ణ పేదలకు
ఆర్థికంగా ఇక కోటా
ఎన్నికల్లో జిమ్మిక్కుగ
ఎరవేసిన ఓట్లవేట

రిజర్వేషన్ తేనెతుట్టె
రాల్చేబాట మోడీ పట్టే
ప్రజల మధ్య దేశంలో
పగలు పెంచే చిచ్చు పెట్టే

– వేల్పుల నారాయణ

అంతర్జాతీయం

యూ.ఎస్. 'షట్‌డౌన్'


బుడ్డిగ జమిందార్

డిసెంబర్ 22, 2018 నాటినుండి అమెరికా ప్రభుత్వం ఆర్థికపరంగా స్తంభించింది. మరో విధంగా చెప్పాలంటే ప్రభుత్వ తలుపులు పాక్షికంగా మూసివేయ బడ్డాయి. ఆర్థిక లావాదేవీలు జరగటం లేదు. డబ్బులు విడుదల కావటం లేదు. మొత్తం దేశంలోని అత్యవసర పనులు జరగటం లేదు. శానిటరీ స్తంభించింది, మ్యూజియంలకు, పబ్లిక్ పార్కులకు తాళాలుపడ్డాయి. ప్రభుత్వం సుమారు పది లక్షల మంది కార్మికులు, ఉద్యోగులకు వేతనాలు చెల్లించనంటుంది.



4 లక్షల మంది కార్మికులు పబ్లిక్ విధుల్లో తప్పనిసరిగా పాల్గొనవలసిన వారు, వేతనాలు లేకుండానే పని చేయవలసిన దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అమెరికా రాజ్యాంగ 13వ సవరణకు ఇది వ్యతిరేకంగా ప్రపంచ సోషలిస్టు వెబ్‌సైట్ వ్రాసింది. 13వ రాజ్యాంగ సవరణ అనేది వెట్టిచాకిరీకి వ్యతిరేక మైనదిగానూ, స్వచ్ఛంద సేవల పరిధిలో కాకుండా బలవంతపు పనుల కిందకు వస్తుందని పేర్కొంది. అవకాశా లున్న చోట్ల స్థానిక సంస్థలు వారికున్న నిధుల అందుబాటు ననుసరించి నగర ప్రధాన వీధులను శుభ్రం చేస్తున్నారు. వాషింగ్టన్ మేయరు వారానికి 46 వేల డాలర్లతో రోడ్లను ఊడ్పిస్తుం దన్నారు. స్టాట్యు ఆఫ్ లిబర్టీ, ఇల్లీస్ దీవులను సందర్శకులకు అందుబాటులో ఉంచటానికి న్యూయార్క్ గవర్నరు రోజుకు 65 వేల డాలర్లను వెచ్చిస్తున్నట్లు బీబీసీ వ్రాసింది. ఫెడరల్ ఇన్‌స్టిట్యూషన్స్ కలిగి ఉన్న చిన్న చిన్న పట్టణాలు మాత్రం తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నాయి. హెూటళ్లు, రెస్టారెంట్లు, చిన్న చిన్న దుకాణాలు బోసిపోతుండగా గంటల తరబడి మూసి వేస్తున్నారు. నేషనల్ సైన్స్ ఫౌండేషన్ వంటి సంస్థల్లో పని చేస్తున్న శాస్త్రవేత్తలు నిధులు లేక పనులను ఆపివేస్తున్నారు. లేబరేటరీల పరిస్థితులు ప్రయోగాలు చేయలేని కారణంగా మూతబడుతున్నాయి. అడ్వాన్స్‌మెంట్ సైన్స్ అసోసియేషన్ శాస్త్రవేత్త ఒకరు 'పరిశోధన కార్యకలాపాల్ని మొత్తంగా మూసివేసి, ప్రాజెక్టుల నిర్వహణలో పురోగతి సాధించలేని స్థితికి చేరుకొన్నామని' అన్నారు. విమానాశ్రయా ల్లోని రవాణా భద్రతా సిబ్బంది రోజురోజుకు వ్యాధుల పాలవుతున్నారని, తద్వారా ప్రయాణీకులు క్యూలలో ఎక్కువ సేపు నిలిచి ఉండాల్సి వస్తుందని బీబీసీ వ్రాస్తున్నది. విమాన ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది 'యూ.ఎస్. షట్‌డౌన్'తో అవస్తలపాలవ్వటంతో రోజుకు 45 వేల విమానాలు ఎగరటం కూడా కష్టంగా ఉంటుంది. వ్యవసాయ రంగంలో నిధులు అందటం లేదు. ఫెడరల్ ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్న రైతులు ఇబ్బందుల పాలువుతున్నారు. నిధుల లేమితో వ్యవసాయ వనులు సాగటం లేదు. మొత్తం మీద అమెరికాలో అంతరంగిక భద్రతా డిపార్టుమెంటు, న్యాయవ్యవస్థ, గృహ నిర్మాణాలు, వ్యవసాయం, ట్రెజరీ, కామర్స్ మొదలగు 9 డిపార్టుమెంట్లు నడవలేని స్థితికి చేరుకొన్నాయి. సోషల్ మీడియాలో ప్రజానీకం తీవ్ర నిరసనల్ని తెలియజేస్తున్నారు. ట్రంప్ మాత్రం నీరోచక్రవర్తిలా తన ధోరణిలో ఏమాత్రం మార్పు లేకుండా ట్వీట్లతో స్పందిస్తూ కాలాన్ని గడుపుతున్నారు.

ఈ సంక్షోభానికి ప్రధాన కారణం అమెరికా – మెక్సికోలకు మధ్యన సరిహద్దు గోడను నిర్మించటానికి ట్రంప్ నిధులను విడుదల చేయమని ఒత్తిడి తేగా, కాంగ్రెస్ (పార్లమెంటు) మొత్తం ఖర్చులను, నిధుల విడుదలను ఆపేసింది. దీంతో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో అతిపెద్ద జీడీపీతో ప్రపంచాన్ని శాసించాలనుకునే అమెరికా నోటికి తాత్కాలిక తాళం పడింది. అయినప్పటికీ ట్రంప్ ధోరణిలో ఏమాత్రం మార్పు రాలేదు సరికదా అవసరమైతే తనకు గల పరిపాలనా హక్కులతో అత్యవసర పరిస్థితిని విధించైనా మెక్సికో సరిహద్దు దగ్గర కృత్రిమ గోడను 2 వేల మైళ్ల పొడవున 1500 కోట్ల డాలర్లతో కట్టి తీరుతానని భీష్మించి కూర్చు న్నారు. అవసరమైతే తన అధికారాలతో మిలిటరీ నిధుల్ని మళ్లించి యుద్ధ ప్రాతిపదికన గోడను నిర్మిస్తానంటున్నారు.

ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వం స్తంభనకు గురికావటం ఇది మూడవసారి. అదీ గత సంవత్సరం 2018లోనే కావటం విశేషం. 2018 జనవరిలో మొదటి సారిగా 3 రోజులు, ఫిబ్రవరిలో 2 రోజులు, డిసెంబర్‌లో ప్రారంభమై నేటికి 18 రోజులు దాటినా ఇంకా ఎటూ తేలని మూడవసారి ప్రభుత్వ ఆర్థిక సంక్షోభం. 1995లో ఎక్కువకాలం 21 రోజులతో బిల్‌క్లింటన్ సమయంలో జరిగింది. కాగా 1981 నుండి గడచిన 37 సంవత్సరాలలో మొత్తం 15 సార్లు యూ.ఎస్. ప్రభుత్వం 'షట్‌డౌన్'కు గురైంది.

ఆర్థిక స్థంభనతో హోమ్‌మంత్రిత్వ శాఖ ద్వారా సహాయం పొందుతున్న 20 లక్షల దేశీయ అమెరికా తెగల ప్రజలతో పాటుగా, లక్షలాది బీదఅమెరికన్లు పొందే ఫుడ్‌స్టాంప్స్(రేషన్ టోకెన్లు) ఆగిపోయి దిక్కుతోచని పరిస్థితుల్లోకి నెట్టివేయ బడ్డారు. అమెరికా కాంగ్రెస్ హౌస్ సభా ధ్యక్షురాలు నాన్సీ పెలోసీ ఒక ఇంట ర్వ్యూలో మాట్లాడుతూ ప్రస్తుతం ట్రంప్ విధానాల వలన అమెరికా ప్రభుత్వం మూతబడు తుందని, సరిహద్దు గోడ నిర్మాణమవు తుందని భావించటంతోపాటుగా మొత్తం యూ.ఎస్. కాంగ్రెస్ కూడా మూతబడుతుందని, కేవలం ట్రంప్ గొంతు మాత్రమే అమెరికా అంతటా (నియంతలా) వినబడుతుందని అన్నారు. విచిత్రమేమంటే డెమోక్రాట్లలో కూడా భిన్నాభిప్రాయాలతో ట్రంప్‌ను వ్యతిరేకించలేక పోతున్నారు. పైగా కొద్దిమంది ట్రంప్ నిరంకుశత్వాన్ని బలపరుస్తూ రాజ్యాంగాన్ని చులకన చేస్తున్నారు. ట్రంప్ ప్రచారం చేస్తున్నట్లుగా మెక్సికో సరిహద్దు నుండి టెర్రరిస్టుల ప్రవేశం జరగటం లేదు. ప్రపంచబ్యాంకు, ఐఎమ్ఎఫ్ షరతుల మధ్య నలిగిపోయిన కొద్దిమంది ఉద్యోగాన్వేషణలో మాత్రం అమెరికాకు రావటానికి ప్రయత్నిస్తున్నారు. మెక్సికన్స్ తరతరాల నుండి వ్యవసాయ ఉపాధికై సీజన్లలో అమెరికా వెళ్లటం, పనులు ముగించుకుని మరలా వారి వారి స్వగ్రామాలకు తిరిగి రావటం పరిపాటే. పైగా ఇప్పటి దక్షిణ, పడమర భాగాల్లోని అమెరికా ఒకప్పటి మెక్సికోయే గదా! మెక్సికో స్పెయిన్ సామ్రాజ్యం, బ్రిటీష్ సామ్రాజ్యాల మీదుగా ప్రస్తుతం అమెరికా చేతుల్లోకి ఆక్రమించుకోగా వెళ్లినదే గదా!

గోడల నిర్మాణం అనేది మనుషులకు, మనస్సులకూ మధ్య సృష్టించబడేది. సరిహద్దులకు సౌభ్రాతృత్వాలకు మధ్య, అధికా రానికి – ఆకలికి మధ్య నిర్మించబడే దుర్మార్గానికి, దౌర్జన్యానికి, నియంతృత్వానికి, రాక్షసత్వానికి రక్షక కవచాలుగా దోపిడీదారుల సంపదను రక్షించుకోవటానికి నిర్మించుకొనేది. ఒక వేళ నిజంగా ప్రస్తుతం నేడున్న ఆర్థిక అసమానతల మధ్య, దోపిడీ దేశాలు – దోచుకోబడే దేశాల మధ్య, అశాంతుల మధ్య, వలసలకు కారణమవుతున్న యుద్ధాల బారి నుండి రక్షించుకోటానికి గోడల నిర్మాణమంటూ జరిగితే ముందుస్థాయిలో అమెరికా వ్యతిరేక గోడను మెక్సికో నిర్మించుకోవాలి. సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాల నుండి ఖనిజ, అటవీ సంపదలను చౌకగా దిగుమతి చేసుకొంటుంది. వందల మిలియన్ల బ్యారెళ్ల ముడి చమురునూ తెచ్చుకొంటుంది. ప్రజల రక్తమాంసాలను వస్తు రూపంలో తెచ్చుకొంటుంది. కానీ అక్కడి ప్రజలను గౌరవించి, తోటి ప్రజానీకంతో సరితూగేలా ఎందుకు మానవ వనరులను దిగుమతి చేసుకోదనేదే ప్రశ్న? పైగా గోడల నిర్మాణం ఎందుకు చేయబడుతుంది? ఇక్కడే సామ్రాజ్యవాద వ్యతిరేక కార్మిక ఐక్య ఉద్యమం అన్ని దేశాల్లో ముందుకెళ్లిన నాడే సమస్యకు పరిష్కారం దక్కు తుంది. అందుకే హద్దులు లేని, సరిహద్దులు లేని సకల మానవ సౌభ్రాతృత్వం వెల్లివిరిసే సమసమాజం రావా లని మార్క్స్ కోరుకొన్నాడు. సర్వమానవాళి ఒక్కటి కావాలని, అందరూ సమంగా, సంతోషంగా, స్వేచ్ఛగా బతికే కమ్యూనిజం రావాలని ఓ మార్గాన్ని మార్క్స్ అందించాడు.

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు.
సెల్ : 9849491969

కో.. ఢీ!

ప్రపంచ దేశాలన్నీ ఇప్పుడు, ఆంధ్ర ప్రదేశ్‌వైపే చూస్తున్నాయని మన ప్రియతమ ముఖ్యమంత్రి చెబితే, కొందరు నవ్వుకున్నారు. కొందరు రాతగాళ్లు వెటకారాలు రాశారు. కూతగాళ్లు ఇల్లెక్కి మరీ కూశారు. కానీ, ముఖ్యమంత్రి చెప్పింది ముమ్మాటికీ నిజమేనని గుర్తించాల్సిన చారిత్రక కోణం ఉంది. అదే, సంక్రాంతికి ముందే కూసిన పందెపుకోడి కత్తి!

కోడి కత్తితో ప్రధాన ప్రతిపక్ష నేత గొంతు కోసేందుకు ఒక యువకుడు చేసిన ప్రయత్నం, దేశ రాజకీయాల్లోనే మున్నెన్నడూ కనీ, వినీ ఎరుగని ఘట్టం! తెలుగువారి రాజకీయాలు అందరి దృష్టినీ ఆకర్షించడానికి, ఆశ్చర్య పరచడానికి, ఆసక్తిని రేకెత్తించడానికి ఈ 'కోడి కత్తి' కారణమనడంలో అస్సలు సందేహించాల్సిన అవసరం లేదు. అయితే, తెలుగువారి చరిత్ర–సంస్కృతి పెద్దగా చదవనివారు, పూర్తిగా తెలియని వారు మాత్రమే, ఇలాంటి చిత్ర, విచిత్ర భావోద్వే గాలకులోనై ఉంటారని మనమైతే అనుకోవాలి. ఎందుకంటే, కోడిపందేలు ప్రపంచానికి కొత్తకావు. రోమన్ సామ్రాజ్యంలోనే జరిగినట్టు ఆధారా లున్నాయి. ఆరువేల ఏళ్ల క్రితమే పర్షియాలో జరిగాయని చరిత్రకారులు చెప్పిన మాట! లండన్.. మెక్సికో.. పెరూ .. వియత్నాం.. ఆఫ్ఘనిస్తాన్ – ఇలా కోడి పందేలు జరగని చోటు భూ ప్రపంచంలోనే కనబడదని 'కత్తి'బద్దలుగొట్టి చెప్పడానికి సాక్ష్యాలూ, ఆధారా లున్నాయి. అయితే, తెలుగువాళ్లుగా మనం సగర్వంగా ప్రకటించుకోవలసిన ప్రత్యక్ష చరిత్ర ఏమిటంటే – క్రీ.శ.1173–1182లో జరిగిన పల్నాటియుద్ధానికీ, క్రీ.శ.1752లో జరిగిన బొబ్బిలి యుద్ధానికీ కోడిపందేలవే కీలకపాత్ర. ఇలాంటి యుద్ధాలు–కోళ్ల చరిత్ర ప్రపంచంలో మరెవరికీ లేదు.



"పోరుకు విడిచిన పుంజులు రెండు
పొంగుచు రెక్కలు పొరబరినార్చి" – మహాకవి శ్రీనాథుడే

పల్నాటి యుద్ధానికి దారితీసిన బ్రహ్మనాయుడు పుంజు (చిల్లుమల్లడు) నాగమ్మ పుంజు (నల్లమల్లడు) బరిలోకిదిగిన దృశ్యాన్ని తన కావ్యంద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశాడు. మనకు తెలిసినంత వరకూ పందెపు కోళ్ల గురించి ఏకంగా ఒక 'శాస్త్రాన్నే' విరచించిన ఘనత కూడా మన తెలుగు వాళ్లదే! పుంజు రంగూ, ఈకలూ, తోకల్ని చూసి, పందెపు కోళ్లకు 'కాకి, డేగ, నెమలి, పర్ల' వంటి ఓ పాతిక ముద్దుపేర్లు పెట్టినవాళ్లూ మనవాళ్లే! కోడి కాలికి కత్తిగట్టడం ఒక కళ.. కత్తిగట్టిన కోడిని పోరాటానికి వదలడం ఒక విద్య. కోళ్ల యుద్ధంలో గాయపడినా, వాటిలో పునరు త్తేజాన్ని, సమరోత్సాహాన్ని నింపడానికి మనిషి ఊపిరి నుంచి మూలికల రసాల వరకూ వాడే జ్ఞానం మన పెద్దల సొత్తు! 'బొబ్బిలి యుద్ధం'లో

"కాచిప్రాతలు, దారాలు, కట్టుముళ్ల
ముష్టులను, నీళ్ల మూతలు, మూలికలను
కత్తుల పొదుళ్ల, మంత్రముల్, కట్టు పసర్లు
వెనయవచ్చిరి పందెగాళ్లపు రేగి.."

పందెగాళ్లు ఎంతటి విజ్ఞాన సంపన్నులో 'నారాయణ కవి' వర్ణించాడు. మన ప్రాచీనుల నుంచి ఆ విజ్ఞానాన్ని పుణికి పుచ్చుకొన్న మన సరికొత్త తరం పందెగాళ్లు, నూత్న, వినూత్నమైన ప్రయోగాలను కూడా ఆవిష్కరిస్తూ, కుక్కుట శాస్త్రాన్ని మిక్కిలి బలోపేతం చేస్తూ ఉండటం ఆనందించదగ్గ విషయం. అందులోనూ, పందెం కోళ్లను పెంచే విధానం మరీ ముచ్చట గొలిపేది. జీడిపప్పు, బాదం, పిస్తా వంటి డ్రైఫ్రూట్స్‌ని మేపడమే కాకుండా, కోడిపుంజుతోనే కోడిమాంసాన్నీ, కోడిగుడ్డునీ తినిపించడం! వాటికి రోజూ వాకింగు, రన్నింగూ, స్విమ్మింగూ– ఇలా బహువిధములుగా బలిపించి, బస్తీమే సవాల్ అంటూ బరిలోకి దించేందుకు చేస్తున్న ప్రక్రియలు కూడా!

సంక్రాంతి సంస్కృతికి మాత్రమే పరిమితం కాకుండా, వేళా, పాళా లేకుండా .. సందడీ, సందర్భమూ ఆలోచించకుండా.. ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లోనూ ఈ పోరాటాలను జరిపించే సరికొత్త సంస్కృతి మనదే! వి.ఐ.పీలు, వీవీఐపీలూ.. కత్తి యుద్ధాలను కనులారా వీక్షించి, ఆనందించే స్థాయికే కాకుండా, వందల కోట్ల రూపాయల్లో 'బెట్టింగ్‌ల' స్థాయికి తీసుకువెళ్లి, అంతర్జాతీయ క్రికెట్ వర్గాలనే నోళ్లు వెళ్లబెట్టించే శక్తి సంపన్నమైనవి మన 'కోళ్లు'. మన దేశ శాంతి, భద్రతలను ఎంతో పటిష్టం గా కాపాడే చట్టాలు, న్యాయపీఠాలు సైతం 'కాలానికి కట్టిన ఈ 'కోడి' కత్తుల వంతెన'ను కనీసం కదల్చలేకపోయాయి.

ఇక్కడితో మన తెలుగువాడి పందెపు కోడి గాథలనూ, ఘనతలను ముగించేస్తే ఏమున్నది గర్వకారణం!? రాజకీయాల్లో కోడి కత్తిని రంగప్రవేశం చేయించడమే అసలు, సిసలైన రంజన కళ! 2018 'ముగింపు దశ'లో ఈ 'తెగింపు దిశ' మొదలైతే.. 2019 ఆరంభమే అదుర్స్! విశాఖ ఎయిర్‌పోర్టులో ఆ కత్తి చిందిం చిన నెత్తుటి బొట్టు, తెలంగాణాకు పయనించి, మునుపటి ఉమ్మడి రాజధాని ముంగిట చేరింది. ఉభయ రాష్ట్రాల పోలీసుల మధ్య విభజన గాయాలు గుర్తు చేసింది. ఉమ్మడి సర్వోన్నత న్యాయస్థానాన్ని స్పందింపజేసింది.

'సిట్'వేసి, కత్తి కథ కంచికి చేరుస్తానని మన ప్రియతమ ముఖ్యమంత్రి చెప్పినా, ఆ పని చేసినా.. ఆ .. 'గాయపడిన కోయిల', అతడ్ని ఓ 'బోయవాడి'గానే శంకించింది. విశాఖ భూముల 'సిట్'కన్నా విశాఖ ఎయిర్ పోర్ట్ కేసులో కొత్త 'సిట్' ఏం శోధించగలదు? సాధించ గలదని పెదవి విరిచింది. అధికార, ప్రధాన ప్రతిపక్షాలు విమర్శలు, ప్రతివిమర్శలతో 'కోడికత్తి' రాజకీయానికి, ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో దారుణంగా పడిపోతున్న సీజన్‌లో... విపరీతమైన వేడి పుట్టించాయి. 'కోడి కత్తిమాటకేమీ! నెత్తిమీద సీబీఐ కత్తి' ఉందని 'ముఖ్య'బాబు గేలిచేస్తే, 'స్కిప్ట్ ఢిల్లీ.. యాక్షన్ విశాఖ' అంటూ చినబాబు ఎగతాళి చేయడం.. మీరే పొడిపించారు.. కాదు మీరే పొడిపించుకున్నారు.. ఇలా వేళాకోళాలు, గందరగోళాలు కొనసాగాయి.

నిజం, చివరిగా చెప్పుకోవాలంటే, పల్నాడు, బొబ్బిలి యుద్ధాలకు నెపం కోడిపందేలదేగానీ, అసలు కారణాలు ఆధిపత్యాలకు సంబంధించినవే! ఆ రాజుల వారసలు కూడా, పాతగాయాలను ఏనాడో మరిచిపోయారు. ఒక ఒరలో రెండు కత్తులు ఇముడుకాలమని, విజయనగరం, బొబ్బిలి రాజులను తన పార్టీ ఒరలో ఇమిడ్చి, కాలానికి కొత్త మార్పునీ, నేర్పునీ పరిచయం చేసిన ప్రజ్ఞాశాలి మన 'బాబు'గారు. రాజకీయాల్లో కోడి కత్తులను దించాల్సిన అవసరం లేదని, ప్రత్యర్థి శిబిరాన్ని బలహీనపర్చడానికి తన దగ్గరున్న విద్యలేవో, చూపించారు కూడా! అయినా, 'గాయపడిన హృదయం' నమ్మకపోవడం సహజమే. 2019 ఆరంభంలో కోడి కత్తి కేసుని, జాతీయ దర్యాప్తు సంస్థ (నియా) స్వీకరించింది. ఇలాంటి అరుదైన కేసును జాతీయ రాజకీయ చరిత్రలో నమోదు చేసింది కూడా మన తెలుగువారే!

కోడి దొరికింది – కత్తీ దొరికింది! కట్టిన వాళ్లెవరో తేలాలి! అది తేలేలోగా, కొద్ది నెలల్లోనే తేలేదెవరో! మునిగేవారెవరో తేలిపోతుంది. ఆలోగా ఈ కథ 'కంచి' మాటకేంగానీ 'సుప్రీం' బెంచికైనా చేరుతుందో! లేదో! మొత్తానికి ప్రపంచ దేశాల మాటకేంగానీ, దేశంలోని రాష్ట్రాలన్నీ ఆంధ్ర ప్రదేశ్‌వైపు చూశాయి. నమ్మాల్సిందే. ఇది నిజం.. ఎంత నిజమంటే కోడికత్తితో కూడా మనిషి గొంతు కోసేయవచ్చనే పచ్చినిజం!

రచయిత సెల్ : 73968 16430

"ప్రవాస భారతీయుల సేవలు చిరస్మరణీయం"

కామిడి సతీష్‌రెడ్డి

"భారత విదేశాంగశాఖ ఆధ్వర్యంలో న్యాయ శాస్త్ర నిపుణులు సింఘ్వీ అధ్యక్షతన ఏర్పడిన ఉన్నత స్థాయి కమిటీ సిఫారసుల మేరకు ప్రతి సంవత్సరం జనవరి 9వ తేదీన ప్రవాస భారతీయుల దినోత్సవాన్ని నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. 2003 లో మొదటిసారిగా ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. 2004లో ఢిల్లీలో, 2005లో హైదరాబాద్‌లో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. విదేశాలలో నివసిస్తున్న భారతీ యులైన యువకులను ఆకర్షించడం, మన దేశం గొప్పతనం, ఔన్నత్యాన్ని దశ దిశలా చాటేలా ప్రచారం చేయడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. 9.1.1915న జాతిపిత మహాత్మ గాంధీ దక్షిణాఫ్రికా నుండి భారత దేశానికి తిరిగి వచ్చారు. అందువలన ఈ తేదీన 'ప్రవాసీదివస్' గా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విదేశాలలో మన భారతీయులు అన్ని రంగాలలో రాణిస్తున్నారు. శాస్త్రవేత్తలుగా, ఆర్థికవేత్తలుగా రాజకీయవేత్తలుగా కీర్తి గడిస్తున్నారు. మన పండుగలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను పరిరక్షిస్తున్నారు. మన దేశ పేరు ప్రఖ్యాతులు కాపాడుతున్నారు. ప్రతియేటా మనదేశం నుండి వివిధ దేశాలకు లక్షలాది మంది యువత చదువు, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం విదేశాలను వెళ్తున్నారు. వారు సంపాదించిన మొత్తాన్ని సైతం మనదేశంలోని వారు పుట్టిపెరిగిన గ్రామాల అభివృద్ధికి, తోడ్పాటునందిస్తున్నారు. గ్రామాలలో రోడ్లు, బడులు, గుడులకు అధిక మొత్తంలో నిధులను వెచ్చిస్తున్నారు. గ్రామాలలో పుట్టి పెరిగిన ఋణాలను తీర్చుకుంటున్నారు. ఏ దేశమేగినా, ఎందుకాలిడినా, ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనినా నిలుపరానీ జాతి నిండు గౌరవం' అంటూ రాయప్రోలు సుబ్బారావు రాసిన దేశభక్తి గేయ సారాంశాన్ని అక్షరాలా నిజం చేస్తున్నారు. పేరుకు విదేశాలకు వెళ్లినా నిత్యం వారి ఆలోచనలు మన దేశం చుట్టే తిరుగు తున్నాయి. విదేశాలలో మన భారతీయులు సోదర భావంతో ఆత్మీయంగా కలిసి ఉంటున్నారు. మన మంతా ఒకటే, మేరా భారత్ మహాన్ అంటూ జీవిస్తున్నారు. నా దేశం నాకు ఏమిచ్చింది? అని కాకుండా నేను నా దేశానికి ఏవిధంగా సహాయ పడుతున్నాను అనే నిదాన్ని నిజం చేస్తున్నారు. అన్ని విదేశాలలో ఆటా, తానా లాంటి సభలు, సమావేశాలు నిర్వహిస్తూ కొత్త ఉత్సహాన్ని నింపుతున్నారు. "దేశమంటే మట్టికాదోయ్, దేశ మంటే మనుషులోయ్' అని చాటుతున్నారు. మనం కూడా మన ప్రవాస భారతీయులను గౌరవిద్దాం, వారు చేస్తున్న సేవలను అందరికీ తెలిపేలా విశ్వవ్యాప్తం చేద్దాం... ప్రవాసభారతీ దివస్‌ను మనం కూడా జరుపుకుందాం.

(నేడు ప్రవాస భారతీయుల దినోత్సవం సందర్భంగా)

సందర్భం

"చుక్కల' చిక్కులకు పరిష్కారం

శిరందాసు నాగార్జున

ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో రాష్ట్రంలో చుక్కల భూముల సమస్య పరిష్కారం కానుంది. దాదాపు 64 ఏళ్ల నుంచి రైతులు, రైతు కుటుంబాలు ఈ 'చుక్కల' చిక్కులతో అల్లాడుతున్నారు. ఈ చుక్కల వెనక పెద్ద కథే ఉంది. బ్రిటీష్ వారి హయాంలో 1906లో దేశవ్యాప్తంగా భూముల సర్వే జరిగింది. అ తర్వాత 1954లో రీ సర్వే చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ భూముల సర్వే గానీ, రీ సర్వేగానీ జరగలేదు. అందువల్ల భూమి హక్కులకు సంబంధించి 1954 నాటి రెవెన్యూ రికార్డులే ప్రామాణికంగా ఉన్నాయి. 1954లో రీ సర్వే జరిగినప్పుడు రెవెన్యూ రికార్డుల్లో సర్వే నెంబర్ వారీగా భూమి హక్కుదారుల పేర్లు, సర్వే నెంబర్లు, విస్తీర్ణం సమోదు చేశారు. అయితే, ఎవరూ యాజమాన్య హక్కు కోరని భూముల వద్ద రెవెన్యూ రికార్డుల్లో చుక్కలు(డాట్స్) పెట్టారు. అప్పటి నుంచి ఈ భూములను చుక్కల భూములు(డాటెడ్ ల్యాండ్స్)గా పిలుస్తున్నారు. 1954 తరువాత ఆ భూములను సాగు చేసుకునేవారికి ఎటువంటి యాజమాన్య హక్కులు లేవు. ఆ తరువాత భూముల రీసర్వే చేయకపోవడం వల్ల ఈ సమస్య వచ్చింది. వాటిని వారసత్వంగా బదిలీ చేయడానికి గానీ, అమ్ముకోవడానికి గానీ అవకాశం లేదు. అప్పటి నుంచి రైతులను ఈ చుక్కల చిక్కులు వెంటాడుతున్నాయి. వేధిస్తున్నాయి. ఆ భూములన్నీ నిషేధిత జాబితాలో ఉన్నాయి. తాత,ముత్తాతల కాలం నుంచి దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్నవారికి కూడా యాజమాన్య హక్కులు లేకపోవడంతో అనేక మంది కోర్టులను ఆశ్రయించారు. ఈ కేసులను విచారించిన ధర్మాసనం, హక్కు పత్రాలున్న వారికి న్యాయం చేయాలని ఆదేశించింది. అప్పటి నుంచి ఈ సమస్య పరిష్కార దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఈ చుక్కల భూములు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 24 లక్షల ఎకరాలకు పైగా చుక్కల భూములు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నట్లు అంచనా. వీటిలో 17.7 లక్షల ఎకరాలను ప్రభుత్వం కొంతమందికి అసైన్ చేసింది. లక్షా 80 ఎకరాలను రైతులు సాగుచేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా వారు ఆ భూమిపై హక్కు కావాలని డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ సంస్కరణలలో భాగంగా రిజిస్ట్రేషన్ చట్టం–1908 లోని 22–ఏ1లో నిషేధిత ఆస్తుల జాబితా నుంచి చుక్కల భూములను తొలగిస్తూ 2017 జూలై 14న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం రైతుల ఆధీనంలో సాగులో ఉన్న చుక్కల భూములను మాత్రం ఆ తేదీ నుంచి ప్రైవేటు పట్టా భూములుగా పరిగణించవలసి ఉంది. అయితే వివిధ కారణాల వల్ల ఆ ఆదేశాలు అమలుకాలేదు. ఈ సమస్యపై మళ్లీ వేల సంఖ్యలో రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పరిస్థితిని తీవ్రంగా పరిగణించి జనవరి 4న తనంతతానుగా ఈ సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం నూతన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలోని రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్లు పంపుతారు. ఆర్వోఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) చట్టం ప్రకారం 1బి రిజిస్టర్ 2వ కాలమ్ లో నమోదైన పట్టాదారు పేరుని సరిచూసుకొని తదనుగుణంగా 1బి రిజిస్టర్ 8వ కాలమ్ లో కొనుగోలు లేదా వారసత్వం లేదా వంశపారంపర్యం అని నమోదు చేసినవాటిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. 8వ కాలమ్ లో ఏమీ రాయకపోయినా పట్టాదారు భూమిగా పరిగణించి నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. 8వ కాలమ్ లో 1954కు ముందు ఇచ్చిన డి పట్టా, డికెటి పట్టా, అసైన్ మెంట్ భూములు అని నమోదు చేసినట్లైతే వాటిని కూడా నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. 1954 తరువాత ప్రభుత్వం ఇచ్చిన భూములు నిషేధిత జాబితాలోనే కొనసాగుతాయి.

చుక్కల భూములను స్వాధీనంలో ఉంచుకున్నవారు, సాగుచేసుకుంటున్నవారు ప్రభుత్వం నిర్ణయించిన పత్రాలలో ఏదోఒకటి చూపిస్తే ఆ భూమి వారికి సంబంధించినదిగా భావించి రిజిస్టర్ లో వారి పేరు నమోదు చేస్తారు. రిజిస్ట్రేషన్, లింకు డాక్యుమెంట్ పత్రాలు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రికార్డు ఆఫ్ హెూల్డింగ్స్ నమోదు చేసిన పత్రాలు, ఎన్‌కంబరెన్స్ పత్రం, 10(1) అకౌంట్, భూమి శిస్తు రసీదులు, రెవెన్యూ శాఖ జారీ చేసిన ఆర్వోఆర్ రికార్డు, న్యాయస్థానాలు, సంబంధిత అధీకృత అధికారి జారీ చేసిన ఉత్తర్వు ప్రతులు వంటి వాటిని రిజిస్టర్ కార్యాలయంలో సమర్పించవలసి ఉంటుంది. 2017 జూలై 14వ తేదీకి ముందు 12 ఏళ్లు ఆధీనంలో ఉన్నట్లు ఏవైనా ఆధారాలు చూపినా రిజిస్టర్ లో వారి పేరు నమోదు చేస్తారు. చుక్కల భూములకు సంబంధించి రైతులు ఫిర్యాదు చేసినా, రెవెన్యూ శాఖ వద్ద, తహశీల్దార్ కార్యాలయంలో పరిశీలనలో ఉన్నా వాటిని కూడా రెవెన్యూ సిబ్బంది తమంతటతాముగా పరిశీలిస్తారు. వాటికి కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయి. చుక్కల భూములు పరిశీలన పూర్తి అయిన తరువాత తుది జాబితాని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ప్రదర్శనకు పెడతారు. వాటిలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే, తెలియజేస్తే రెవెన్యూ శాఖ వాటిని పరిశీలిస్తుంది. అభ్యంతరాల పరిశీలన తరువాత సవరించిన తుది జాబితాని ప్రకటిస్తారు. నిషేధిత భూముల నుంచి చుక్కల భూములతోపాటు ఇతర భూములను తొలగించి సెక్షన్ 22–ఏ1 (ఏ), టు(డి) కొత్త జాబితాని నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పంపుతారు. సెక్షన్ 22–ఏ1 (ఇ) జాబితాని ప్రభుత్వానికి పంపుతారు. ప్రభుత్వం దానిని గెజిట్ లో ప్రచురిస్తుంది. ప్రభుత్వ ఆదేశాలు సక్రమంగా అమలు జరిగితే లక్ష మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. జనవరి 24వ తేదీ లోపల ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం.అందువల్ల చుక్కల భూములు ఎక్కువగా ఉన్న జిల్లాలకు అదనంగా అధికారులను పంపించే అవకాశంకూడా ఉంది.

వ్యాసరచయిత సీనియర్ జర్నలిస్ట్, సెల్ : 9440222914

విశాలాంధ్ర
బతుకు
The Life
బుధవారం
09 జనవరి 2019

నిరసన

సమాన పనికి సమాన వేతనం కావాలంటూ మధ్యాహ్న భోజన పథకం కార్యకర్తలు ఆందోళన చేస్తున్న దృశ్యం ఇది. ప్రభుత్వ సర్క్యులర్ కాపీలను దగ్ధం చేసి నిరసన తెలియజేసిన ఈ చిత్రం పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోది.



అన్నింటా...గోరింట!

పెళ్ళి అయినా, పేరంటమైనా...పండగైనా... ఇంట్లో జరిగే ఇంకే శుభకార్యమైనా...ఆడపిల్లలకు ముందుగా గుర్తుకొచ్చేది గోరింటాకు. అరి చేతులు, అరి కాళ్ళు గోరింటాకు ఎర్రదనంతో మెరుస్తూ ఉంటే కళ్ళల్లో కన్పించే ఆ ఆనందమే వేరుగా ఉంటుంది.



గోరింటాకు ....మూడు తరాల క్రితం అలంకారం.... గోరింటాకు.... రెండు తరాల క్రితం అందం... గోరింటాకు... గత తరం వరకూ ఆరోగ్యం... గోరింటాకు.... నేడు..... వాణిజ్యం. అలంకారం, అందం, ఆరోగ్యం.... ఎలా చూసినా గోరింటాకుకు శతాబ్ధాలుగా డిమాండ్ ఉంది. ఆ డిమాండ్ ఇప్పుడు వాణిజ్యానికి పాకింది. గోరింటాకు సాగు గొప్ప లాభదాయకంగా మారింది. గోరింటాకు వాణిజ్యం పెరగడానికి కారణం ఉంది. సంప్రదాయ, ఆయుర్వేద, నాటు వైద్యాలన్నింటిలోనూ గోరింటాకును వాడుతున్నారు. ఔషధాల్లోనే కాదు... కాస్మోటిక్స్ ఉత్పత్తులన్నింటి లోనూ గోరింటాకును ఉపయోగిస్తున్నారు. ఈ కారణంగానే గోరింటాకు సాగు పెరుగుతోంది...గోరింటాకు పరిశ్రమా విస్తరిస్తోంది. పెళ్ళి అయినా, పేరంటమైనా...పండగైనా...ఇంట్లో జరిగే ఇంకే శుభకార్యమైనా...ఆడపిల్లలకు ముందుగా గుర్తుకొచ్చేది గోరింటాకు. అరి చేతులు, అరి కాళ్ళ గోరింటాకు ఎర్రదనంతో మెరుస్తూ ఉంటే కళ్ళల్లో కన్పించే ఆ ఆనందమే వేరుగా ఉంటుంది. ఇది అలంకారం, అందం. ఈ విషయం పక్కన పెట్టి ఆరోగ్యం విషయానికొస్తే...గోరింటాకు ఒంట్లో ఉన్న వేడిని తగ్గించి చల్లదనం ఇస్తుంది. మంచి నిద్రపట్టేలా చేస్తుంది. చెడు బాక్టీరియాను పోగొడుతుంది. అందుకే ఇప్పుడు మహిళలతో పాటు పురుషులూ గోరింటాకు పెట్టుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. గోరింటాకు పెట్టుకోవడమనే సంప్రదాయ అలవాటు ఇప్పుడు ఆధునికతకూ చిహ్నమైంది. అందం, అలంకారం, ఆరోగ్యాల సమ్మిళితం కనుకనే గోరింటాకు ముడిపదార్థంగా రకరకాల కాస్మోటిక్స్ ఉత్పత్తులూ వస్తున్నాయి. మార్కెట్‌లో వీటికి డిమాండ్ కూడా అంతకంతకూ పెరుగుతోంది.

తక్కువ వర్షపాతంలోనూ...

గోరింటాకు చెట్లు ఇళ్ళల్లో, పొలం గట్లలో కనపడుతూనే ఉంటాయి. గోరింటాకు వినియోగం పెరగడంతో ఇప్పుడు వాణిజ్య దృక్పథంతో గోరింటాకు సాగు పెరిగింది. మనదేశంలో ఉత్తరాదిన రాజస్థాన్, పంజాబ్, గుజరాత్, హర్యానా రాష్ట్రాల్లో గోరింటాకు సాగు విస్తీర్ణం ఎక్కువ ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లోనూ గోరింటాకు సాగు ఇటీల కాలంలో బాగానే పెరిగింది. గోరింటాకు అధిక ఉష్ణోగ్రతను తట్టుకోవడము కాదు తక్కువ వర్షపాతంలోనూ బానే ఎదుగుతుంది. విత్తనాల ద్వారా లేదా మొక్కలు నాటడం ద్వారా పంట సాగును ప్రారంభిస్తారు. రెండో ఏడాది నుంచి ఆకు కోతకు వస్తుంది. మూడో సంవ త్సరం నుంచి గరిష్టంగా 15 ఏళ్ళ వరకూ ఏటా రెండు, మూడు సార్లు ముదిరిన ఆకులు కోతకు వస్తాయి. ఎకరానికి ఏడాదికి 1200 నుంచి 1500 కేజీల వరకూ ఎండిన ఆకు దిగుబడిగా వస్తోంది. గోరింటాకు ఆధారిత ఉత్పత్తుల వినియోగం పెరుగుతుండడం వల్లే వాణిజ్యపరంగా గోరింటాకు సాగు లాభదాయకంగా మారిందని కృష్ణాజిల్లా నందిగామ వ్యవసాయ సహాయ సంచాలకులు డి. రమణమూర్తి పేర్కొన్నారు.







పొడి తయారీ ఇలా

రైతుల నుంచి సేకరించిన గోరింటాకును శుద్ధి చేసి ఎలక్రిటకల్ ట్రె డ్రయ్యర్స్‌లో ఉంచి తేమను తొలగిస్తారు. ఇలా ఎండు ఆకులు తయారవుతాయి. వీటిని ప్యాక్ చేసి హెన్నా తయారీ ఉత్పత్తుల పరిశ్రమలకు మార్కెట్ చేస్తారు. అక్కడ హెన్నా ఆకులను పల్వరైజర్‌లో వేసి మెత్తని పొడిగా చేస్తారు. ఈ పొడిని నేరుగా ఇతర ఉత్పత్తుల్లో వాడతారు.



పాతిక లక్షలతో పరిశ్రమ

తొలుత 25 లక్షలు వ్యయం చేయగలిగితే చాలు గోరింటాకు పరిశ్రమను ప్రారంభించుకోవచ్చు. గోరింటాకును ఎండబెట్టడం, గోరింటాకు పొడి తయారీ చేయవచ్చు. రోజుకు ఒక టన్ను పచ్చి ఆకు ప్రాసెసింగ్ సామర్థ్యం ఉన్న మిషన్లతో రోజుకు 500 కిలోల పొడిని ఉత్పత్తి చేయవచ్చు. మొత్తంగా రూ.2 కోట్ల వ్యయంలో పరిశ్రమను నడిపించవచ్చు.

ప్రయోజనాలు

గోరింటాకు జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. మంచి హెయిర్ కండిషనర్‌గా పనిచేస్తుంది. జుట్టు కుదుళ్ళను గట్టిపరుస్తుంది. జుట్టు నెరవడాన్ని, చుండ్రిని నివారిస్తుంది. అధిక రక్తపోటు, తలపోటు నివారణకు తోడ్పడుతుంది. గుండెపోటు రాకుండా చేస్తుంది. రక్త ప్రసరణ వృద్ధికి దోహదపడుతుంది. మానసిక ఒత్తిడి, ఆందోళన, అసహనాలను తగ్గిస్తుంది. ఇలా గోరింట... అన్నింటా... గోరింటగా మారింది. ఔషధాలు, కాస్మోటిక్స్ ఉత్పత్తుల్లో నేరుగా గోరింటాకు వాడకంతో పాటు హెన్నా పొడి వాడకమూ పెరిగింది. ఈ నేపథ్యంలో గోరింటాకు యువతకు స్వయం ఉపాధి మార్గంగానూ మారింది. గోరింటాకు సాగు, స్వయం ఉపాధి, పరిశ్రమలోనూ మహిళలే ఎక్కువగా ఉండడం విశేషం.

హెన్నా ఉత్పత్తులు

నేచురల్ బ్లాక్, రెడ్, కాపర్ బ్రౌన్, డార్క్ బ్రౌన్ మీడియం, బ్రౌన్ లైట్ వంటి హెన్నా, హెయిర్ కలర్స్ తయారు చేయవచ్చు. హెయిర్‌కేర్ ఉత్పత్తుల్లో హెన్నా శీకాయ్ పొడి, హెన్నా హెయిర్‌కేర్ పొడి, హెన్నా షాంపూ, హెన్నా కండిషనింగ్ షాంపూ, హెన్నా హెయిర్ ఆయిల్ తయారుచేస్తారు. స్కిన్ కేర్ ఉత్పత్తుల్లో హెన్నా కోన్, హెన్నా స్టెన్సిల్, హెన్నా ఫేస్ మాస్క్ హెన్నా బాడీ పెయింటింగ్ ఉత్పత్తుల తయారీలో గోరింటాకు వాడుతున్నారు. వీటితో పాటు విడిగా హెన్నా ఎండు ఆకులు, హెన్నా ఆకు పొడి, హెన్నా ఆయిల్ లాంటి వాటికి వాణిజ్యపరంగా మంచి డిమాండ్ ఉంది.

సహజ రంగు

ఇటీవల హెర్బల్ ఉత్పత్తులకు డిమాండ్ బాగా ఉంది. అందులోనూ గోరింటాకు లాంటి సహజమైన పదార్థాలకు డిమాండ్ పెరగడానికి కారణం దీనివల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లూ ఉండవు. పైగా ఇది సహజమైన రంగును ఇస్తుంది. జుట్టుకైనా, చర్మానికైనా ఇది సహజమైన రంగును అందిస్తుంది. ఈ కారణంగానే హెన్నాతో కూడిన హెయిర్ కేర్, స్కిన్ కేర్ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది, పెరుగుతోంది.






- తోట. ప్రసాద్
నందిగామ, కృష్ణాజిల్లా

మొటిమలు... మచ్చలు పోగొడదామిలా!

టీనేజ్‌లో ప్రారంభమయ్యే మొటిమలు, వాటివల్ల ఏర్పడే మచ్చలు కొంతమందిలో నడివయస్సు వరకూ వేధిస్తూనే ఉంటాయి. ఇవి చిరాకును, చెప్పలేని ఇబ్బందిని కలిగించడమే కాదు...ఆత్మవిశ్వాసాన్నీ దెబ్బతీస్తాయి. వీటిని తొలగించుకునేందుకు సరైన మార్గాన్ని ఎంచుకోకపోతే చర్మం పాడైపోతుంది. మొటిమలతో పాటు వాటివల్ల వచ్చే మచ్చలూ పోయే మార్గాన్ని అన్వేషించాలి. ఇందుకు మార్గాలూ చాలానే ఉన్నాయి. రెండేసి పదార్థాల మిశ్రమంతో సహజమైన చికిత్సా విధానాలను అనుసరించండి..మొటిమలు, మచ్చల్ని సులభంగా పోగొట్టుకోండి.

అలోవెరా + లెమన్ జ్యూస్



టేబుల్ స్పూన్ అలోవెరా, అర టేబుల్ స్పూన్ నిమ్మరసం తీసుకుని బాగా కలిపి ముఖానికి పూతలా వేయండి. అర గంట తర్వాత మామూలు నీళ్ళతో కడిగేయండి. ఇలా రోజూ చేయవచ్చు లేదా వారంలో కనీసం మూడు, నాలుగు సార్లు ఈ పూతను వేయండి. ఈ పూత వేయడానికి ముందు ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. తాజా అలోవెరా, తాజా నిమ్మరసాన్నే వాడాలి. అంటే అప్పటికప్పుడు తీసిన అలోవెరా గుజ్జు, అప్పుడే పిండిన నిమ్మరసాన్ని తీసుకోవాలి.

బేకింగ్ సోడా + కొబ్బరినూనె



ఒక టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా, రెండు టేబుల్ స్పూన్‌లు కొబ్బరినూనె ఒక గిన్నెలో వేసి బాగా కలిపి ముఖానికి పూతలా వేయండి. మునివే ళ్ళతో గుండ్రంగా, సుతిమెత్తగా మర్దనా చేయండి. రెండు, మూడు నిముషాలు మర్దనా చేసిన తర్వాత 20 నిముషాలు అలాగే ఆరనివ్వండి. తర్వాత చల్లని నీళ్ళతో కడిగేయండి.

యాపిల్ సిడర్ వెనిగర్ + తేనె



ఒక టేబుల్ స్పూన్ మంచి తేనె, అర టేబుల్ స్పూన్ యాపిల్ సిడర్ వెనిగర్ బాగా కలిపి ముఖానికి పట్టించి కొన్ని నిముషాలు వేళ్ళతో మసాజ్ చేయండి. 20 నిముషాలు ఆగి మామూలు నీళ్ళతో కడిగేసుకోండి. వారానికి ఒకసారి ఈ పూత వేసుకోవచ్చు.

గుడ్డుసొన + నిమ్మరసం




కోడిగుడ్డులోని తెల్లసొన ఒక టేబుల్ స్పూన్, అర టేబుల్ స్పూన్ నిమ్మరసం కలిపి మెత్తని పేస్ట్‌లా చేయండి. దీనిని ముఖానికి పట్టించి చర్మం పీల్చుకునేవరకూ ఉంచండి. తర్వాత మామూలు నీళ్ళతో కడిగేసుకోండి.

నూతన నిర్ణయాలు మార్చండి !

కొత్త సంవత్సరం రాగానే దాదాపుగా అందరూ చేసే పని కొత్త నిర్ణయాలు తీసుకోవడం. ఇక ఈ ఏడాది నుంచి కచ్చితంగా అన్నీ పాటించేయాలంటూ ఎప్పటికప్పుడు కొత్తకొత్త తీర్మానాలు చేసేసుకుంటారు. మీరూ ఇలాగే చేసుకుని ఉంటారు. మరి వారం గడించింది...ఎంతవరకు పాటించారు? సమీక్ష చేసుకున్నారా! అసలు వాటిని అమలు చేస్తున్నారా? లేక అప్పుడే గాలికొదిలేశారా? వదిలేశారా... అయినా ఏమీ ఆందోళన పడకండి. తీర్మానాలను మార్చేయండి. పక్కాగా అమలు జరిపేందుకు ఏటా మాదిరిగా చేసిన తీర్మానాలు, తీసుకున్న నిర్ణయాలు మార్చేయండి. అవి ఎంత కొత్తగా ఉండాలంటే ఎవరూ ఎప్పుడూ చెప్పనంతగా. అప్పుడు ఆతృతగా, ఆసక్తిగా మీ అంతట మీరే వాటిని అమలు జరుపుతారు. అవి కూడా మరీ ఎక్కువ అవసరం లేదు. నాలుగంటే నాలుగే తీర్మానాలు పెట్టుకోండి. అవి తుచ తప్పకుండా అనుసరించండి చాలు. మీకు వచ్చే సంతృప్తికి ఇక కొలమానం ఉండదంటే ఆశ్చర్యపోనక్కర్లేదు.

కొత్త ఏడాదికి శ్రీకారం చుట్టిన రోజున...ఏటా ప్రతి పదిమందిలో ఎనిమిదిమంది తీసుకునే నిర్ణయం బరువు తగ్గాలని. ఇందుకోసం జిమ్‌ని ఎంపిక చేసుకుంటారు, అడ్వాన్స్ కూడా ఇచ్చేస్తారు. వెళ్ళేది మాత్రం ఒకటి, రెండు రోజులే. మహా అయితే వారం రోజులు వెళతారు. ఇక ఆ తర్వాత ఏడాది పొడవునా జిమ్ తలుపులు వారికోసం ఎదురుచూడాల్సిందే. అలాగే ఫాస్ట్‌ఫుడ్ తినకూడదనే నిర్ణయం కూడా... ఇదొక్కటే కాదు చేసుకున్న తీర్మానాలన్నింటి పరిస్థితీ ఇదే. 2019 సంవత్సరం తీర్మానాల పరిస్థితి కూడా ఇలాగే ఉందా? ఏమీ చేయలేకపోతున్నామని అసంతృప్తికి గురవుతున్నారా? అయితే తీర్మానాలను మార్చేయండి. కొంగొత్తగా ఈ నిర్ణయాలను తీసుకోండి.



ఏటా ప్రతి పదిమందిలో ఎనిమిదిమంది తీసుకునే నిర్ణయం బరువు తగ్గాలని. ఇందుకోసం జిమ్‌ని ఎంపిక చేసుకుంటారు, అడ్వాన్స్ కూడా ఇచ్చేస్తారు. వెళ్ళేది మాత్రం ఒకటి, రెండు రోజులే.

ఒక పదాన్ని ఎంచుకోండి

ఈ కొత్త ఏడాదిలో ఒక పదాన్ని ఎంచుకోండి. అది ఏదైనా కావచ్చు. మీకు ఇష్టమైన పదాన్ని తీసుకోండి. ఉదాహరణకు సాయం చేయడం, శాంతియుతంగా ఉండడం, ప్రశాంతతను సాధించడం. మీరు ఎంచుకున్న పదాన్ని బట్టి అందుకు అనుగుణమైన పనులు చేయండి. మీ తీర్మానం పక్కాగా అమలైపోతుంది. ఇందులో ఎలాంటి అనుమానం అక్కర్లేదు.

ఇంకొకరి జీవితం గురించి...

మీరు చేసుకునే తీర్మానం మీకు సంబంధించినదే కానక్కర్లేదు. అది ఇతరుల జీవితాలను మెరుగుపర్చేదైనా కావచ్చు. అవసరమైన వారికి రోజూ ఆహారాన్ని అందించడం. భోజనం పెట్టించడం లేదా మీకు చేతనైన సాయం చేయడం, ఎవరికైనా చదువు చెప్పించడం, దుస్తులు ఇవ్వడం ఇలాంటివి ఏవైనా పెట్టుకోవచ్చు. ఇలాంటి పనులు చేయడంలో ఉన్న సంతృప్తి ఏమిటో చేస్తేనే తెలుస్తుంది. ఈ పనులు చేయడం వల్ల మీ అందమూ పెరుగుతుంది తెలుసా..అది మీ ఆత్మసంతృప్తి వల్ల వచ్చే అందం.

టెక్నాలజీకి దూరంగా

ఏదైనా పిక్చర్‌ని తీయడం, దానిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం, ఎన్ని లైక్‌లు వచ్చిందీ చూసుకోవడం చాలామంది జీవితం ఇదే ఇప్పుడు. ఈ గాడ్జెట్‌లకూ, సోషల్ మీడియాకూ దూరంగా జరగండి. సమాజానికి అంటే చుట్టూ ఉన్న మనుషులకు దగ్గర అవ్వండి. అసలైన జీవితం అంటే ఏమిటో అర్థం అప్పుడు తెలుస్తుంది.

శత్రువులతో స్నేహం

మిమ్మల్ని ఇబ్బంది పెట్టే పరిస్థితులు, మిమ్మల్ని ఇరుకున పెట్టే మనుషుల మీద దృష్టి పెట్టండి. కొంతమంది కఠినంగా కనిపంచవచ్చు అంతమాత్రం చేత వారికి దూరంగా ఉండనక్కర్లేదు. అలాంటివాళ్ళు మీ సహోద్యోగులు కావచ్చు, చుట్టుపక్కల ఇళ్ళల్లో ఉండే వాళ్ళు కావచ్చు, క్లాస్‌మేట్స్ కావచ్చు...వారినీ చిరునవ్వుతో చూడడం అలవాటు చేసుకోండి. మీదైన శైలిలో స్నేహహస్తాన్ని అందించండి. వారికి కష్టమనిపించిన పనుల్లో సాయమందించండి. అలాంటి పరిస్థితులను మీరెలా ఎదుర్కొన్నారో చెప్పండి. వారితో కలిసి భోజనం చేయండి.

నేను - సుడిగుండం (నవల) 10

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

రెండు రోజులు గడిచిపోయాయి. నేను హాస్టల్ కి వెళ్తున్నాను - లైబ్రరీ నుండి. అప్పుడు 'రాముగారు' అని పిలుస్తుంటే చూసాను. అమిత కనిపించింది. చిరునవ్వుతో దగ్గరికి వచ్చింది.

"మనం కొంచెం సేపు మాట్లాడుకోవచ్చా" అంది.

నేను మొహమాటంగానే తలూపాను. ఇద్దరం నడుస్తున్నాం.

"మీ గురించి లలిత చెప్పింది. నాకు కొత్త విషయాల గురించి తెలుసు కోవాలనుకునే వారంటే ఇష్టం. జయదేవ్‌గారి గురించి విన్నాను. అలాంటి వారు మాకుంటే బాగుండుననిపిస్తోంది. ఆయన ఈ ఉద్యోగానికి పరిమితం అయ్యారుగాని ఎంతో చేసి వుండేవారు"

నాకూ అది నిజం అనిపించింది.

"మనిషి మెదడు, ప్రవర్తన బెర్ముడా ట్రయాంగిల్ లాంటివి కదూ... ఓ పట్టాన ఆ రహస్యాలు అర్థం కావు" అంది. నాకు చిన్న షాక్ లాంటిది కలిగింది. నేనూ ఇలానే అనుకున్నాను.

"అందుకే సైకాలజీ తీసుకున్నాను. చాలా చేయాలని వుంది. ఎంతవరకు చేయగలనో తెలియదు"

"ఎందుకలా అనుకుంటున్నారు?"

"మనం కుటుంబం అనే పరిధిలో బతుకుతున్నాం అందులో భద్రత, ఆనందం, బాధ్యతా వున్నాయి. అంతకు మించిన ఆటంకాలు వున్నాయి. మనం కొత్తగా ఏదన్నా చేయాలన్నా ఇంట్లో అంగీకరించరు. మనం శత్రువుతో పోరాటం చేయవచ్చు. ఇంట్లో అలాకాదు. ప్రేమ వుంటుంది. మనల్ని కన్నారు, పెంచారు అనేది మనలో వుంటుంది. వాళ్ల 'పెళ్లి' అనే చట్రంలో మనల్ని బిగించటానికి ప్రయత్నం చేస్తారు"

"అంటే పెళ్లి వద్దంటారా?" అన్నాను.

"అలా అనటం లేదు. ఇప్పుడిప్పుడు ఇలాంటి ఆలోచనలు వస్తున్నాయి. పెళ్లి పేరుతో ఏర్పడుతున్న కుటుంబాల్లో అన్నీ సవ్యంగా వుండటం లేదు"

"అది ఎక్కడయినా వుంటుంది. మనం మెజారిటీని చూడాలేమో" అన్నాను. చిన్నగా తలూపి -

"మనకంటూ ఓ కుటుంబం నిర్మించి యిస్తే వాళ్ల బాధ్యత పూర్తి అవుతుందనుకుంటారు. మనకూ కొన్ని ఆశలుంటాయి. గమ్యం వుంటుంది. మరీ ఎర్లీడేస్‌లో మన ప్రయాణానికి ఇలాంటి బంధనాలు వుండకూడదు. నేను ఎప్పుడు పెళ్లి చేసుకోవాలనిపిస్తే అప్పుడు చేసుకునే స్వేచ్ఛ నాకు వుండాలి"

"పెళ్లి చేసుకోకపోవటానికి కూడానా?" అన్నాను. కొద్దిసేపు నిశ్శబ్దం. 'అఫ్ కోర్స్' అంది తర్వాత

"మనం కుటుంబాన్ని పూర్తిగా తోసి పుచ్చలేం. చూద్దాం ఏం జరుగుతుందో!" మొదటి సంభాషణలోనే ఇలా మాట్లాడటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

తర్వాత ప్రేమ-ఆడ-మగ సంబంధాల గురించి మాట్లాడింది. తను మాట్లాడుతుంటే వినాలనిపిస్తోంది.

"ప్రపంచానికి మనం ఏం చేయాలన్నా ఇంట్లోనూ, బయట మనుషుల్ని కన్విన్స్ చేయగలగాలి. అది ఇంటి నుండి మొదలు పెట్టాలి. వాళ్లు కన్విన్స్ అవుతారా, మనమే రాజీ పడతామా అనేది పరిస్థితులు నిర్ణయిస్తాయి. మనం మాత్రం పెళ్లి విషయంలో స్థిరంగా వుండాలి. రేపటి మన భవిష్యత్తుని నిర్ణయించేది అదే"

"మనల్ని అర్థం చేసుకోని వారు భాగస్వాములుగా వస్తే ఏం చేయాలి?"

"అలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలి. అసంతృప్తితో బతకటం వేరు. ఇంక ఈ బంధం కొనసాగించలేం అని ఒకరనుకున్నా, ఇద్దరూ అనుకున్నా, ఒకరు తీవ్ర నిర్ణయం తీసుకున్నా ఆ కుటుంబం బద్దలవుతుంది" అంది అమిత

నాకు మా అమ్మ గుర్తొచ్చింది.

"నేను పెద్ద పెద్ద విషయాలు మాట్లాడుతున్నాను కదూ... స్టార్వేషన్. మాట్లాడటానికి మనుషులు కరువవు తున్నారు. అప్పుడప్పుడూ మీరు నన్ను భరిస్తుండాలి రాముగారూ" అంది.

చిన్నగా తలూపాను.

****

నేను యూనివర్సిటీ ఆవరణలో వున్న ఓ చెట్టు దగ్గర కూర్చున్నాను. అమిత అలా ఎందుకు మాట్లాడింది. ఆమె ఇంటిలో ఇప్పుడే పెళ్లి చేసుకోమంటూ ఒత్తిడి చేస్తున్నారా? అయినా మొదటి పరిచయంతోనే నన్ను ఓ స్నేహితుడిగా భావించినందుకు సంతోషం కలిగింది.

"ఎవరికోసం ఎదురు చూస్తున్నావు?" అని వినిపించటంతో ఉలిక్కి పడ్డాను. సుధాకర్, వీరూ కనిపించారు.

"మీ కోసం మాత్రం కాదు" అన్నాను.

"అది ప్రత్యేకంగా చెప్పాలా" నవ్వాడు సుధాకర్.

"లలితా... అమితా... ఎవరు?" అన్నాడు వీరూ.

"చాలు. మీ పని మీరు చూసుకోండి" అని ముందుకు వెళ్లబోయాను.

"ప్రతిదానికీ అంత చిరాకు కోపం ఎందుకు రా రాముడూ.... అసలు లలిత నిన్నే ఎందుకు బర్త్ డేకి పిలిచింది. ఒక్క మగాడివనా? మేం ఎవరం పనికి రామా?"

ఆగిపోయాను.

"నువ్వు పెద్ద ముదురుగాడివనీ ముందు నుంచి చెబుతున్నారా. అయినా నీలో ఏం చూసి పిలిచింది. అమిత కారులో నిన్ను డ్రాప్ చేస్తుంది. క్యాంపస్‌లో మాట్లాడుతుంది. లలితంటే మన క్లాస్‌లో వుంటుంది. అమితా నువ్వూ ఏం మాట్లాడుకున్నారు?"



"విన్నావుగా. నన్ను అడగటం ఎందుకు?" అన్నాను.

"మైకు పెట్టుకుని మీరు మాట్లాడుకోలేదు. వాళ్లిద్దరేనా. ఇంకా అమ్మాయిలు నీ చుట్టూ తిరుగుతున్నారా. ఆ రహస్యం మాకు చెప్పరా బాబూ. లేదంటే ఎవరో ఒకర్ని మాకు వదిలేయ్"

"అసహ్యంగా మాట్లాడొద్దు వీరూ. మీకు ఆడపిల్లలంటే గౌరవం లేదు. మీరు చాలా అడ్వాన్స్‌గా వున్నాం అనుకుంటున్నారు. ఇంత పాత చింతకాయ పచ్చడి అనుకోలేదు"

"అదేగా మేం అంటున్నాం. ఇంతకీ ఎవర్ని సెలక్ట్ చేసుకున్నావు. ఒకరిని ప్రేమించి ఇంకొకరితో ఎవ్వారం నడుపుతావా?"

"ఇంకో మాట మాట్లాడితే నేను ప్రిన్సిపాల్ గారికి కంప్లయింట్ చేస్తాను. వాళ్ల వెనకాల ఎవరూ లేరు అనుకోవద్దు. మీరు బయట నుండి వచ్చారు. అయినా యూనివర్సిటీకి వచ్చి ఇంత అసభ్యంగా మాట్లాడతారా?"

"అంటే వాళ్లు నీకు సిస్టర్స్ అంటావు"

"అనను. వాళ్లు నాతో పాటు చదువుతున్నారు. ఫ్రెండ్స్. అంతవరకే" అన్నాను సాధ్యమైనంత మృదువుగా

"మా చెవుల్లో పూలు పెట్టొద్దు"

"మీ చెవుల్లో పూలు పెట్టుకుంటారో, బీర్ బాటిల్లు పెట్టుకుంటారో మీ ఇష్టం. అనవసరంగా మేటర్ పెంచొద్దు" అన్నాను.

"అవునా తేరగా పుట్టినరోజు పార్టీకి వెళ్లి తిని వస్తావా! చిన్న గిఫ్ట్ తీసుకెళ్లావా" అన్నారు.

షాకయ్యాను.

"అయినా లలితకి బుద్ధి వుండాలి. నువ్వు పల్లెటూరి బైతువని తెలియదు ఇన్ని నెలలయింది. ఎవరికన్నా టీ ఇప్పించావా? అసలు నీది ఓ బతుకు అంటావా?" అన్నాడు వీరూ.

అప్పుడు కోపాన్ని ఆపుకోలేకపోయాను. విసురుగా దగ్గరకు వెళ్లాను.

"నేను పల్లెటూరి బైతునే. పొలం పనులకి కూడా వెళ్లాను. చూస్తావా" అని చెయ్యి ఎత్తాను. వారి కళ్లల్లో భయం కనిపించింది.

"నేను ఎవరి డబ్బులు తీసుకోను. ఎవరి చేతా ఖర్చు పెట్టించను. నేను ఖర్చు చేయను. మీది అలాంటి మనస్తత్వం. ఇది లాస్ట్ వార్నింగ్... నన్ను రెచ్చగొట్టొద్దు" అని వెనక్కి తిరిగాను.

"వీడ్ని అంత ఈజీగా వదిలేయకూడదు" అనుకుంటున్నారు.

మనసంతా బాధతో, అసహ్యంతో నిండిపోయింది.

చివరికి నా పేదరికాన్ని అవమానిస్తున్నారు.

అప్పుడనుకున్నాను సంపాదించాలి. ఎప్పటికైనా డబ్బులు సంపాదించాలి అని.

రెండు రోజులు ఎదురు చూసాను - వాళ్లు నా మీద దాడి చేస్తారా అని. ఈ బృందానికి కులం కావాలి. వాళ్ల మాటలన్నీ కులాల గురించే. ఒకే కులం వారు కలిసి వుంటారు. ఇతర కులాల గురించి ముఖ్యంగా అట్టడుగు వర్గాల గురించి చాలా హీనంగా మాట్లాడుకుంటారు. అమ్మ నన్ను ఎవర్నీ ప్రేమించొద్దు అంది. ఇక్కడ ఇలాంటివి కూడా వుంటాయని తెలిస్తే ఖచ్చితంగా భయపడుతుంది..

ఏమనుకున్నారో తెలియదు. తుఫానుకి ముందు ప్రశాంతతలా వుంది. మా ఊర్లో అబ్బాయి, అమ్మాయి మాట్లాడుకుంటే కొంతమంది రకరకాల కథలు ప్రచారం చేస్తారు. వీళ్లు అంతకంటే హీనులు..

****

నేను మా ఊరు వెళ్లాను.

అమ్మ వాకిట్లోనే ఎదురయ్యింది. నన్ను తేరిపార చూసుకుంది.

"నువ్వు అక్కడ బాగానే అలవాటు పడ్డావు నాన్నా" అంది. ఇంట్లోకి వెళ్లాను. అప్పటికప్పుడు టీ చేసుకుని వచ్చింది. మెల్లగా తాగుతుంటే ఏవేవో విషయాల గురించి అడుగుతుంటే చెప్పాను. ఆ తర్వాత స్నానం చేసాను.

"మావయ్యగారింటికి వెళ్లి వస్తాను" అని చెప్పి బయలుదేరాను.

ఇంటి దగ్గర మావయ్య లేరు.

వెన్నెల నన్ను కొత్తగా చూస్తోంది.

అత్తయ్య కాఫీ ఇవ్వనా అంటే ఇంటి దగ్గర తాగి వచ్చానని చెప్పాను.

"అక్కడ అంతా బాగుందా?"

"బాగుంది. మీరు లేని లోటు తప్ప" అన్నాను.

"అది ఆడవారికే వర్తిస్తుంది అల్లుడూ, ఏం చేసినా పెళ్లి అయ్యేంత వరకే. తర్వాత పుట్టింటిని వదిలి రావాల్సిందే. చుట్టుపు చూపుగా ఎప్పుడో వెళ్లాం. ఇప్పుడు ఆడపిల్లల్ని కూడా చదువుల కోసం బయటకు పంపిస్తున్నారు. అమ్మానాన్నల దగ్గర వుండటం తగ్గిపోతోంది" అంది.

అప్పుడే అత్తయ్యకి వెన్నెలా, అర్చనల మీద దిగులు మొదలయిందా అనుకున్నాను. అమ్మ కేసి వెన్నెల చూస్తోంది.

"మావయ్య సాయంకాలం దాకా రారనుకుంటా" అంది.

(ఇంకా ఉంది)

'ఇగ్నో'లో పలు కోర్సులు.. ఉపాధికి బాటలు



దూరవిద్య ద్వారా నైపుణ్యాలు మెరుగయ్యేలా, ఉద్యోగాలకు బాటలు వేసే కోర్సులెన్నో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ప్రవేశ పెట్టింది. సొంతంగా ఏదైనా చేసుకోవాలనే తపన ఉన్నవారికి దారిచూపే చదువులను ఈ యూనివర్సిటీ అందిస్తోంది. ఉపాధ్యాయులు, వైద్యులు, నర్సులు, మార్కెటింగ్ నిపుణులు, మెడికల్ రిప్రజెంటేటివ్స్, టూర్ ప్లానర్స్, అకౌంటెంట్స్...ఇలా అన్ని వృత్తులు, రంగాలకు ఉపయోగపడే కోర్సులు వివిధ స్థాయిల్లో అందుబాటులో ఉంచింది. విదేశీ భాషలు, ఆంగ్లంలో నైపుణ్యాలు, రచనలో సృజనాత్మకతకు మెరుగులద్దే కోర్సులు సైతం ఇగ్నో నిర్వహిస్తోంది. జనవరి, జులై సెషన్లలో ఇవి ప్రారంభమవుతాయి. తాజాగా జనవరి 2019 కోర్సుల ప్రకటన వెలువడిన సందర్భంగా పేరుపొందిన కొన్ని కోర్సుల వివరాలు చూద్దాం.

కళాశాలకు వెళ్లి చదవలేకపోవడానికి కారణాలెన్నో ఉండవచ్చు. అలా అని చదువులకు దూరం కానవసరం లేదు. వాటిని కొనసాగించడానికి దారులు సైతం ఎన్నో ఉన్నాయి. ఆసక్తి, అభిరుచి మేరకు ఎంచుకోవడానికి ఇగ్నో ఆధ్వర్యంలో ఎన్నో కోర్సులు రూపొందాయి. సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా, పీజీ స్థాయిల్లో ఎన్నో కోర్సులను ఇగ్నో అందిస్తోంది. కొత్తవారికి అవకాశాలు కల్పించడంతోపాటు ఇప్పటికే ఆ రంగంలో ఉన్నవారికి ఇవి ప్రయోజనం కలిగిస్తాయి.

విభిన్న కోర్సులు

మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ కౌన్సెలింగ్ :

ప్రస్తుతం వేగంగా మారుతోన్న సామాజిక పరిణామాలు కౌన్సెలర్ల అవసరాలను పెంచుతున్నాయి. పాఠశాలలు, కార్పొరేట్ కంపెనీలు, వైద్య శాలలు, సంక్షేమ సంస్థలు...ఇలా అన్నిచోట్ల నైపుణ్యమున్న వీరికి గిరాకీ ఉంది. ప్రభుత్వ రంగాలు, ఎన్జీవో సంస్థల్లోనూ వీరికి అవకాశాలు లభిస్తున్నాయి. ఉద్యోగుల్లో ఒత్తిడి తగ్గించడం, కుటుంబ సభ్యుల కలహాలు తీర్చడం, విద్యార్థుల్లో భయాలు పోగొట్టడం, రోగుల్లో అవగాహన పెంచడం...ఇలా ప్రతి సందర్భంలోనూ కౌన్సెలర్ల సేవలు కీలకమవుతున్నాయి. పునరావాస కేంద్రాలు, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు, వృద్ధులు, మాదక ద్రవ్య బానిసలు...అందరిలోనూ స్ఫూర్తి నింపాల్సిన బాధ్యత వీరిదే. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు ఇందులో చేరవచ్చు. బోధన ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. రెండేళ్ల కోర్సుకు రూ.36,000 ఫీజుగా చెల్లించాలి. ఇందులో ఏడాది వ్యవధితో పీజీ డిప్లొమా కోర్సు సైతం ఉంది. ఫీజు రూ.15,000

పీజీ డిప్లొమా ఇన్ ఫార్మాస్యూటికల్ సేల్స్ మేనేజ్‌మెంట్ :

ఫార్మా రంగంలో.. ముఖ్యంగా మెడికల్ రిప్రజెంటేటివ్‌గా రాణించాలని ఆశించేవారికి ఈ కోర్సు బాగా ఉపయోగపడుతుంది. ఇంటర్మీడియెట్‌లో సైన్స్ కోర్సు చదివి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు ఇందులో చేరవచ్చు. రెండేళ్ల పని అనుభవం ఉన్న నాన్ సైన్స్ గ్రాడ్యుయేట్లు కూడా ఇందులో చేరడానికి అర్హులే. ఆంగ్ల మాధ్యమంలో సిలబస్ ఉంటుంది. కోర్సు వ్యవధి ఏడాది. ఫీజు రూ.8400.

పీజీ డిప్లొమా ఇన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ :

ఈ కోర్సును ఇగ్నో మరికొన్ని సంస్థలతో కలిసి అందిస్తోంది. వాటిలో బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒకటి. డిగ్రీ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. ఫీజు రూ.6600. పర్యావరణ అంశాలపై ఆసక్తి ఉన్నవారికి ఈ కోర్సు ఉపయోగపడుతుంది.

పీజీ డిప్లొమా ఇన్ అప్లయిడ్ స్టాటిస్టిక్స్ :

ప్రస్తుతం చాలా రంగాల్లో స్టాటిస్టిక్స్ అనువర్తనం పెరుగుతోంది. సమాచార విశ్లేషణలో స్టాటిస్టిక్స్ పాత్రే కీలకం. సాఫ్ట్‌వేర్, ఫార్మా, ల్యాబొరేటరీలు, పరిశోధనా సంస్థలు, విద్యా సంస్థలు...ఇలా వివిధ విభాగాల్లో స్టాటిస్టీషియన్లకు అవకాశాలు లభిస్తున్నాయి. వివిధ రంగాలకు స్టాటిస్టిక్స్ ఎలా అనువర్తించాలి, టూల్స్ ఏ విధంగా ఉయోగించాలి, సమాచారాన్ని విశ్లేషించడం...మొదలైనవి కోర్సులో భాగంగా నేర్పుతారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు ఇందులో చేరవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో అందిస్తున్నారు. ఫీజు రూ.7200.

పీజీ డిప్లొమా ఇన్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ :

బోధనలో సాంకేతికత పాత్ర పెరుగుతోంది. ఏ సమయంలోనైనా, ఎక్కడ నుంచైనా నేర్చుకోవడానికి టెక్నాలజీ తోడ్పడుతోంది. దీంతో బోధన రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయి. టెక్నాలజీని జోడించి బోధిస్తే మెరుగైన ఫలితాలు రాబట్టపవచ్చు. ఇందుకోసం బోధకులు, శిక్షకులు, ఎడ్యుకేషన్ ప్రోగ్రాం రూపకర్తలకు ఎడ్యుకేషన్ టెక్నాలజీపై పట్టు తప్పనిసరి. విద్యార్థి తేలికగా అర్థం చేసుకుని సులువుగా నేర్చుకోవడానికి వీలుగా టెక్నాలజీని జోడిస్తున్నారు. డిగ్రీ చదివినవారు ఈ కోర్సులో చేరవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. ఫీజు రూ.6600.

డిప్లొమా ఇన్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ :

ఇప్పుడు ప్రతీదీ ఓ వేడుకే. పుట్టిన రోజు, పెళ్లి రోజు, ఫ్రెషర్స్ డే, యాన్యువల్ డే, ఎంగేజ్‌మెంట్, రిటైర్‌మెంట్...ఇలా ప్రతీ సందర్భాన్నీ అట్టహాసంగా జరుపుకోవడానికి ప్రాధాన్యం పెరిగింది. వీటిని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు ఈవెంట్ మేనేజర్లు. కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామిక విభాగాలు...సైతం వాటి పరిధిలో నిర్వహించుకునే కార్యక్రమాలకు ఈవెంట్ మేనేజర్లపైనే బాధ్యతలు పెడుతున్నాయి. బ్రాండ్ ప్రమోషన్, ప్రొడక్ట్ లాంచింగ్, ఆడియో ఫంక్షన్...ఇలా కార్యక్రమం ఏదైనా ప్రణాళిక ప్రకారం నిర్వహణ నైపుణ్యాలను ఈవెంట్ మేనేజర్లు ప్రదర్శిస్తారు. ఈ రంగంలో శిక్షణ పొందిన ఈవెంటర్ల కొరత తీర్చడానికి ఇగ్నో.. ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా కోర్సు అందిస్తోంది. కోర్సు ద్వారా కావాల్సిన నైపుణ్యాలు అలవర్చుకుని, నిర్వహణ నైపుణ్యాల్లో సృజనాత్మకతను పెంచుకోవచ్చు. అనంతరం ఏదైనా ఈవెంట్ సంస్థలో ఉద్యోగం లేదా సొంతగా ఈవెంట్స్ నిర్వహించడం చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు ఇందులో చేరడానికి అర్హులు. ఆంగ్ల మాధ్యమంలో కోర్సు ఉంటుంది. ఈవెంట్ ప్లానింగ్, కోఆర్డినేషన్, మార్కెటింగ్...మొదలైనవి నేర్పుతారు. ఇంటర్న్ సైతం చేయిస్తారు. కోర్సు వ్యవధి ఏడాది. ఫీజు రూ.8000.



ఆహార రంగంలో...

సర్టిఫికెట్ ఇన్ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ :

ఎలాంటి విద్యార్హతలు లేకుండా 18 ఏళ్లు పైబడినవారు ఈ కోర్సులో చేరవచ్చు. ఆరోగ్య స్పృహ పెంపొందించడానికి దీన్ని రూపొందించారు. ఆహార పదార్థాలు ఎంచుకోవడం, ఆహార తయారీ, వివిధ వయసులవారికి కావాల్సిన పోషక పదార్థాలు, కిచెన్ గార్డెనింగ్, తక్కువ ఖర్చుతో పర్యావరణ అనుకూలంగా పోషకాలు ఉన్న ఆహారం తయారుచేసుకోవడంపై అవగాహన కల్పిస్తారు. కోర్సు వ్యవధి 6 నెలలు. ఫీజు రూ.1400.

సర్టిఫికెట్ ఇన్ న్యూట్రిషన్ అండ్ చైల్డ్‌కేర్ :

ఇంటర్ విద్యార్హతతో ఈ కోర్సులో చేరవచ్చు. పోషణ, శిశు వికాసానికి సంబంధించి ఈ కోర్సు పూర్తి అవగాహన కల్పిస్తుంది. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తయారుచేయడం, పోషణ లోపిస్తే వచ్చే సమస్యలు, ఆహారాన్ని ఎంచుకోవడం, భద్రపర్చడం, ఫుడ్ బడ్జెట్ సూత్రాలు...కోర్సులో భాగంగా నేర్పుతారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఆరేళ్ల చిన్నారి వరకు కావాల్సిన పోషణ, వికాస సంబంధ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారు. కోర్సు వ్యవధి 6 నెలలు. ఫీజు రూ.1800.

భాషలపై ఆసక్తి ఉంటే...

విదేశీ భాషలు :

ఇంటర్ ఉత్తీర్ణులు సర్టిఫికెట్ ఇన్ ఫ్రెంచ్/ అరబిక్ / జపనీస్/ కొరియన్/ స్పానిష్ లాంగ్వేజ్ కోర్సుల్లో చేరవచ్చు. ఆంగ్లం వచ్చినవారు విద్యార్హతలు లేకుండానే రష్యన్‌లో సర్టిఫికెట్ కోర్సు చేసుకోవచ్చు. వీటి వ్యవధి 6 నెలలు.

సర్టిఫికెట్ ఇన్ ఫంక్షనల్ ఇంగ్లిష్ :

ఆంగ్ల భాషలో ప్రాథమిక నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి ఈ కోర్సు ఉపయోగపడుతుంది. వివిధ సందర్భాల్లో ఆంగ్లంలో ఎలా మాట్లాడాలో తెలుసుకోవచ్చు. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవారు ఇందులో చేరడం ద్వారా ప్రయోజనం పొందవచ్చు. ఆంగ్లంలో సంభాషణ, రాత నైపుణ్యాలను మెరుగు పర్చుకోవచ్చు. కోర్సు వ్యవధి 6 నెలలు. ఫీజు రూ.3000.

పౌల్ట్రీ, డెయిరీ, వ్యవసాయం...

పౌల్ట్రీ ఫార్మింగ్ :

చాలామంది ఔత్సాహికులు, నిరుద్యోగులు స్వయం ఉపాధిపై దృష్టిసారించడం మనకు తెలిసిందే. అయితే ఏమి చేయాలనుకున్నా ఆ రంగంలో ప్రాథమికావగాహన తప్పనిసరి. తక్కువ పెట్టుబడితో ఏడాది పొడువునా చేతికి ఆదాయం అందించడం పౌల్ట్రీ ప్రత్యేకత. అయితే ఈ రంగంలో సిరులు కురవాలంటే కోళ్ల పెంపకం, వాటి పోషణ, ఫారాల నిర్వహణపై శాస్త్రీయ అవగాహన తప్పనిసరి. ఆ దిశగా తెలుగు మీడియంలో ఇగ్నో 'పౌల్ట్రీ ఫార్మింగ్' కోర్సు అందిస్తోంది. కోర్సు వ్యవధి 6 నెలలు. ఫీజు రూ.3600. ఎనిమిదో తరగతి విద్యార్హతతో ఇందులో చేరవచ్చు.

బీ కీపింగ్ :

ఇదే విద్యార్హతతో తేనె తయారీ కోసం 'బీ కీపింగ్' కోర్సును ఆంగ్ల మాధ్యమంలో అందిస్తున్నారు. 6 నెలల వ్యవధి గల ఈ కోర్సు ఫీజు రూ.1400.

డెయిరీ ఫార్మింగ్ అవేర్‌నెస్ :

ఈ కోర్సును కూడా తెలుగు మాధ్యమంలో అందిస్తున్నారు. పాడిపరిశ్రమపై ఆసక్తి ఉన్నవారు ఇందులో చేరవచ్చు. జంతువుల పెంపకం, రోగాల బారినుంచి వాటిని సంరక్షించడం, పాల దిగుబడి పెంచడం, దాణా ఎంచు కోవడం..తదితరాలు ఇందులో నేర్పుతారు. ఈ కోర్సులో చేరడానికి ఎలాంటి విద్యార్హతలూ అవసరం లేదు. కోర్సు వ్యవధి 2 నెలలు. ఫీజు రూ.1100.

సర్టిఫికెట్ ఇన్ ఆర్గానిక్ ఫార్మింగ్ :

వ్యవసాయంలో రసాయనాలు, ఎరువుల వినియోగం బాగా పెరుగుతోంది. ఈ పరిణామాలు ఆరోగ్యం, పర్యావరణంపై దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. వ్యవసాయదారుల్లో సేంద్రియ సాగుపై అవగాహన కల్పించడం, ఆ విధానంలో పండించిన ఉత్పత్తులకు గుర్తింపు (సర్టిఫికేషన్) తెచ్చుకోవడంపై అవగాహన కల్పించేలా కోర్సు రూపొందించారు. కోర్సు వ్యవధి 6 నెలలు. ఇంటర్ ఉత్తీర్ణులు చేరవచ్చు. ఫీజు రూ.4800.

❀ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ :** జనవరి 15, 2019

❀ **వెబ్‌సైట్ :** http://ignou.ac.in

సరైన కెరీర్ ఎంపికతోనే జీవితంలో రాణింపు

పవన్ చురుకైన విద్యార్థి.. చదువుతోపాటు ఆటల్లోనూ ప్రతిభ చూపేవాడు. దీంతో టీచర్లు, చుట్టాలు, తెలిసినవాళ్లు.. ఒకరే మిటి అందరూ.. భవిష్యత్‌లో పెద్ద స్థాయికి వెళ్తావ్ అంటూ పవన్‌ను అభినందించేవారు. సంవత్సరాలు గడిచాయి.. టాప్ గ్రేడ్‌లతో పవన్ చదువు పూర్తయింది.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో కొలువు సొంతమైంది. ఆనందంగా ఉద్యోగంలో చేరిపోయాడు. తన పనితనంతో అందరి మెప్పు పొందాలనుకున్నాడు. సంస్థలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని కలలు కన్నాడు. కానీ, చివరకు ఓ సాధారణ ఉద్యోగిగా మిగిలి పోయాడు. కారణం.. కెరీర్ ఎంపికలో జరిగిన పొరపాటు. అవును.. పవన్ ఒక్కడే కాదు..

ప్రస్తుతం ఎంతోమంది యువత తమకు నచ్చే కెరీర్‌ను ఎంచు కోవడంలో పొరబడుతున్నారు. కెరీర్ ఎంపికలో విద్యార్థులు పూర్తి అవగాహనతో అడుగులు వేయలేకపోతున్నారు. ముఖ్యంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉద్యోగం సంపాదించిన వారు ఉన్నత స్థాయికి చేరుకోలేక సాధారణ ఉద్యోగులుగానే మిగిలిపోతున్నారు. మరి సరైన కెరీర్‌ను ఎంచుకోవడానికి ఏం చేయాలి? కెరీర్ ఎంపికలో తల్లిదండ్రుల పాత్ర తదితర అంశాల గురించి తెలుసుకుందాం...

ఎంపికలో సరైన నిర్ణయం తీసుకున్నప్పుడే కెరీర్ మారథాన్‌లా సాగుతుంది లేదంటే స్ప్రింట్ తరహాలో త్వరగా, వేగంగా ముగిసిపోతుంది. కాబట్టి కెరీర్ ఎంపికలో అన్ని కోణాల్లో ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయంలో ఇప్పటికీ చాలామంది మూస ధోరణిలోనే వెళ్తున్నారు. ఇది ఎంతమాత్రం సరికాదు. కెరీర్ ప్రయాణం నిచ్చెనలా సాగాలి. అంతేకానీ, ఎదుగూ బొదుగూ లేని తిన్నని రేఖలా కాదు.

కెరీర్ ఎంపిక జరుగుతోందిలా..

కోర్సులో చేరడం దగ్గర నుంచి కెరీర్ ఎంపిక వరకూ.. విద్యార్థులను తల్లిదండ్రులు, స్నేహితులు, చుట్టూ ఉన్న సమాజం, జాబ్ మార్కెట్.. ఇలా అనేక అంశాలు ప్రభావితం చేస్తున్నాయి.

తల్లిదండ్రులు : తమ స్వీయ అనుభవం, అవగాహన ఆధారంగా పిల్లల చదువు, కెరీర్‌ను నిర్ణయిస్తున్నారు. తమ కలలను పిల్లల ద్వారా సాకారం చేసుకోవాలని చూస్తుంటారు.

జాబ్ మార్కెట్ : కెరీర్ ఎంపికలో తల్లిదండ్రులు తర్వాత జాబ్ మార్కెట్ ప్రభావం అధికంగా కనిపిస్తోంది. ఏ కోర్సులో చేరితే.. చదువు పూర్తికాగానే అధిక వేతనంతో ఉద్యోగం లభిస్తోందో.. దాన్నే ఎంచుకోవడానికి ఆస్కారం ఎక్కువగా ఉంది. కెరీర్ ఎంపికలో విద్యార్థులను ఎక్కువగా ప్రభావితం చేసే అంశమిది.

ఉదా : ఐటీ, ఫార్మా.

నెట్‌వర్క్ : కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్, పరిచయమున్న వ్యక్తులు ఈ కేటగిరీ కిందకు వస్తారు. వీరిలో క్లోజ్ ఫ్రెండ్స్ ప్రభావం కెరీర్ ఎంపికపై అధికంగా ఉంటుంది. స్నేహితులు చేరిన కోర్సును ఎంచుకోవడం ద్వారా ఫ్రెండ్‌షిప్‌ను కొన సాగించొచ్చనే అభిప్రాయంతో కెరీర్ ఎంపికలో స్వీయ ఆసక్తులు, ఇష్టాలను చాలామంది పట్టించుకోవడం లేదు.

మరెన్నో కారణాలు..

ఒక వ్యక్తి చిన్నప్పటి నుంచి డ్రాయింగ్, స్కెచెస్ ఇష్టపడితే.. అతని కెరీర్ డిజైన్ డొమైన్‌లో.. అలాగే పరికరాల పట్ల ఆసక్తి ఉంటే.. అతని దృష్టి ఇంజనీరింగ్ వైపు వెళ్తుంది. దీనికి కారణం.. అలవాట్లు, ఇష్టాలను కెరీర్‌కు అన్వయించడమే. చాలామంది విద్యార్థులు విన్నదాని ఆధారంగా, ఎలాంటి అధ్యయనం చేయకుండా.. లోతుగా ఆలోచించకుండా కెరీర్‌పై నిర్ణయానికి వస్తుంటారు.

సరైన ఎంపిక ఇలా...

వేలల్లో ఆప్షన్లు.. వాటిలో మీకు నచ్చే.. మీరు మెచ్చే కెరీర్‌ను ఎంచుకోవడం క్లిష్టమైన పనే. ఇష్టాలు, సామర్థ్యాలతోపాటు కొన్ని శాస్త్రీయ పద్ధతులను అనుసరించి కెరీర్ పరంగా సరైన నిర్ణయం తీసుకోవచ్చు. ఈ దిశగా పరిశీలించాల్సిన కీలక అంశాలు...

సహజ సామర్థ్యం :

ప్రతి ఒక్కరూ కొన్ని పనులను ఇతరులతో పోల్చితే సులభంగా, వేగంగా చేయగలుగుతారు. ఈ సహజ సామర్థ్యాన్ని పనిచేసే చోట ప్రదర్శించగలిగితే.. మంచి వేతనాలతో పాటు పదోన్న తులు దక్కుతాయి. అందుకే సహజ సామర్థ్య ప్రదర్శనకు వీలున్న కెరీర్‌ను ఎంచుకునేందుకు ప్రయత్నించాలి.

స్వీయ పరిశీలన :

ఆసక్తులు, సాఫ్ట్‌స్కిల్స్, అభిరుచులు, విలువలు, వ్యక్తిత్వం తది తరాల ఆధారంగా తమకు సరిపోయే కొన్ని రంగాలు, కెరీర్‌ల జాబితా సిద్ధం చేసుకోవాలి. అదేవిధంగా ఆయా కెరీర్‌ల పట్ల పరిశోధన చేయడం ద్వారా ఓ జాబితాను రూపొందించు కోవచ్చు. సదరు జాబితాలోని కెరీర్‌ల గురించి మరింత పరిశోధన చేయడం, ఆయా రంగాల్లో పనిచేస్తున్న వారి అభిప్రాయాలు తీసుకోవడం ద్వారా జాబితాను కుదించొచ్చు. దీనికోసం లింక్డిన్ బాగా ఉపయోగపడుతుంది. జాబితాలోని కెరీర్‌లు, రంగాలను ఒక్కోటి పరిశీలించుకుంటూ.. ప్రతికూల, సానుకూల అంశాలను రాసుకోవాలి. స్వీయ బలాలు, బలహీనతల ఆధారంగా విశ్లేషణ చేయాలి. అవసరమైతే 'కెరీర్ టెస్టుల' ఆధారంగా స్వీయ విలక్షణతలను గుర్తించగలిగితే.. సరిపోయే కెరీర్‌ను ఎంచుకోవడం తేలికవుతుంది. అదేవిధంగా కెరీర్ కౌన్సిలర్లను సంప్రదించడం ద్వారా సరైన కె రీర్‌ను ఎంచుకునే అవకాశం ఉంటుంది.

పక్కా ప్రణాళిక :

ప్రతి విద్యార్థి.. కెరీర్ పరంగా పక్కా ప్రణాళిక, లక్ష్యాలను కలిగుండాలి. అప్పుడే కెరీర్ సోపానంలో ముందువరుసలో ఉంటారు. ఉదాహరణకు మీ తక్షణ, ప్రథమ లక్ష్యం బిజినెస్ అనలిస్ట్ కావడమైతే.. తర్వాతి లక్ష్యాలు వరుసగా ఐటీ సపోర్ట్ మేనేజర్, డైరెక్టర్ ఆఫ్ సపోర్ట్, వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ సపోర్ట్ కావాలి. ఇలా ఎప్పటికప్పుడు స్థిరమైన లక్ష్యాలను నిర్దేశించు కుంటూ.. వాటిని సాధించేందుకు ప్రయత్నించినప్పుడే కెరీర్ నిచ్చెనలో పైకి చేరగలరు.

జీపీవీ ఫార్ములా..

కెరీర్ పరంగా గిఫ్ట్స్, ప్యాషన్స్, వాల్యూస్ (జీపీవీ).. ఫార్ములాను అనుసరించాలి. ఏయే రంగంలో ఏ విధమైన గ్రోత్ ఉంటుంది..స్వీయ ఇష్టాలు ఏ రంగం వైపు వెళ్లమంటున్నాయి.. తదితర అంశాలను తప్పనిసరిగా పరిశీలించాలి. కెరీర్ ఎంపికలో విలువలను వదులుకోవాల్సిన అవసరం లేదు.

కొత్తదనం..

డాక్టర్, లాయర్, టీచర్, కంప్యూటర్ ఇంజనీర్.. ఇలా ఎప్పుడూ సంప్రదాయ కొలువులేనా.. యువత కెరీర్ ఎంపికలో కొత్తదనంపైనా దృష్టిపెట్టాలి. ప్రస్తుతం మార్కెట్‌లో అనేక కొత్త ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఆయా ఉద్యోగాల్లో స్థిరపడటం ద్వారా ఇతర రంగాలతో పోల్చితే త్వరగా ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది.

ఇంటర్న్‌షిప్ :

కెరీర్ ఎంపికలో ఇంటర్న్‌షిప్ స్పష్టతనిస్తుంది. ఇంటర్న్‌షిప్ ద్వారా సదరు డొమైన్‌లో నైపుణ్యాలు లభించడంతోపాటు శాశ్వత కొలువు దక్కే అవకాశం ఉంటుంది. నెట్‌వర్కింగ్ పెరిగి కెరీర్ పరంగా భవిష్యత్‌లో ప్రయోజనం దక్కుతుంది.

పరిశీలన ద్వారా..

కెరీర్ ఎంపికలో తడబాట్లను దిద్దుకునేందుకు ఎలాంటి శాస్త్రీయ పద్ధతులు అందుబాటులో లేవా? అనే ప్రశ్న చాలా మందిలో తలె త్తేదే. కొంత రీసెర్చ్, ఇతర అంశాల పరిశీలన ద్వారా కెరీర్ ఎంపిక లో శాస్త్రీయంగా వ్యవహరించవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

విశాలాంధ్ర బిజినెస్

130.77 ▲ సెన్సెక్స్	30.35 ▲ నిఫ్టీ	-25 ▲ బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	00 ▼ వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
35,980.93	10,802.15	30,015 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	30,350 / ప్రొద్దుటూరు 30,350 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	40,000 కిలో (రూపాయల్లో)	41,450 / ప్రొద్దుటూరు 42,637 కిలో (రూపాయల్లో)	70.20

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
సన్‌ఫార్మా	448.05	4.00
ఐసీఐసీఐ బ్యాంక్	380.15	3.39
ఎస్‌బీఐ	305.30	3.04
ఎస్-బ్యాంక్	193.20	2.78
టాటా మోటార్స్	180.50	2.62

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
జీ-ఎంటర్‌టైన్	451.65	-2.44
యూపీఎల్	752.20	-1.51
కోటక్ మహీంద్ర	1,228.90	-1.42
ఎన్‌టీపీసీ	149.50	-1.11
బీపీసీఎల్	355.90	-1.01

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ (క్రి.ముగింపు)	రూ.విలువ (ప్ర.ముగింపు)
డాలర్	69.72	70.20
యూరో	79.47	80.35
పౌండ్	88.26	89.53
ఆస్ట్రేలియా డాలర్	49.12	50.12
సింగపూర్ డాలర్	51.22	51.70

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,370	32,418
చెన్నై	30,370	32,481
బెంగళూరు	29,820	32,893
ముంబై	31,280	33,454
విజయవాడ	..	32,850
విశాఖపట్నం	30,350	31,770
ప్రొద్దుటూరు	30,350	31,870

ముడి చమురు	57.33

ఏపీలో రహదారులకు మహర్దశ



- ఏపీ అభివృద్ధికి వెలుగు బాటలు
- శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు జెట్ స్పీడ్‌తో రహదారుల నిర్మాణం
- ఎక్స్‌ప్రెస్ వేతో 5 గంటల్లో రాజధానికి
- అమరావతికి జిల్లా రహదారుల అనుసంధానం
- రాష్ట్ర రహదారుల దూరం 41, 956 కి.మీ. నుంచి 46,342కి పెంపు

"అదిగదిగో అమరావతి... ఐదు గంటలే ప్రయాణం ... రండి రండి చూసొద్దాం...అని సీమ వాసి ధీమాగా చెప్పే రోజులు మరెంతో దూరంలో లేవు"

"ఇంతకు ముందు రోడ్లు అధ్వానంగా, ప్రమాదాలకు చిరునామాగా ఉండేవి. రాత్రి సమయంలో ఆర్టీసీ బస్సు ఎక్కితే ఒకటే భయం...రోడ్డుపై ఎక్కడ గుంట ఉంటుందో బస్సు ఎక్కడ అదుపు తప్పుతుందో అని ప్రాణాలు అరచేతిలో పెట్టుకునేవాళ్లం" - వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇచ్ఛాపురం నుంచి చిత్తూరు వరకు రోడ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి రహదారులు వెలుగుబాటలు పరవబోతున్నాయ్. రహదారులు దేశాభివృద్ధికి జీవనాడులు. రోడ్లు బాగుంటేనే ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుంది. మారుమూల గ్రామాలకు కూడా ఆర్థికాభివృద్ధికి చేరుతుంది. అన్ని ప్రాంతాలు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలంటే రహదారుల నిర్మాణం ముఖ్యమని, రోడ్లు సరిగా ఉంటేనే ప్రభుత్వ ఫలాలు చివరి లబ్ధిదారుడి వరకు చేరుతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావించింది. ఇందుకు అనుగుణంగా నాలుగున్నరేళ్లలో పగడ్బందీ ప్రణాళి కలను రూపొందించి అమలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వమే వ్యయం చేసి కొన్ని ప్రాజెక్టులు, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మరికొన్ని ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి.

ప్రస్తుతం రాష్ట్రంలో జాతీయ రహదారులు మొత్తం విస్తీర్ణం 4,913 కి.మీ. రాష్ట్ర హైవేలు 14,722 కిలోమీటర్లు కాగా ప్రధాన రహదారుల విస్తీర్ణం 10,629 కిలోమీటర్లు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రహదారులు 15,567 కిలోమీటర్లు. అన్ని జిల్లాల కీలక ప్రాంతాల నుంచి రాజధాని అమరావతికి చేరు కునేందుకు నాలుగు వరుసలు, రెండు వరుసల రోడ్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. వీటితోపాటు రాష్ట్రంలోని అన్ని పోర్టులు, పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక క్షేత్రాలు, ఎయిర్ పోర్టులకు ఆయా జాతీయ రహదారుల గుండా వెళ్లేలా కనెక్టివిటీ రహదారులను నిర్మించి అభివృద్ధి పంథా అవి ష్కరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

చురుగ్గా సర్వే పనులు:

ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణంలో భాగంగా భూముల సర్వే వేగవంతమైంది. ఈ రహదారి ఎటు వెళ్తుంది..ఏయే భూములు అవసరం అనేది అధికారులు గుర్తించే పనిలో ఉన్నారు. అనంతపురం నుంచి అమరావతికి 373 కిలోమీటర్ల మేర నిర్మిచనుండగా అందులో కడప నుంచి 125 కిలోమీటర్లు, కర్నూలు నుంచి 123 కిలోమీటర్ల రహదారులు వచ్చి కలుస్తాయి. అప్పటివరకు నాలుగు వరుసలుగా ఉండే రహదారి ఆ రెండూ కలిసిన తర్వాత ఆరు వరుసలుగా మారుతుంది.

అమరావతిలో కీలక రహదారి నిర్మాణం:

రాజధాని అమరావతిలో రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సీడ్ యాక్సిస్ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. అమరావతిలో ప్రభుత్వ కార్యాలయంలో భాగంగా చేపడుతున్న వివిధ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేందుకు సీఆర్డీయే ఓ కీలక రహదారిని నిర్మిస్తోంది. కృష్ణానది కరకట్ట నుంచి శాఖమూరు వద్ద అభివృద్ధి పరుస్తున్న అమరావతి సెంట్రల్‌పార్క్ వరకు సుమారు 7 కిలోమీటర్ల పొడవున, 23 అడుగుల వెడల్పుతో ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే గవర్నమెంట్ కాంప్లెక్స్‌లోని వివిధ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించడం మంత్రులు, ఉన్నతాధికారులకు సులభమవుతుంది. ప్రస్తుతం వీరు పనులను పరిశీలించాలంటే అంత బాగాలేని రోడ్లపై, చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. అంతే కాకుండా.. కొత్త రోడ్డు సిద్ధమైతే వర్షాలొచ్చినప్పటికీ వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులూ ఉండవు.

పట్టాలపైకి ఎక్స్‌ప్రెస్ వే

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అనంతపురం -అమరావతి రహదారి పనులు శరవేగంగా జరుగు తున్నాయి. ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కోసం భూసే కరణ పనులు వేగవంతమయ్యాయి. వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ప్రభుత్వం భావి స్తోంది. దేశంలోనే అత్యంత పొడవుగా. మలుపులు లేకుండా దీనిని నిర్మించనున్నారు. రాయలసీమ సమగ్ర అభివృద్ధిలో ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కీలకం కానుంది. 393.59 కిలో మీటర్లు నిర్మించే ఈ ప్రతిష్టాత్మక ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టుకు రూ. 27,600 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.

రాష్ట్రంలో భారీగా రోడ్ల విస్తరణ:

రాకపోకలు సాఫీగా, సున్నితంగా సాగడానికి రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల విస్తరణకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టింది. వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభి వృద్ధిలో భాగంగా 66.30 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ. 938 కోట్లు కేటాయించారు. 2014-15లో రాష్ట్రంలోని రోడ్ల విస్తీర్ణాన్ని 41,956 నుంచి 46,342 కిలోమీటర్ల మేర పెంచడం జరిగింది.

జూన్ 2014 నుంచి వివిధ పథకాల కింద రూ. 10,732 కోట్ల వ్యయంతో మొత్తం 10,691 కిలోమీటర్ల పొడవున రోడ్లు, 133 వారధులు నిర్మాణంలో ఉన్నాయి. ఇవే కాకుండా 2019-19 సంవత్సరంలో 1,930 కిలో మీటర్ల రహదారులను వెడల్పు చేయడానికి, పటిష్ట పరచడానికి రూ. 2,122 కోట్ల నిధులు కేటాయించింది ప్రభుత్వం.

విజ్ఞానం

రొమ్ము కేన్సర్ నివారణకు కొత్త డ్రగ్...!



రొమ్ము కేన్సర్‌కు సంబంధించిన నూతన మందు కను గొనబడింది. ఇండియన్ అమెరికన్ అధ్యయనవేత్త బ్రెస్ట్‌కేన్సర్ నివారణకు సంబంధించిన మాలిక్యూల్‌ను గుర్తించారు. ఈ అధ్యయనంతో సాంప్రదాయక థెరపీలకు స్వస్తిచెప్పనున్నారు. బ్రెస్ట్ కేన్సర్‌కు తోడ్పడే ఈస్ట్రోజన్ హార్మోన్‌ను నియంత్రించే మాలిక్యూల్ ను నూతన పద్ధతిలో కనిపెట్టారు. ట్యూమర్ కణాలపై ఉండే ఈస్ట్రోజన్‌లోని ప్రోటీన్‌ను లక్ష్యంగా ఇది పనిచేస్తుందని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ సౌత్ వెస్ట్రన్ వెల్లడించారు. ప్రస్తుతం అమలులో ఉన్న లిమిటేషన్లను అధిగమించే నూతన మెకానిజమ్‌ను రూపొందిచారు. టామాక్సిఫిన్ అనే హెూర్మోన్ థెరపీతో ఈ కేన్సర్లను తగ్గించవచ్చు...కానీ ఈ నూతన కాంపౌండ్‌తో కేన్సర్ ప్రభావాన్ని మరింతగా తగ్గించవచ్చునని తెలుస్తోంది. గత కొన్ని దశాబ్దాలుగా అధ్యయనకారులకు "ప్రోటీన్-ప్రోటీన్ ఇంటరాక్షన్స్' కలగా మిగిలింది. కొత్త మాలిక్యూల్ అయిన జు=ఆ-11 పెప్టయిడ్‌ను, ప్రోటీన్ బిల్డింగ్ బ్లాక్‌ను అనుకరిస్తుంది.

వరల్డ్ వర్సిటీ ఆఫ్ డిజైన్‌లో పీహెచ్‌డీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: యూజీసీ గుర్తింపు పొందిన వరల్డ్ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్ (డబ్ల్యుయూడీ) పీహెచ్‌డీ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. డిజైన్ మేనేజిమెంట్, విజువల్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్ మొదలైన కోర్సుల్లో పీహెచ్‌డీ చేసేందుకు ఈనెల 11లోగా దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ తెలిపింది. దేశంలో నిపుణులైన డిజైనర్ల అవసరం ఉన్నందునే పీహెచ్‌డీని ప్రవేశపెట్టినట్టు యూనివర్సిటీ వీసీ సంజయ్ గుప్తా తెలిపారు.

సోనాలిక ట్రాక్టర్స్ వృద్ధి 20.8శాతం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సోనాలిక ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ 2018లో 87,507 ట్రాక్టర్ల ఉత్పత్తి, అమ్మకాల ద్వారా 20.8శాతం వృద్ధిని నమోదు చేసినట్టు సోనాలిక గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ రమణ్ మిట్టల్ తెలిపారు. గతనెలలో 6066 ట్రాక్టర్ల ఉత్పత్తి చేయగా గతేడాది ఈ సమయానికి 5321 ట్రాక్టర్లను ఉత్పత్తి చేసి 14శాతం వృద్ధిని సాధించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులలో 36 శాతం, దేశీయ మార్కెట్లో 18.6 శాతం వృద్ధిని సాధించినట్టు వెల్లడించారు. రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచడమే తమ లక్ష్యంగా తెలిపారు. ఫలితంగా సుస్థిర వృద్ధిని కంపెనీ సాధిస్తోందన్నారు.

ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్ట్‌గా తొలి మహిళ



వాషింగ్టన్: అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) సంస్థలో చీఫ్ ఎకనమిస్ట్‌గా తొలి మహిళ నియమితులయ్యారు. భారత్‌లోని కర్ణాటకకు చెందిన గీతా గోపీనాథ్ ఐఎంఎఫ్‌లో అత్యున్నత పదవి పొందిన తొలి మహిళగా గీత ఘనత సాధించారు. హార్వర్డ్ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్. ఐఎంఎఫ్ పరిశోధన విభాగం డైరెక్టర్‌గా పనిచేసిన మౌరీ ఆస్టెఫెల్డ్ డిసెంబరు 31 పదవీ విరమణ పొందారు. ఆయన పదవీ విరమణ తర్వాత గీతకు చీఫ్ ఎకనమిస్ట్‌గా పదవి దక్కింది.గత ఏడాది అక్టోబరు 1వ తేదీనే గీతా గోపీనాథ్‌ను ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్ట్‌గా నియమించుకుంటున్నట్లు ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టీన్ లగార్డే వెల్లడించారు. ఆమె ప్రపంచంలోని అత్యుత్తమ ఆర్థికవేత్తల్లో ఒకరని ప్రశంసించారు. గీతా గోపీనాథ్ ఐఎంఎఫ్‌కు 11వ చీఫ్ ఎకనమిస్ట్. తనకు ఈ పదవి దక్కడం చాలా అరుదైన గౌరవంగా భావిస్తున్నానని గీత ఆనందం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ప్రపంచీకరణ నుంచి వెనక్కి తగ్గడం, సుంకాలు పెంపు పెద్ద సవాళ్లుగా మారాయని, బహుళజాతి సంస్థలకు ఇబ్బందులు పెరిగాయని గీత వెల్లడించారు.

వరుస లాభాల్లో మార్కెట్లు

130పాయింట్లతో సెన్సెక్స్ — లాభాల్లో ఫార్మా



ముంబై: దలాల్ స్ట్రీట్ వరుసగా మూడవరోజు లాభాలతో ముగిసింది. ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు తర్వాత స్వల్పంగా నష్టపోయి, తిరిగి లాభాల్లోకి వచ్చాయి. చివరి గంటలో మరికాస్త కోలుకున్నాయి. మౌలిక, ఐటీ, విద్యుత్ తదితర రంగాల షేర్లు నష్టపోగా, ఫార్మా రంగ షేర్లు లాభపడ్డాయి. ముఖ్యంగా సన్ ఫార్మా బాగా లాభాలను నమోదు చేసింది. బ్యాంకింగ్ స్టాక్స్ అయిన ఐసీఐసీఐ బ్యాంకు, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకు షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మిశ్రమ ఫలితాలు మార్కెట్లను ఒక దశలో ఊగిసలాటలకు గురిచేసాయి. డిసెంబరు క్వార్టర్ ఫలితాలు వెలువడనుండటంతో మదుపరులు అప్రమత్తతం పాటించినట్లు తెలుస్తోంది. టిసిఎస్, ఇన్ఫోసిస్ వంటి ఐటి మేజర్లు క్యు3 ఫలితాలను వచ్చేవారం వెల్లడించనున్నారు. బిఎస్ఇ సెన్సెక్స్ 130.77పాయింట్లతో 0.36శాతంతో 35,980.93 పాయింట్లు నమోదు చేసింది. నిఫ్టీ 30.35పాయింట్లతో 0.28శాతంతో 10,802పాయింట్లు నమోదు చేసింది. బిఎస్ఇ మిడ్‌కాప్ 0.16శాతం నష్టాల్లో నమోదుకాగా స్మాల్‌కాప్ 0.17శాతం పెరిగింది. సెక్టరల్ సూచీలైన టెలికాం, బ్యాంకెక్స్ షేర్లు 1.3శాతం పెరిగాయి. హెల్త్‌కేర్, మెటల్, ఫైనాన్స్, బేసిక్ మెటీరియల్స్ లాభాల్లో నమోదయ్యాయి. మరోవైపు కాపిటల్ గూడ్స్,పవర్, యుటిలిటీస్, రియాల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ నష్టాల్లో నమోదయ్యాయి. సన్‌ఫార్మా, ఐసిఐసిఐ బ్యాంకు, ఎస్‌బీఐ, యస్‌బ్యాంకు, టాటా మోటార్స్,యాక్సిస్ బ్యాంకు,బజాజ్ ఆటో టాప్ గెయినర్స్ కాగా కీలకసూచీలై కొటక్ బ్యాంకు, ఎన్‌టిపిసి, హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ మేజర్ లూజర్స్‌గా ఉన్నారు. మరోవైపు బంధన్ బ్యాంకు షేర్లు, గృహ ఫైనాన్స్ లిమిటెడ్ విలీనమని ప్రకటించిన నేపథ్యంలో 4.8శాతం, 16.4శాతం నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లు: యూరోపియన్ స్టాక్స్, యుఎస్ ఈక్విటీ ఫ్యూచర్స్ లాభాల్లోనే నమోదయ్యాయి. చైనా,అమెరికాల మధ్య జరగనున్న వాణిజ్య చర్చల అభివృద్ధి నేపథ్యంలో మదుపరులు వేచిచూస్తున్నారు. ఆసియా షేర్లు మిశ్రమంగా నమోదయ్యాయి. స్టాక్స్ యూరప్ 600ఇండెక్స్‌లో సాంకేతిక ఫర్మ్‌లు, బ్యాంకులు అతిపెద్ద లాభాల్ని నమోదుచేసాయి. యూరో నష్టాల్లో నమోదైంది. ఎస్ అండ్ పి 500 ఫ్యూచర్స్ 0.3శాతం లాభించింది.

ఈ-వ్యాలెట్లు ఖాళీకానున్నాయా..?



న్యూఢిల్లీ : పెద్ద నోట్ల రద్దు సమయంలో దేశ ప్రజలకు చేరువైన పేటీయం, అమెజాన్‌పే వంటి ఈ-వ్యాలెట్‌లు ఖాళీ అయ్యే ప్రమాదంలో ఉన్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చలు కొనసాగుతున్నాయి. మార్చి నాటికి 95 శాతంపైగా ఈ-వ్యాలెట్ కంపెనీలు తమ కార్యకలాపాలను నిలిపివేసే దిశగా పయనిస్తున్నట్లు ఓ పే-అప్ కంపెనీ అధికారి తెలిపారు. ప్రీపెయిడ్ పేమెంట్ సాధనాలు(పీపీఐ), ఈ-వ్యాలెట్‌లకు 2017 అక్టోబర్‌లో ఆర్‌బీఐ, వారి ఖాతాదారుల నుంచి సమగ్ర సమాచారం కేవైసీల రూపంలో సేకరించవలసిందిగా.. లేకుంటే వినియోగదారుని ఖాతా నిలిపివేయాల్సిందిగా నియమం జారీ చేసింది. దీంతో పేటీయం, ఫోన్‌పే వంటి ఈ-వ్యాలెట్ కంపెనీలు వినియోగదారుల నుంచి ఆధార్ రూపంలో సమాచారం సేకరిస్తున్నాయి. కానీ ఈ రంగంలో అత్యంత ఎక్కువ వ్యాపారం చేసే పేటీఎం, అమెజాన్ పే వంటి పెద్ద కంపెనీలు ఇప్పటి వరకూ కేవలం 30 శాతం మంది వినియోగదారుల సమాచారం మాత్రమే సేకరించి నట్లు తెలిపాయి. కానీ ఆధార్ సమాచార సేకరణ నేరమని సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో కేవైసీల సేకరణ నిలిచిపోనుంది. అయితే ఫిబ్రవరి కల్లా ఆర్‌బీఐ పెట్టిన గడువు ముగుస్తుండటం, ఆర్‌బీఐ ప్రత్యామ్నాయ మార్గాలను ఇంకా సూచించక పోవడంతో ఈ-వ్యాలెట్ కంపెనీల మనుగడపై నీలనీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే చెల్లింపులకు ఉపయోగించే ఈ-వ్యాలెట్లు కంపెనీలు విలీన మార్గాలను ఎంచుకుంటుండగా పీపీఐ లైసెన్సులు పొందిన పేటీఎం, ఫోన్‌పే, అమెజాన్‌పే వంటి భారీ సంస్థలు ఇతర వ్యాపార మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలుస్తుంది.

తగ్గిన ప్రజారవాణా వాహనాల అమ్మకాలు

న్యూఢిల్లీ : గత ఏడాది ఏప్రిల్-డిసెంబర్ కాలంలో ప్రజా రవాణా వాహనాల అమ్మకాల్లో 2 శాతం మేర తగ్గుదల నమోదయిందని ఆటోమొబైల్ డీలర్స్ సంఘం (ఎఫ్ఏడీఏ) తెలిపింది. 1021 ఆర్టీఓల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం 19,17,750 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఏప్రిల్ కంటే ముందు సమయంలో అవి 19,65,630 యూనిట్లుగా ఉన్నాయని ఎఫ్ఏడీఏ తెలిపింది. ఎఫ్ఏడీఏ ప్రెసిడెంట్ ఆశిష్ హర్షరాజ్ మాట్లాడుతూ '2018 చివరి నాలుగు నెలలో ప్రజా రవాణా వాహనాల అమ్మకాలు 2 శాతం తగ్గాయి. కానీ 2018-19 ఆర్థిక సంవత్సరం ఆఖరి త్రైమాసికంలో అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నాము. పెట్రోల్, డీజిల్ ధరల తగ్గుదల అలాగే రవాణా పాలసీల్లో వచ్చిన మార్పులు ఆఖరి త్రైమాసానికి అమ్మకాలపై ప్రభావం చూపనున్నాయి. వినియోగదారులు వాహనాల కొనుగోలుపై సుముకంగానే ఉన్నారు అని అన్నారు.



ఈ ఏడాది వృద్ధి 7.2 శాతం: సీఎస్‌వో

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత్ 7.2 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) సోమవారం వెల్లడించింది. ఈ ఏడాది వ్యవసాయ రంగం, తయారీ రంగం నుంచి మంచి దన్ను లభించనున్న నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ గతేడాది కంటే మెరుగైన వృద్ధిని నమోదు చేయగలదని సీఎస్‌వో తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో దేశం 6.7 శాతం వృద్ధిని నమోదు చేసిన విషయం తెలిసిందే. 2015-16 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ 8.2 శాతంగాను, 2016-17లో 7.1 శాతంగాను నమోదు అయింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి ముందస్తు అంచనాలను వెల్లడిస్తూ దేశ వృద్ధి రేటు పెరుగుదలపై కొత్త అంచనాలను వెలువరించింది. వాస్తవ జీవీఏ గత ఏడాదితో పోలిస్తే 6.5 శాతం నుంచి 7 శాతానికి పెరిగే అవకాశం ఉందని సీఎస్‌వో తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, అడవులు, చేపల పంపకపు కార్యకలాపాల్లో వృద్ధి 3.4 శాతం నుంచి 3.8 శాతానికి పెరిగే అవకాశం ఉన్నట్టుగా సీఎస్‌వో అంచనా కట్టింది. ఇదే మాదిరిగా తయారీ రంగం కూడా గత ఏడాదితో పోలిస్తే 5.7 శాతం నుంచి 8.3 శాతానికి ఎగిసే అవకాశం ఉన్నట్టుగా తెలిపింది.

నైపుణ్యం కొరతతో రూ.1.97 లక్షల కోట్ల నష్టం

న్యూఢిల్లీ: మనదేశంలో నైపుణ్యత కొరత ఎక్కువగా ఉందని.. దీనిని తగ్గించే విధంగా తగిన చర్యలు చేపడితో భవిష్యత్తులో దేశ వృద్ధిరేటును భారీగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని యాక్సెంచర్ సంస్థ తాజా నివేదికలో తెలిపింది. రానున్న దశాబ్దపు కాలంలో ఇంటెలిజెంట్ టెక్నాల జీల్లో భారీగా పెట్టుబడులు రానున్నాయని.. ఈ నేపథ్యంలో దేశవృద్ధి రేటు మెరుగ్గా రాణించే అవకాశం ఉందని ఈ నివేదిక తెలిపింది. అయితే ఇందుకు తగ్గ నైపుణ్యత కలిగిన నిపుణుల కొరత ఏర్పడితే మాత్రం ఆర్థిక వ్యవస్థకు దాదాపు 1.97 లక్షల కోట్ల వరుకు దెబ్బపడే అవకాశం ఉందని ఈ నివేదిక విశ్లేషించింది. దేశ నైపుణ్యత పెంపు విప్లవంలో కృత్రిమ మేథస్సు, వర్చువ్ రియాల్టీ, బ్లాక్‌చైన్, వంటి టెక్నాలజీలు కీలక భూమికను పోషించనున్నాయని నివేదిక తెలిపింది. వేగంగా నైపుణ్యతను పెంచేందుకు, తిరిగి నైపుణ్యతను అదించేందుకు ఈ టెక్నాలజీలు విప్లవాత్మకంగా దోహదం చేయనున్నట్లుగా ఈ నివేదిక వెల్లడించింది. తక్కువ వ్యయంతో కొత్త టెక్నాలజీలను ప్రజలు సమర్థమంతంగా అందిపుచ్చు కోవడానికి ఇది ఎంతగానో దోహదం చేస్తుందని నివేదిక తెలిపింది. అనుభూతితో కూడిన ఆన్‌జాబ్ ట్రేనింగ్‌తో ప్రజలు ఎక్కువగా నెర్చుకుంటారని.. జీవితకాలం నైపుణ్యత పెంపు వల్లే ప్రజలు డిజిటల్ పరివర్తనను అందిపుచ్చుకొంటారని నివేదిక తెలిపింది.

ఇన్ఫోసిస్‌కు సీనియర్ ఎగ్జిక్యూటివ్ గుడ్‌బై



బెంగళూరు: దేశీయ రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ నుంచి మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైదొలిగారు. ఇన్ఫోసిస్ ఎనర్జీ, యుటిలిటీస్, రిసోర్సెస్ అండ్ సర్వీసెస్ యూనిట్ గ్లోబల్ హెడ్ సుదీప్ సింగ్ రాజీనామా చేశారు. దాదాపు రెండు దశాబ్దాలుగా కంపెనీలో పనిచేస్తున్న సుదీప్ తాజాగా తన బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. అయితే ఆయన రాజీనామాకు గల కారణాలపై స్పష్టత లేదు. మరోవైపు ఇన్ఫోసిస్ కూడా దీనిపై స్పందించలేదు. గతేడాది ఇన్ఫోసిస్ చాలా మంది కీలక ఉద్యోగులను కోల్పోయింది. సుదీప్ కంటే ముందు గతేడాది అక్టోబరులో ఇన్ఫీ కన్సల్టింగ్ గ్లోబల్ హెడ్ కెన్ టూంబ్స్ రాజీనామా చేశారు. అంతకు ముందు ఆగస్టులో కంపెనీలో కీలక ఎగ్జిక్యూటివ్ అయిన ఎండీ రంగనాథ్ కూడా సీఎఫ్‌వో పదవి నుంచి తప్పుకొన్నారు. గతేడాది జనవరిలో కంపెనీ యూరప్ కార్యకలాపాలకు హెడ్‌గా ఉన్న రాజేశ్ కృష్ణమూర్తి కూడా రాజీనామా చేశారు. ఇన్ఫీ హెల్త్‌కేర్‌కు హెడ్‌గా ఉన్న సంగీతా సింగ్, మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్ నితేశ్ బంగా కూడా గతేడాది కంపెనీ నుంచి వైదొలిగారు.

మాల్‌వేర్ అటాక్!

- 'వాట్సాప్ గోల్డ్' పేరిట మెసేజ్ వైరల్
- లింక్ పై క్లిక్ చేస్తే, ఫోన్ డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకే!



ముంబై: సైబర్ నేరస్థుల ఆగడాలు నయా పద్దతు లకు తెరతీస్తూ.. మాల్‌వేర్ వైరస్‌ల వ్యాప్తిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఫోన్ సంస్థల అధికారిక సం బర్ల నుంచి కాల్స్ చేయడం, తాజా అప్‌డేట్ వెర్షన్ అం టూ ఫోన్ డేటాను దొంగిలించడం ఇందులో భాగమే!

'వాట్సాప్ గోల్డ్' మళ్ళీ వచ్చింది

'ధనవంతుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన 'వాట్సాప్ గోల్డ్' వెర్షన్ లీక్ అయిం ది. మీకు కూడా ఆ సేవలు ఉచితంగా కావాలంటే, ఈ లింక్ పై క్లిక్ చేయండి' అంటూ 2016 సంవత్సరంలో 'వాట్సాప్ గోల్డ్' పేరిట వైరల్ అయిన మాల్‌వేర్ మెసేజ్‌లు ప్రస్తుతం మళ్ళీ చక్కర్లు కొడుతున్నాయి. ఐతే, మెసేజ్ సారాంశం మాత్రం మారింది. ఏదో యూజర్ కు మేలు చేస్తున్నట్టు, మరుసటి రోజు విడుదల కాబోతున్న మాల్‌వేర్ వీడియో నుంచి అలర్ట్ చేస్తున్నట్టు పేర్కొంటున్న ఈ భయంకరమైన వైరస్ మెసేజ్ ఇప్పుడు మళ్ళీ పంజా విసురుతోంది. 'వాట్సాప్ గోల్డ్' పేరుతో వచ్చే ఎటువంటి లింక్స్ పై క్లిక్ చేయొద్దని, సైబర్ నేరగాళ్లు సృష్టించిన ఈ వైరస్ ఫోన్ లో చేరితే, ఫోన్ లో నిక్షిప్తమైన వ్యక్తిగత వివరాలు, కాంటాక్ట్స్, బ్యాంక్ అకౌంట్, క్రెడిట్ కార్డు ఇలా ఫోన్ డేటా అంతా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్ళిపోయే ప్రమాదమున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అధికారిక నంబర్ నుంచే!

ఆపిల్ ఐఫోన్ ప్రమాదంబారిన పడటం ఉండదని, మాల్‌వేర్ ప్రభావితం సదరు మొబైల్ పై పనిచేయదని చాలా మంది భావిస్తారు. ఐతే, ఏకంగా ఆపిల్ అఫీషియల్ కస్టమర్ కేర్ ఫోన్ నంబర్ నుంచే వినియోగదారులకు వాయిస్ ఆధారిత మెసేజ్ లు, కాల్స్ వస్తుండటం ఇటీవల ఎక్కువవుతోంది. నిజంగా, అవి కంపెనీ నుంచి వచ్చే కాల్స్, మెసేజ్ లు ఐతే పర్వాలేదు. కానీ, వాటిని చేస్తున్నది సైబర్ నేరగాళ్ళని ఇటీవల తేలింది. వాయిస్ ఫిషింగ్ కాల్ వస్తూనే, కాల్ బ్యాక్ చేయమనే మెసేజ్ కూడా యూజర్ ఫోన్ లోకి వస్తోంది. సదరు నంబర్ కు కాల్ బ్యాక్ చేస్తే, యూజర్ల ఫోన్ డేటా నేరగాళ్ళ చేతుల్లోకి వెళ్తుంది. యూజర్ ఫోన్ డేటా దొంగిలించడంలో భాగంగానే ఈ వాయిస్ ఫిషింగ్ కు దుండ గులు పాల్పడుతున్నట్టు సైబర్ నిపుణులు చెబుతున్నారు. కాగా, గత సంవత్సరం వీవీఐపీ ఐఫోన్లే టార్గెట్ గా, ఓ మిస్టరీ మాల్‌వేర్ ఇండి యాపై అటాక్ చేసినట్టు సిస్కో టాలోస్ కమర్షియల్ థ్రెట్ ఇంటెలిజెన్స్ గ్రూప్ మాల్‌వేర్ రీసెర్చర్లు, అనాలిస్టులు పేర్కొనడం విదితమే!

డిజిటల్ లావాదేవీల పర్యవేక్షణకు కమిటీ :ఆర్‌బీఐ

ఛైర్మన్‌గా నందన్ నిలేకనీ



న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ దేశీయంగా డిజిటల్ లావా దేవీలను పర్యవేక్షించేందుకు హై లెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకనీని కమిటీ ఛైర్మన్‌గా నియమించింది. కమిటీలో మాజీ ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ హెచ్‌ఆర్ ఖాన్, మాజీ విజయా బ్యాంకు ఎండీ కిషోర్ సన్సీ, సమాచార మంత్రిత్వ శాఖ మాజీ సెక్రటరీ అరుణా శర్మ, ఐఐఎం అహ్మదాబాద్ ఇన్నోవేషన్ ఛీఫ్ సంజైయ్ జైన్ ఉన్నారు. ఈ కమిటీ ప్రస్తుత డిజిటలైజేషన్‌పై సమీక్ష చేస్తుంది. లోపాలపై విచారణ జరిపి, సరిచేసేందుకు సమగ్ర మార్గాలను సూచిస్తుంది. అలాగే విదేశాల్లో అమలైయే డిజిటలైజేషన్ మార్గాలపై సమీక్షించి ఉత్తమ పథకాలను భారత్‌లో అమలు పరిచేలా చూస్తుంది. డిజిటల్ చెల్లింపులు సురక్షితంగా జరిగేలా.. సైబర్ నేరాలు అరికంటేందుకూ ఈ కమిటీ పనిచేస్తుందని ఆర్‌బీఐ ఓ ప్రకటనలో తెలిపింది.

దూడల పెంపకం.. లాభసాటి వ్యాపకం

దూడల పెంపకంతో అనతికాలంలోనే పాడి రైతు నాలుగింతలు ఆదాయం సంపాదించుకోవచ్చు. పశువుల పెంపకంలో ఆవులు, గేదెలతోపాటు లేగ దూడల పెంపకం పాడి రైతులకు ఎంతో లాభదాయకం. నాణ్యమైన దాణా అందిస్తూ క్రమం తప్పకుండా రోగ నిరోధక టీకాలు వేయిస్తే మేలు జాతి దూడలను అభివృద్ధి చేసుకోవచ్చు. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. దూడలకు సోకే వ్యాధులు, నివారణ చర్యలపై పశు సంవర్ధక నిపుణులు ఇస్తున్న సలహాలు ఈవిధంగా ఉన్నాయి.





అజీర్తితో తెల్ల విరోచనాలు

- మోతాదుకు మించి పాలు తాగించడం వలన అజీర్తి చేసిన దూడలు తెల్లగా పారతాయి.
- సూక్ష్మజీవులు, నట్టల వలన కూడా దూడల్లో విరేచనాలు అవుతాయి. ఈ సమయంలో పాల మోతాదును తగ్గించాలి.
- గ్లూకోజ్, ఉప్పు, నీరు కలిపిన మిశ్రమాన్ని తాగించి, ఆ తరువాత పశు వైద్యులను సంప్రదించాలి.

రక్షణ లేకపోతే న్యుమోనియా..

- దూడలకు రాత్రి సమయంలో సరైన రక్షణ లేక తగిలే గాలుల వలన న్యుమోనియా వస్తుంది.
- అలాంటి గాలులు తగలకుండా వాటికి గృహవసతి కల్పించాలి.
- ఈ వ్యాధి వచ్చిన దూడల్లో జ్వరం వస్తుంది.
- శ్వాస పీల్చడం కష్టమవుతుంది.
- వ్యాధి ముదిరితే చనిపోయే అవకాశం ఉంది.
- వ్యాధి వచ్చిందని తెలిస్తే వెంటనే పశు వైద్యుడిని సంప్రదించి, చికిత్స చేయించాలి.

పరిశుభ్రత లోపిస్తే బొడ్డు వ్యాధి

- దూడ పుట్టినపుడు దాని బొడ్డును శుభ్రమైన బ్లేడు లేదా కత్తెరతో రెండు అంగుళాల పొడవు ఉంచి కత్తిరించి, టింక్చర్ అయోడిన్ అద్దాలి.
- అలా చేయకపోతే సూక్ష్మజీవులు ప్రవేశించి, బొడ్డు వాపు కలిగే ప్రమాదం ఉంది.
- బొడ్డు వాపు వ్యాధి వచ్చినపుడు ఏ మాత్రం అలక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలి.

వైద్యంతో మలబద్ధకానికి చెక్

- దూడల్లో మలబద్ధకం సాధారణంగా కనిపిస్తుంది.
- దూడలకు జున్నుపాలు తాగిన మేరకు తాగిస్తే ఈ సమస్య ఉత్పన్నం కాదు.
- దూడ తాగే పాలలో కొడిగుడ్డు సొన, ఇంగువ, బెల్లం కలిపి రెండురోజులపాటు తాగిస్తే మలబద్ధకం తగ్గుముఖం పడుతుంది. లేదా ఎనిమా ఇప్పించాలి.

నట్టలతో ఎదుగుదలకు అవరోధం

- నట్టల వ్యాధి సోకితే దూడను ఎదగనివ్వదు.
- దూడల్లో ఈ వ్యాధి సాధారణమే.
- దూడల్లో ఈ వ్యాధి ఉంటే తరచూ విరేచనాలు అవుతాయి.
- వెంట్రుకలు బిరుసుగా ఉంటాయి.
- కడుపు కిందకు జారి ఉంటుంది.
- దవడల మధ్య నీరు చేరుతుంది.
- దూడలకు సకాలంలో నట్టల నివారణ మందులు తాగించాలి.
- 8-10 రోజుల వయసులో మొదటి, ఆ తరువాత నెలకు ఒకసారి చొప్పున నాలుగు నెలల వరకూ క్రమం తప్పకుండా మందులు తాగించాలి.

కాక్సిడియోసిస్‌తో రక్త విరేచనాలు

- ఈ వ్యాధి సోకడం వల్ల దూడలు రక్త విరేచనాలతో బాధపడతాయి.
- 15 రోజులకు ఒకసారి పశువులు కొట్టంలో సున్నం చల్లితే కాక్సిడియాసిస్ వ్యాధి రాకుండా నివారించవచ్చు.

వ్యాధి నిరోధక టీకాల షెడ్యూల్ ఇదే...

- గొంతువాపు నిర్మూలనకు 5వ నెలలో, రెండోసారి ఏడాదికి ఒకసారి మే, జూన్ నెలల్లో టీకాలు వేయించాలి.
- జబ్బ వాపు నివారణకు 7వ నెలలో, రెండోసారి ఏడాదికి ఒకసారి మే, జూన్ నెలల్లో వేయించడం ఉత్తమం.
- రొమ్ము రోగానికి 6వ నెలలో, రెండోసారి ఏడాదికి ఒకసారి ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వేయించాలి.
- ఈసుడు రోగానికి 4-6 నెలల్లో, రెండోసారి ఏడాదికి ఒకసారి ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వేయించాలి.
- థైలేరియాసిస్‌కు 4 నెలల తరువాత, రెండోసారి ఏడాదికి ఒకసారి ఎప్పుడైనా వేయించవచ్చు.
- గాలికుంటుకు 2 నెలల వయసులో, రెండోసారి ఏడాదికి ఒకసారి మార్చి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వేయించడం ఉత్తమం.

దూడలకు మరిన్ని సమస్యలు

- గేదె దూడలకు మేడు నెలలు దాటిన తరువాత నెలకోసారి ఏడాది వరకూ దాని శరీరంపై వెంట్రుకలు కత్తిరించి పేలు, గోమార్లు రాకుండా కాపాడుకోవాలి.
- దూడలకు 6-8 వారాల వయసులో మొదటిసారి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి.
- దూడలకు ఆరు నెలల వయసులో జబ్బ వాపు, గొంతు వాపు, బ్రూసెల్లోసిస్ వంటి అంటువ్యాధులు ప్రబలకుండా టీకాలు వేయించాలి.


పుట్ట గొడుగులతో ప్రయోజనాలెన్నో...

- తయారీ చాలా సులువు
- పీచుపదార్థం ఎక్కువ, కొవ్వు పదార్థం తక్కువ

పుట్టగొడుగుల్లో వేలాది రకాలు ఉన్నా వీటిలో 200 రకాలు మాత్రమే తినటానికి ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా మూడు రకాల పుట్టగొడుగులను కృత్రిమంగా పెంచుతున్నారు. వీటిలో పాలపుట్టగొడుగుల పెంపకాన్ని విరివిగా చేపడుతున్నారు. వీటి పెంపకంతో ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని రైతుశిక్షణా కేంద్రం విజయవాడ ఏడిఏ రత్నశ్రీ తెలియజేశారు. పుట్టగొడుగుల్లో మాంసకృతులు, విటమిన్‌లు (బి, సి) ఖనిజ లవణాలు, పీచుపదార్థం అధికంగావుండి కొవ్వు, పిండి పదార్థాలు తక్కువ మోతాదులో ఉంటాయి.

పాల పుట్టగొడుగులు ..

పాలపుట్ట గొడుగులు ముచ్చపు చిప్ప పుట్టగొడుగుల పెంపకాన్ని పోలివుంటాయి. వీటి పెంపకానికి 30 - 35 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, 85 నుంచి 95 శాతం తగిన వెలుతురు అవసరం, వాతా వరణ పరిస్థితులకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటే ఏడాదంతా వీటి పెంపకం చేపట్టవచ్చు



పెంపకంలో కావాల్సినవి..

చీకటి గది, వెలుతురు గది, వరిగడ్డి, స్పాన్ (పుట్టగొడుగుల విత్తనం) పార్మల్డిహైడ్ ద్రావణం, బావిష్టన్ పౌడర్, కవర్స్(12+18) లేదా (14+24) రబ్బరు బ్యాండ్స్, నల్లరేగడి మట్టి, లేదా ఎర్రమట్టి, చాల్క్ పౌడర్.

సాగు చేసే విధానం..

వీటిని పెంచటానికి ముందుగా వరిగడ్డిని 3 - 5 సెంటీ మీటర్లు ముక్కలుగా కత్తిరించుకోవాలి, అనంతరం గడ్డి ముక్కలను 12 గంటలు నీటిలో ముంచి నానబెట్టాలి, మరుసటి రోజు బాగా మరుగుతున్న వేడి నీటి ద్వారా లేదా రసాయన పద్ధతిలో పార్మలిన్ లీటర్‌కి 2.5 మిల్లీలీటర్ల నీటిలో కలిపి శుద్ధిచేసుకోవాలి, గడ్డిని బయటికి తీసి 1 - 2 గంటల సేపు ఆరనివ్వాలి. అరగంటకు ఒకసారి గడ్డిని తిరగేస్తూ 70 శాతం గడ్డి ఆరిపోయే వరకు ఎండలో ఆరబెట్టాలి. ఇలా తయారు చేసిన గడ్డిని బెడ్ల తయారీకి ఉపయోగించుకోవాలి. స్వచ్ఛమైన తెల్లని స్పాన్‌ని శుద్ధిచేసిన ట్రైలో గడ్డలు లేకుండా చూసుకోవాలి, తరువాత పాలిథిన్ సంచులు 12 + 18 లేదా 14 + 24 అంగుళాల సైజు కవర్లను తీసుకొని 15 నుంచి 20 వరకు రంధ్రాలు చెయ్యాలి. పాలిథిన్ సంచిలో శుద్ధిచేసిన వరిగడ్డి ముక్కలను 5 సెంటీ మీటర్ల మందాన వేసి విత్తనాన్ని అంచుల వెంట గడ్డి ముక్కల ఉపరితలంపై వెదజల్లాలి. ఇలా తయారు చేసుకున్న బెడ్లను చీకటి గదిలో ఉంచాలి. తేమ 85 నుంచి 90 శాతం, ఉష్ణోగ్రత 30 నుంచి 35 డిగ్రీల సెంటీగ్రేడ్ గాలి సరఫరా ఉండాలి. 30 రోజుల పాటు చీకటి గదిలో ఉంచాలి. తేమ తరువాత సిలీంద్రపు బూజు దట్టంగా వ్యాపిస్తుంది, పాలపుట్టగొడుల బెడ్లను 31వ రోజున 2 భాగాలుగా కోసి బెడ్ల మధ్యలో కేసింగ్ చెయ్యాలి. కేసింగ్ మట్టిని వారం ముందు రసాయనాలు లేదా ప్రెషర్ కుక్కర్‌లో ఒక రోజు ముందుగా శుద్ధిచేసి, బెడ్‌పై వాడాలి, వాడేముందు మట్టికి 20 గ్రాముల కాల్షియం, కార్బోనెట్ కలపాలి. బెడ్స్ కేసింగ్ చేసిన 24 గంటల నుంచి ప్రతిరోజు వాటరింగ్ చెయ్యాలి. బెడ్‌లపై మట్టి ఎప్పుడూ తేమగా, చల్లగావుండే విధంగా నీళ్లు పొయ్యాలి. ఇలా చేసిన బెడ్ల నుంచి 15 రోజుల్లో చిన్నచిన్న మొలకలు వస్తాయి. పుట్టగొడుగుల సైజు 6 - 10 సెంటీమీటర్లు దయామీటర్ పెరిగినప్పుడు కోసి మార్కెటింగ్ చెయ్యాలి. పుట్టగొడుగులు కోసుకున్న తరువాత బెడ్‌లను కంపోస్టు గుంటలో వేసి పంట పొలాలకు ఎరువుగా ఉపయోగించుకోవచ్చు.

తోట ప్రసాద్- నందిగామ

విశాలాంధ్ర సినిమా



తమన్నాను బీటౌట్ చేసిన కాజల్!



ఒకే సినిమాను రెండు వేరు వేరు భాషల్లో రీమేక్ చేస్తుంటే.. లెక్కప్రకారం ఒరిజినల్‌లో ఉన్న క్రేజీ సీన్స్‌ను రెండు రీమేక్స్ లోనూ తెరకెక్కించాలి. అయితే బాలీవుడ్ 'క్వీన్' తెలుగు, తమిళ రీమేక్స్ విషయంలో దానికి భిన్నంగా జరిగింది. తమన్నా నటించిన 'క్వీన్' తెలుగు రీమేక్ 'దటీజ్ మహాలక్ష్మి', కాజల్ నటించిన తమిళ రీమేక్ 'ప్యారిస్ ప్యారిస్' టీజర్లు విడుదలయ్యాయి. అయితే వీటిలో తమిళ సినిమా 'ప్యారిస్ ప్యారిస్' టీజర్‌కే ఎక్కువ మార్కులు పడడం విశేషం.

ఒరిజినల్‌లో ఉన్న ఒక క్రేజీ సీన్.. తెలుగు రీమేక్‌లో మిస్ అవడమే దీనికి కారణం. తమిళ క్వీన్ రీమేక్ 'ప్యారిస్ ప్యారిస్' చిత్రం టీజర్‌లో కాజల్ బ్రెస్ట్‌ను మరో నటి ఎల్లి అవ్రామ్ చిలిపిగా టచ్ చేయడం అందరినీ ఆశ్చర్యప రిచింది. ఈ సీన్ అసభ్యంగా ఉందని కొంతమంది జనాలు మొత్తుకు న్నారు, కానీ ఇలాంటి విమర్శ లతో సంబంధం లేకుండా టీజర్‌కు భారీ రెస్పాన్స్ వచ్చింది. ఒరిజినల్ సినిమాలో ఉన్న సీన్‌నే మేము చిత్రీకరించాము గానీ, సెన్సేషన్ క్రియేట్ చెయ్యాలనే ఆలోచన మాకు లేదు అంటూ చిత్ర దర్శకుడు రమేశ్ అరవింద్ క్లారిటీ ఇచ్చాడు. కానీ తెలుగు రీమేక్‌లో ఎందుకో ఆ సీన్ చిత్రీకరించలేదు. నిజానికి తెలుగులో కూడా ఆ సీన్‌ను చిత్రీరిద్దామని దర్శకుడు ప్రశాంత్ వర్మ చెప్పినా.. కథానాయిక తమన్నా దానికి ససేమిరా అందట. ఆ సీన్ మరీ వల్గర్‌గా ఉండడం తనకు నచ్చలేదని తమన్నా చెప్పడంతో దర్శకుడు ఆమెను ఒత్తిడి చేయలేదట. దాంతో ఆ సీన్ 'దటీజ్ మహాలక్ష్మి' టీజర్‌లో లేకుండా పోయింది. ఆ కారణంగానే తెలుగు టీజర్ కంటే తమిళ టీజర్‌కు స్పందన ఎక్కువగా ఉంది. ఆ సినిమా విడుదలకు ఇంకా టైమ్ ఉంది కాబట్టి మనసు మార్చుకొని ఆ సీన్‌ను పెడతారా లేదంటే ఆ సీన్ లేకుండానే సినిమాను రిలీజ్ చేస్తారా అనేది వేచి చూడాలి.

మెగా అభిమానులకు శుభవార్త..



సంక్రాంతి కానుకగా విడుదల కాబోతున్న 'వినయ విధేయ రామ' చిత్రానికి అదనపు షోస్ వేసుకోవటానికి అనుమతినిస్తూ మెగా అభిమానులకు శుభవార్త చెప్పింది ఏపీ ప్రభుత్వం. జనవరి 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఉదయం 5గంటల నుండి 11గంటల వరకు స్పెషల్ షోస్ వేసుకోవచ్చని తెలుపుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు మెగా ఫ్యాన్స్. జనవరి 11న భారీ అంచనాల నడుమ 'వినయ విధేయ రామ' విడుదల కానుంది. మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను, మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ క్రేజీ కాంబోలో ఈ సినిమా రూపొందటంతో రిలీజ్‌కి ముందే సినిమాపై భారీ హైప్ నెలకొంది. చిత్రంలో చెర్రీ సరసన కియారా అద్వాని నటించగా.. వివేక్ ఒబెరాయ్ ప్రతినాయకుడి పాత్ర పోషించారు. ప్రశాంత్, స్నేహ, ఆర్యన్ రాజేష్ తదితరులు కీలకపాత్రల్లో నటించారు.

ముద్దుల విషయంలో లెక్కే వేరంట !



ముద్దంటే చేదా? నీకా ఉద్దేశం లేదా? అంటూ ఏ బాలీవుడ్ హీరోయిన్ అయినా సల్మాన్ ఖాన్‌ను అడిగితే.. అసలు నాకా ఉద్దేశమే లేదంటూండడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. అసలు కిస్సింగ్ కల్చర్‌ను పెంచి పోషించిందే బాలీవుడ్. అలాంటి బాలీవుడ్‌లో సల్మాన్ ఖాన్ లాంటి క్రేజీ హీరో ఆడ్ మ్యాన్ ఔట్‌గా నిలచిపోవడం పెద్ద వండర్ అంటున్నారు బీ టౌన్ జనం. అసలు సల్మాన్ ఖాన్ కిస్సుల విషయంలోనే ప్రత్యేకించి ప్రవరాఖ్యునిలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడని చర్చించుకుంటున్నారు. బాలీవుడ్‌లో దాదాపుగా అందరు స్టార్ హీరోలూ కనిపించే ప్రతీ హీరోయిన్ అధరా మ ృతాన్ని గ్రోలడంలో బిజీగా ఉంటే, సల్మాన్ ఎందుకు వాటికి దూరంగా ఉంటున్నాడన్నదే ఇప్పుడు అందరి ప్రశ్న. అయితే బాలీవుడ్‌లో ఒక టాక్ ఏంటంటే అగ్రిమెంట్ లోనే కిస్సులకు తనను బలవంతం చేయకూడదని ఒక క్లాజు పెడతాడట సల్లూ భాయి. తన సినిమాలు అన్ని వయసుల వారు చూస్తారని.. కిస్ సీన్లకు అందుకే దూరంగా ఉంటానని సల్మాన్ ఖాన్ దాని వెనుక గల అసలు కారణాన్ని రివీల్ చేయడం విశేషం. బాలీవుడ్ ఖాన్ త్రయంలో క్రేజీయెస్ట్ హీరో అయిన సల్మాన్ ఖాన్, ఎంతోమంది బాలీవుడ్ గాళ్స్‌తో ప్రేమ వ్యవహారాల్ని నడిపాడు. వాళ్ళకి బ్రేకప్పూ చెప్పాడు. అలాంటి ఆ బ్యాచ్‌లర్ బాబు.. ముద్దుల విషయంలో తన లెక్కే వేరంటుండటం విచిత్ర మనిపించక మానదు. బహుశా.. ఒక టీవీ షో లో సల్మాన్ ఖాన్ తమ్ముడు అర్బాజ్ ఖాన్ చెప్పినట్టు.. సల్మాన్ ఆఫ్ స్క్రీన్‌లో పలువురి కథానాయికలకి ముద్దులు పెట్టి పెట్టీ.. ఆన్ స్క్రీన్‌లో పెట్టడానికి బోర్ ఫీల్ అవుతున్నాడేమో! దానికి సమాధానం సల్లూ భాయే చెప్పాలి.

ధనుష్‌ను మించిన సాయిపల్లవి..!



కోలీవుడ్ చిత్రపరిశ్రమలో యూట్యూబ్ బాగా చొచ్చుకు పోయేలా హీరో ధనుష్ పాట చేసింది. యువ సంగీత దర్శకుడు అనిరుధ్ సంగీత బృందం సారథ్యంలో వచ్చిన 'వై దిస్ కొలవరి' అనే పాట ఒకే రోజులో యూట్యూబ్ సంచలనంగా (ట్రెండింగ్) మారింది. దీంతో ఒకే రోజులో అత్యధిక సంఖ్యలో నెటిజన్లు చూసిన (వ్యూస్) పాటగా ఇది చరిత్రపుటలకెక్కింది. ఆ తర్వాతే కోలీవుడ్ చిత్రపరిశ్రమ యూట్యూబ్‌లో తమ చిత్రాలు, పాటలు, ఇతర కార్యక్రమాల గురించి ప్రమోషన్ చేసుకోవడం ప్రారంభించారు. అలా యూట్యూబ్‌లో ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్న ధనుష్ పాటను ఇపుడు హీరోయిన్ సాయిపల్లవి అధిగమించారు. తెలుగులో సాయి పల్లవి హీరోయిన్‌గా, మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన చిత్రం 'ఫిదా'. ఇందులోని 'హే పిల్లా' పాట యూట్యూబ్‌లో సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఈ పాటను ఏకంగా 17.37 కోట్ల మంది నెటజిన్లు వీక్షించారు. దీంతో ఈ పాట మొదటి స్థానంలో నిలువగా, 'వై దిస్ కొలవరి' సాంగ్ 17.26 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఇకపోతే, సాయిపల్లవి, ధనుష్ కలిసి నటించిన చిత్రం 'మారి-2'. ఈ చిత్రంలోని 'రౌడీ బేబీ' పాట కేవలం నాలుగు రోజుల్లోనే 2.50 కోట్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఇలా వీరిద్దరూ కూడా కలిసి సరికొత్త రికార్డును నెలకొల్పారు.

ప్రతి సినిమా నాకు కూతురులాంటిది

పెళ్లికి ఖర్చు చేసినప్పుడు.. సినిమాకు ఎందుకు చేయకూడదు



ప్రతి సినిమా తనకు కూతురులాంటిదని అంటున్నారు బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుక్ ఖాన్. ఆయన నటించిన 'జీరో' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ఈ విషయం గురించి షారుక్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'నేను సాధించలేనేమో అనుకున్న విషయాల్లో విజయం సాధించేశాను. మన జీవితాలకు మనమే రాజు అనుకున్నప్పుడు మనకు నచ్చింది చేసుకుంటూపోవాలి. ప్రతి సినిమా నాకు కూతురితో సమానం. కూతురి పెళ్లిళ్లను ఎంతో ఖర్చుపెట్టి ఘనంగా చేస్తారు. అలాంటప్పుడు సినిమాలకు ఎందుకు ఖర్చుచేయకూడదు.' అని వెల్లడించారు షారుక్. ఆనంద్ ఎల్ రాయ్ 'జీరో' చిత్రానికి దర్శకత్వం వహించారు. అనుష్క శర్మ, కత్రినా కైఫ్ కథానాయికలుగా నటించారు. డిసెంబర్ 21న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ ఫలితాలు అందుకున్నట్లు సినీ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ వెల్లడించారు. దాంతో షారుక్ ప్రముఖ వ్యోమగామి రాకేశ్ శర్మ బయోపిక్ చిత్రీకరణను రెండు నెలల ముందే మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నారట. ఈ సినిమాకు 'సెల్యూట్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు.

అయినా 100 కోట్ల లాభం



భారీ క్రేజ్‌తో రూపొందే మల్టీ స్టారర్స్‌కు ఉండే సౌలభ్యం దేనికి ఉండవు. ముఖ్యంగా డిజిటల్ విప్లవం మొదలయ్యాక నిర్మాతల ఆదాయ వనరులు అమాంతం పెరిగిపోయాయి. ఒక్క అమెజాన్ ప్రైమ్ వచ్చాక ఎన్ని విప్లవాత్మక మార్పులు వచ్చాయో చూస్తూనే ఉన్నాం. ఇక ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేసే సౌలభ్యం వల్ల నష్టపోయే అవకాశాలు కూడా తగ్గిపోతున్నాయి. తాజాగా తగ్స్ అఫ్ హిందూస్తాన్ దీనికి ఉదాహరణగా నిలుస్తోంది. ఈ ఏడాది వచ్చిన అత్యంత దారుణమైన డిజాస్టర్స్ లో ఫస్ట్ ర్యాంక్ కోసం పోటీ పడిన ఈ అమితాబ్ అమీర్ ఖాన్ల మల్టీ స్టార్ బాక్స్ ఆఫీస్ దగ్గర తుస్సుమన్న సంగతి తెలిసిందే. విషయానికి వస్తే దీనికైన బడ్జెట్ సుమారు 240 కోట్లు. కాంబో మీద క్రేజ్ వల్ల ప్రపంచవ్యాప్తంగా ఫైనల్ రన్ లో 100 కోట్ల దాకా తెచ్చింది. ఇది షేర్ రూపంలో వచ్చింది. ఇక రిలీజ్‌కు ముందున్న హైప్ వల్ల శాటిలైట్ డిజిటల్ హక్కుల ద్వారా మరో 140 కోట్లు వచ్చాయి. మల్టీ లాంగ్వేజ్ రిలీజ్ ఇక్కడ పెద్ద ప్లస్ అయ్యింది. అంటే మొత్తం పెట్టుబడి ఈ రెండు మార్గాల్లోనే వచ్చింది. కథ ఇక్కడితో అయిపోలేదు. మ్యూజిక్ ఆడియో వీడియో రైట్స్ కు మరో 15 కోట్లు ముందే వచ్చి పడ్డాయి. ఇటీవలే చైనాలో విడుదల చేసారు. అమీర్ ఉన్నాడు కాబట్టి మంచి ధరకు సేల్ అయ్యింది. దాన్నుంచి మరో 110 కోట్లు తోడయ్యాయి. అంటే మొత్తంగా పెట్టుబడిని మైనస్ చేసుకుని చూసుకున్నా 125 కోట్ల రూపాయలు లాభం వచ్చిందన్న మాట. మరి నష్టపోయింది ఎవరు అనే డౌట్ రావొచ్చు. డిస్ట్రిబ్యూటర్లే అందులో అనుమానం అక్కర్లేదు. నిర్మాత మాత్రం భారీ ఎత్తున సేఫ్ అయ్యాడు. కాకపోతే చెత్త సినిమా అంటే ట్యాగ్ వచ్చింది. అయితేనెం ఇది వ్యాపారం. సినిమా తీసాక లాభం వచ్చిందా లేదా అనేదే ముఖ్యం. సో తగ్స్ అఫ్ హిందూస్తాన్ నిర్మాత యాంగిల్ లో పాస్ అయినట్టే

లోక్‌సభలో డీఎన్‌ఏ బిల్లు ఆమోదం

న్యూఢిల్లీ : నేరస్తులు, అనుమానితులు, బాధితులు, కొన్ని వర్గాల వ్యక్తులను గుర్తించేందుకు ఉపయోగించే డీఎన్‌ఏ టెక్నాలజీ క్రమబద్ధీకరణ బిల్లు 2018కు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. తల్లిదండ్రుల గుర్తింపు, వివాదాలు, వలసలు, నిందితుల గుర్తింపునకు డీఎన్‌ఏ దోహదపడుతుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. డీఎన్‌ఏ బిల్లు దుర్వినియోగం అవుతుందన్న విపక్షాల ఆందోళనపై మంత్రి సమాధానమిస్తూ, దుర్వినియోగం అనేది ఎక్కడైనా ఉంటుందని వ్యాఖ్యానించారు. జాతీయస్థాయిలో డీఎన్‌ఏ డేటా బ్యాంక్, ప్రాంతీయ డీఎన్‌ఏ డేటా బ్యాంక్‌ను ఏర్పాటు చేసేందుకే బిల్లును తెచ్చామన్నారు. వీటిలో నిందితులు, నేరస్తుల వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు.



అనుపమ్‌ఖేర్, అక్షయ్‌సహా 15 మందిపై ఎఫ్‌ఐఆర్

ముజఫర్‌పూర్ సబ్ డివిజనల్ జడ్జి కోర్టు తీర్పు

ముజఫర్‌పూర్ (బీహార్) : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పదవీకాలం ఆధారంగా 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' సినిమా నిర్మాత, దర్శకుడుసహా బాలీవుడ్ నటులు అనుపమ్‌ఖేర్, అక్షయ్‌కన్నా తదితర 15 మందిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ముజఫర్‌పూర్ తూర్పు సబ్ డివిజన్ జడ్జి కోర్టు తీర్పునిచ్చింది. మన్మోహన్‌సింగ్‌తోపాటు ప్రముఖులను చెడ్డవారీగా చిత్రీకరిస్తూ సినిమా తీయటాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది సుధీర్‌కుమార్ ఓఝా బీహార్‌లోని ముజఫర్‌పూర్ తూర్పు సబ్ డివిజన్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను మంగళవారం విచారణకు స్వీకరించిన జడ్జి గౌరబ్ కుమార్ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని కంటి పోలీసు అధికారులను ఆదేశించారు. ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ సినిమాలో అనుపమ్‌ఖేర్ మన్మోహన్‌సింగ్ పాత్రను, అక్షయ్ ఖన్నా మీడియా సలహాదారు సంజయ్ బారూ పాత్రలను పోషించారని న్యాయవాది తన పిటిషన్‌లో పేర్కొన్నారు. సినిమాలో యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, అప్పటి పార్టీ ప్రధాన కార్యదర్శి రాహుల్‌గాంధీ, మాజీ పీఎం అటల్ బీహారి వాజ్‌పేయి, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ, ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ పాత్రధారులపైనా పిటిషన్ వేయగా, ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది.

ఆగ్రహజ్వాల





పశ్చిమ బెంగాల్‌లో





ఒడిశాలో రైల్ రోకో

న్యూఢిల్లీ : కార్మిక సంఘాల చట్టానికి తూట్లు పొడుస్తున్న కేంద్రంలోని మోడీ సర్కారును గద్దె దించే లక్ష్యంతో... దేశ వ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులు రెండు రోజుల సమ్మెకు నడుము బిగించారు. దేశ వ్యాప్తంగా వామపక్ష పార్టీల నేతృత్వంలో పది ప్రధాన కార్మిక సంఘాలు ఈ సమ్మెలో పాల్గొన్నాయి. అసోం, మేఘాలయ, కర్ణాటక, మణిపూర్, బీహార్, రాజస్థాన్, గోవా, పంజాబ్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, హర్యానా, తమిళనాడు, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో బంద్ తీవ్ర ప్రభావం చూపింది. ముఖ్యంగా పారిశ్రామిక వాడల్లో జనజీవనం స్తంభించినట్టు ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ తెలిపారు. కార్మికుల సమ్మెలో కర్షకులూ పాల్గొన్నారు. ఆలిండియా కిసాన్ సభ, హనన్ ముల్లా, భూమి అధికార్ ఆందోళన్ భారత్ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజన్ మాట్లాడుతూ, రైతులు గ్రామీణ్ హర్తాళ్‌లో పాల్గొన్నారని వివరించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో భారత్ బంద్ ప్రభావం ఇలా ఉంది. ఒడిశాలో రైళ్లు, బస్సుల రవాణాపై బంద్ తీవ్ర ప్రభావం చూపింది. భువనేశ్వర్, కటక్, పూరీ, బాలాసోర్, జాలేశ్వర్, బద్రాక్, శంభల్‌పూర్, బర్హంపూర్, పరదీప్‌ల్లో కార్మిక సంఘాలు రైల్‌రోకో చేశాయి. సుమారు 12 రైళ్ల రాకపోకల్లో తీవ్ర అంతరాయం కలిగింది. వేలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా దుకాణాలు, వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు మూతపడ్డాయి. కేరళలో జనజీవనం స్తంభించింది. కేరళ రోడ్డు రవాణ సంస్థ కార్మికులు సమ్మెలో పాల్గొనటంతో... ఒక్క బస్సు రోడ్డు మీదకు రాలేదు. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. బ్యాంకుల్లో లావాదేవీలు స్తంభించాయి. కోజికోడ్, కొచ్చి, తిరువనంతపురంలో బంద్ ప్రభావం పడింది. శబరిమల భక్తుల కోసం నీలక్కల్ -పంప-నీలక్కల్ రూట్లో మినహా రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా కేఎస్‌ఆర్టీసీ బస్సులు నడవలేదు. ఆటో కార్మికులూ సమ్మెలో పాల్గొన్నారు. తిరువనంతపురం సెంట్రల్, ఎర్నాకులం, కోజీఖోడ్ రైల్వే స్టేషన్లలో ఆందోళనకారులు రైల్ రోకో చేశారు. వెనాడ్ ఎక్స్‌ప్రెస్‌ను దాదాపు అరగంట పాటు అడ్డుకున్నారు. దీంతో ఆందోళన కారులపై పోలీసులు బలప్రయోగం చేశారు. దాదాపు 12 రైళ్లు అరగంట పైగా ఆలస్యంగా నడిచాయి. మహారాష్ట్ర ప్రభుత్వం మెస్మా ప్రయోగించినప్పటికీ బృహన్ ముంబై ఎలక్ట్రిసిటీ సప్లయ్ (బెస్ట్)కు చెందిన 32,000 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. 2,259 కండక్టర్లలో ఒకరు, 2,200 డ్రైవర్లలో ఎనిమిది మంది మినహా ఎవ్వరూ విధులకు హాజరు కాలేదు. మొత్తం 27 డిపోల్లో బస్సులు నిలిచిపోయాయి. సుమారు పాతిక లక్షల మంది ముంబై వాసులపై ఈ సమ్మె తీవ్రప్రభావం చూపింది. దీంతో లోకల్ రైళ్లను ఆశ్రయించారు. ఇక ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పలు ప్రాంతాల్లో వాణిజ్యసంస్థలు మూతపడ్డాయి. మహారాష్ట్రలో రైతు సంఘాలు బంద్‌లో పాల్గొన్నాయి. కర్ణాటకలోనూ కార్మిక సంఘాల సమ్మె తీవ్ర ప్రభావం చూపింది. బెంగళూరు, మంగళూరు, ఉడిపిలో జనజీ వనం స్తంభించింది. బెంగళూరులో విద్యాసంస్థలు, వ్యాపార సంస్తలు, సినిమా థియేటర్లు, హోటళ్లు మూసివే శారు. బీఎంటీసీ బస్సులు నిలిచిపోయాయి. బస్సులను నడిపేందుకు బీఎంటీసీ ప్రయత్నించగా పలు ప్రాంతాల్లో కార్మికులు, ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. మరీ ముఖ్యంగా మల్లేశ్వరం రూట్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొనటంతో బస్సులను నిలిపివేశారు. దీంతో 1196 సర్వీసుల్లో కేవలం 407 సర్వీసులు రోడ్డు మీదకు వచ్చినా... ఆ తరువాత నిలిపి వేశారు. దక్షిణ కర్ణాటకలోని మంగళూరులో సమ్మె ప్రభావం తీవ్రంగాచూపింది. పాఠశాలలు, స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. సెంట్రల్ మార్కెట్, ఫిషింగ్ హార్బర్‌లో కార్మికులు ధర్నా చేశారు. ఉడిపిలో జనజీవనం స్తంభించింది. సిటీ బస్సు స్టేషన్ నుంచి ఒక్క బస్సూ కదలలేదు.

పశ్చిమ బెంగాల్‌లో ఉద్రిక్తత

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకించినా... సీపీఐ, సీపీఎం తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బంద్ విజయవంత మైంది. జనజీవనం స్తంభించింది. భారీ స్థాయిలో పోలీసులు మోహరించి సమ్మెను భగ్నం చేయటానికి ప్రయత్నించటంతో పశ్చిమ బెంగాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హౌరా రైల్వే స్టేషన్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ సహా 10 కార్మికసంఘాలు రైల్‌రోకో నిర్వహించాయి. కోల్‌కతాలో బంద్‌లో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నార్త్ 24 పరగణాస్ జిల్లాలోని బరాసత్‌కు సమీపంలోని చంపడాలిలో స్కూలు బస్సుపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. అలాగే ఆర్టీసీ బస్సును ధ్వంసం చేశారు. పాచిమ్ బర్ధమాన్ జిల్లాలోని జామూరియాలో ఆర్టీసీ బస్సును తగులబెట్టారు.

తెలుగు రాష్ట్రాల్లో ప్రశాంతం...

తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో బంద్ తీవ్ర ప్రభావం చూపింది. ముఖ్యంగా పారిశ్రామికవాడల్లో కార్మికులు విధులను బహిష్కరించారు. ఇటు విశాఖపట్నం, అటు హైదరాబాద్ పారిశ్రామిక వాడల్లో పరిశ్రమల్లో ఉత్పత్తికి విఘాతం కలిగింది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో దాదాపు కాంట్రాక్టు కార్మికులందరూ సమ్మెలో పాల్గొన్నారు. సగం మంది పర్మినెంట్ ఉద్యోగులు గైర్హాజరయ్యారు. హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీలో 60 శాతం మంది కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. ఎన్టీపీసీ సింహాద్రి పవర్ ప్లాంట్‌లో నూరు శాతం కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సింహాద్రి పవర్ ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ రామచంద్రరావు మాట్లాడుతూ, 2500మంది కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. ఇక తెలంగాణలో 22 లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. పటాన్‌చెరు ప్రాంతంలో పరిశ్రమల్లో కార్మికులు విధులకు హాజరు కాలేదు. పలు మార్కెట్లు మూత పడ్డాయి.



అసోంకే కాదు ఇతర రాష్ట్రాలకూ ..

- పౌరసత్వం బిల్లుకు రాజ్‌నాథ్ సమర్థన
- లోక్‌సభ నుంచి కాంగ్రెస్ వాకౌట్
- ఈశాన్య రాష్ట్రాలు భగ్గుమంటాయి : టీఎంసీ హెచ్చరిక

న్యూఢిల్లీ : వివాదాస్పద పౌరసత్వం బిల్లును కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు భారత పౌరసత్వం కల్పించడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. ఇది అసోం కోసమో.. ఏదో ఒక దేశానికి చెందిన శరణార్థుల కోసమో ప్రవేశపెట్టినది కాదని ఆయనన్నారు. దీని వల్ల ఎవ్వరూ వివక్షకు గురికారని తెలిపారు. అసోం రాష్ట్రానికే కాదు ఇతర రాష్ట్రాలకూ ఇది వర్తిస్తుందని, దేశపౌరుల హక్కులను పరిరక్షిస్తుందని రాజ్‌నాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 'అసోం దీర్ఘకాలంగా అక్రమ వలసల సమస్యను ఎదుర్కొంటోంది. అసోం కష్టం భారత్‌కు తెలుసు.. దాని పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం' అని అన్నారు. సభలో మంత్రి ప్రసంగిస్తుండగా ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ బిల్లుకు నిరసనగా కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేయగా, ఈశాన్య రాష్ట్రాలు తగలబడిపోతాయని తృణమూల్ కాంగ్రెస్ హెచ్చరించింది. 'పౌరసత్వ సవరణ బిల్లు అసోంతో పాటు ఈశాన్యరాష్ట్రాల్లో అగ్నిని రాజేస్తుంది. ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ నుంచి వచ్చే శరణార్థుల విషయంలో అభ్యంతరాలు లేవు. అయితే ఇందుకోసం లౌకిక బిల్లు అవసరం. ఆరు మతాలు, మూడు దేశాల పేర్లను మాత్రమే పేర్కొనడం తగదు' అని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగతా రాయ్ అన్నారు. ఈ బిల్లు వల్ల అసోంలోనే కాకుండా ఈశాన్య రాష్ట్రాల్లో మతచిచ్చు చెలరేగే అవకాశం లేకపోలేదని కాంగ్రెస్ పేర్కొంది.

నిరసనల మధ్య బిల్లు ఆమోదం : కాంగ్రెస్ సహా ప్రధాన ప్రతిపక్షాలు వ్యతిరేకించినప్పటికీ పౌరసత్వం బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించింది. బీజేపీకి దిగువసభలో పూర్తి మెజారిటీ ఉండటంతో యిది సాధ్యపడింది. ఈ నేపథ్యంలో ఈశాన్యరాష్ట్రాల్లో ఆందోళనలు మరింత తీవ్రతరమయ్యాయి.

నేటి వరకు రాజ్యసభ పొడిగింపు

న్యూఢిల్లీ : పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా రాజ్యసభలో మంగళవారం ఆందోళనల పర్వం కొనసాగింది. విపక్షాల ఆందోళనలతో చివరి రోజున సభ పలుమార్లు వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం మంగళ వారంతోనే సమావేశాలు ముగియాల్సి ఉండగా, పలు అంశాలపై చర్చలు పెండింగ్‌లో ఉండటంతో సభను బుధవారం వరకు పొడిగించారు. రాజ్యసభ ప్రారంభంకావటంతోనే ఎస్పీ ఎంపీలు అఖిలేష్ యాదవ్‌పై సీబీఐ దర్యాప్తును వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. వీరికి బీఎస్పీ, కాంగ్రెస్ కూడా మద్దతు పలికాయి. వెల్‌లోకి వెళ్లి సభ్యులు నినాదాలు చేశారు. దీంతో రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా సభా వ్యవహారాలు ముందుకు సాగలేదు. విపక్షాల ఆందోళనల మధ్య ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సవరణ బిల్లు 2018ను ప్రవేశపెట్టారు. ముఖ్యమైన అంశాలపై చర్చ జరగాల్సి ఉన్నందున ఆందోళన చేయవద్దని డిప్యూటీ చైర్మన్ హరివంశ్ పదే పదే సభ్యులను కోరినా ఫలితంలేకపోవటంతో సభను బుధవారానికి వాయిదా వేశారు.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసులో ప్రత్యేక కోర్టులో లొంగిపోయిన రాజ్‌బబ్బర్

ఆగ్రా : ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారన్న కేసులో రాజ్‌బబ్బర్ మంగళవారం ప్రత్యేక కోర్టులో లొంగిపోయారు. 1996లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఈ ఘటన జరిగింది. ప్రత్యేక జడ్జి పవన్ కుమార్ తివారీ ఆయనను కొద్దిగంటలు జ్యుడీషియల్ కస్టడీలోకి తీసుకుని ఆపై బెయిల్ దరఖాస్తును ఆమోదించారు. సమాజ్‌వాదీపార్టీ ఆగ్రా అభ్యర్థిగా పోలింగ్‌బూత్‌లో ప్రత్యర్థిపై ఘర్షణకు దిగారని ఆయనపై పిటిషన్ దాఖలు అయ్యింది. కోర్టు ప్రక్రియలో బబ్బర్‌తోపాటు కాంగ్రెస్ నాయకులు కూడా హాజరయ్యారు. కాంగ్రెస్‌తో విభేదాల కారణంగా విడిపోయిన విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ జనమోర్చా పార్టీని స్థాపించగా, ఈ బాలీవుడ్ నటుడు రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.

రైల్లో రూ.2.5 కోట్ల బంగారం మాయం

జైపూర్: బంద్రా-ఉదయ్‌పూర్ రైల్లో రూ. 2.5 కోట్ల విలువైన బంగారం అపహరణకు గురైందని మంగళవారం పోలీసులు వెల్లడించారు. స్లీపర్ కోచ్‌లో ఇద్దరు వ్యక్తులు ఎనిమిది కేజీల బంగారంతో ప్రయాణిస్తుండగా, చిత్తోర్‌ఘర్ జిల్లాలోని నింభార రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ఘటన జరిగిందన్నారు. ముంబైకి చెందిన కంపెనీలో ఉద్యోగస్తులైన నరేంద్ర ట్రైలంగ్, విపుల్‌లు బంగారపు వర్తకులకు ఈ బంగారాన్ని అందించాల్సి ఉందని వారి వద్ద దీనికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. వారి ఫిర్యాదుతో చిత్తోర్ స్టేషన్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారని పోలీసు అధికారి లాల్ సింగ్ వివరించారు.

కేజ్రీవాల్ పదవీచ్యుతికి హైకోర్టు నో

న్యూఢిల్లీ : కేజ్రీవాల్‌ను సీఎం పదవినుంచి తొలగించాలని దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఆయన అనేక క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నందున పదవి నుంచి తొలగించాలన్న పిటిషన్‌ను చీఫ్ జడ్జి రాజేంద్ర మీనన్, జస్టిస్ వీకేరావులుసుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అనుమతించలేదు. విచారణ కొనసాగుతోందని, ఆ కేసుల్లో నిరపరాధిగా రుజువైతే అప్పటి పరిస్థితి ఏమిటని, అయినా ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికయిన వారిని పదవి నుంచి తొలగించబోమని కోర్టు స్పష్టం చేసింది. ఢిల్లీ చీఫ్ సెక్రటరీపై దాడికి పాల్పడినందున అతనిని తొలగించాలని అడ్వకేట్ హరినాథ్‌రాం ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

ఖైరా కొత్త పార్టీ 'పంజాబీ ఏక్తా'

చండీగఢ్ : ఆమ్‌ఆద్మీ పార్టీకి రాజీనామా చేసిన సుక్పాల్‌సింగ్ ఖైరా (53) మంగళవారం 'పంజాబీ ఏక్తాపార్టీ'ని ప్రారంభించారు. దీనిని ప్రాంతీయ పార్టీగా వెల్లడించారు. ఆప్ నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలు ఆప్‌ను వీడారు. వారిలో కన్వర్‌సింగ్ సాంధు, జగ్దేవ్ సింగ్ కమలు, జగ్తర్ సింగ్ హిస్సోవాల్ , పిరమల్ సింగ్ ఖాస్లా, మాస్టర్ బల్దేవ్ సింగ్, నాజర్ సింద్ మన్షాహియాలు ఉన్నారు. అసెంబ్లీ ప్రతిపక్షనాయకుడిగా అధిష్టానం ఆయనను 6 నెలల తర్వాత తొలగించింది. కేజ్రీవాల్ నియంతగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయని ఖైరా విమర్శించారు. 2015లో కాంగ్రెస్ నుంచి ఆయన ఆప్‌లోకి మారారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ఖైరా, కన్వర్ సాంధులను నవంబరులో పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

హిజాబ్ తొలగించే నిబంధన లేదు : గోవా

పనాజీ : ముస్లిం మహిళలు ధరించే ముసుగు (హిజాబ్)తో పరీక్షా హాలుకు వెళ్లకూడదన్న నిబంధన ఏదీ లేదని గోవా ప్రభుత్వం స్పష్టం చేసింది. నెట్ పరీక్షకు హిజాబ్‌తో హాజరుకు సూపర్‌వైజర్ అనుమతించలేదని సఫీనా ఖాన్ సౌదాగర్ (24) ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం పై విధంగా ప్రకటించింది. ఆమెను పరీక్షకు అనుమతించి ఉండాల్సిందని ఉన్నత విద్యా డైరెక్టర్ ప్రసాద్ లోలీన్కర్ రాష్ట్ర మానవవనరుల మంత్రిత్వశాఖకు తెలిపారు. ఆ పరీక్షలకు ప్రత్యేక డ్రస్ కోడ్‌లేవీ క్రోడీకరించలేదన్నారు. ఒకవేళ హిజాబ్‌ను అనుమతించకపోతే తప్పనిసరిగా ఆ విషయాన్ని సంస్థ వెబ్‌సైటులో వెల్లడించాల్సి ఉంటుందన్నారు.

ఫోన్‌లో మోడీ, ట్రంప్ చర్చలు

వాణిజ్య లోటు, ఆఫ్ఘన్‌కు సహకారంపైనే ప్రధానంగా చర్చ



న్యూఢిల్లీ/వాషింగ్టన్: ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం సాయంత్రం ఫోన్లో మాట్లాడుకున్నారు. భారత్‌తో అమెరికా వాణిజ్యలోటు, ఆఫ్ఘనిస్థాన్‌కు సహకారం పెరుగుదలపై వంటి అంశాలపై ఈ సందర్భంగా వారు చర్చించారు. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు, రక్షణ రంగం, ఉగ్రవాదంపై పోరాటంలో పరస్పర సహకారంపై రెండు దేశాధినేతలు చర్చించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం మంగళవారం వెల్లడించింది. తొలుత నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకొన్న మోడీ, ట్రంప్.. ఇరు దేశాల ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. 2018లో భారత్-అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మెరుగుపడటంపై ఇరు దేశాధినేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. "2019లో భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పటిష్టపరచాలని నాయకులు అంగీకరించారు. భారత్‌తో అమెరికా వాణిజ్యలోటు ఏ విధంగా తగ్గించాలన్న అంశంపై అభిప్రాయాలను మార్చుకున్నారు" అని వైట్‌హౌస్ తెలిపింది. ఈ సందర్భంగా క్రిందటి సంవత్సరం రెండు దేశాల మధ్య జరిగిన 2+2 చర్చలు, భారత్, అమెరికా, జపాన్ మధ్య జరిగిన తొలి త్రైపాక్షిక సదస్సు గురించి ప్రస్తావించారు. గత సంవత్సరం సెప్టెంబరులో ఢిల్లీ వేదికగా భారత్, అమెరికా మధ్య 2+2 చర్చలు జరిగాయి. రెండు దేశాల విదేశాంగ, రక్షణ మంత్రులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఇక 2018 నవంబరులో అర్జెంటీనాలో జరిగిన జీ-20 సదస్సులో భాగంగా మోడీ, ట్రంప్, జపాన్ ప్రధాని షింజో అబే మధ్య త్రైపాక్షిక సమావేశం జరిగింది. ఈ భేటీ తర్వాత మళ్లీ మోడీ, ట్రంప్ మాట్లాడుకోవడం ఇదే. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్‌తో కూడా సోమవారం టెలిఫోన్‌లో మాట్లాడారు. కీలకమైన ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపై వారు మాట్లాడుకున్నారు. టెర్రరిజాన్ని ఎదుర్కోవడంలో సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇద్దరు నాయకులు నిర్ణయించారు.

మోడీని ఎవరూ కాపాడలేరు

రాఫెల్ దర్యాప్తుపై రాహుల్



న్యూఢిల్లీ : రాఫెల్ కుంభకోణం దర్యాప్తు నుంచి ప్రధాని మోడీని ఎవరూ కాపాడలేరని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ప్రజాధనం రూ. 30,000 కోట్లు ఆయన తీసుకుని, తన మిత్రుడు అనిల్ అంబానీకి కట్టబెట్టారని, నేడు యావత్ జాతి ఎటువంటి అనుమానాలు లేకుండా నమ్ముతోందని చెప్పారు. మంగళవారం ఆయన పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ, సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని దేశ అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించడాన్ని స్వాగతించారు. సీబీఐ చీఫ్‌ని అర్ధరాత్రి 1 గంటకు పదవి నుంచి తొలగించారు. రాఫెల్ యుద్ధవిమానాల ఒప్పందంపై దర్యాప్తును ఆయన ప్రారంభించడంతో అలా చేశారు. ఈ ఒప్పందంపై దర్యాప్తు నుంచి మోడీ ప్రభుత్వం తప్పించుకోజాలదన్నారు. "దర్యాప్తు ప్రారంభించారని సీబీఐ డైరెక్టర్‌ని అర్ధరాత్రి 1 గంటకు పదవి నుంచి తప్పించారు. సర్వోన్నత న్యాయస్థానం ఇప్పుడు సీబీఐ చీఫ్‌ని తిరిగి నియమించింది. మాకు కొంత ఉపశమనం లభించింది. ఏం జరుగుతుందో ఇప్పుడు చూద్దాం" అని రాహుల్ అన్నారు. "రాఫెల్ నుంచి వారు తప్పించుకోజాలరు. అది అసాధ్యం. చర్చ నుంచి మోడీజీ పారిపోయారు. రాఫెల్ కుంభకోణంపై ఆయన ప్రజాకోర్టులో చర్చించాలి. వాస్తవాల నుంచి ఎవరూ తప్పించుకోజాలరు" అని అన్నారు. సీబీఐ డైరెక్టర్ వర్మ అధికారాలను తొలగించాలన్న కేంద్రం నిర్ణయాన్ని సుప్రీంకోర్టు పక్కనపెట్టి వర్మను తిరిగి ఆ పదవిలో నియమించాలని ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)ను కాదని, ఫ్రాన్స్‌కు చెందిన దసో ఏవియేషన్ సంస్థకు మోడీ రూ.20 వేల కోట్లు కట్టబెట్టారని రాహుల్ చెప్పారు. రాఫెల్ ఒప్పందంలో భాగంగా ఇప్పటివరకూ ఒక్క విమానం కూడా దేశానికి రాకుండానే ఆ మొత్తం చెల్లించారని, ఈ వ్యవహారంపై అడిగిన ప్రశ్నలకు రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ నేరుగా సమాధానం చెప్పకుండా అబద్ధాలు వల్లె వేస్తున్నారని చెప్పారు. "లోక్‌సభలో శుక్రవారం సీతారామన్ 2.5 గంటలపాటు మాట్లాడారు, కానీ, నేను లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేదు. ఈ వ్యవహారానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ అబద్ధాలను ప్రచారం చేస్తోందని సీతారామన్ ఆరోపిస్తున్నారు" అని అన్నారు.

వెనుకబడిన తరగతులకు కోటాపై

బీజేపీకి మిత్రుల 'సెగ'

- ఘర్షణ సృష్టించే చర్యగా చూడాల్సి ఉంటుంది
- తొలుత కుల గణన చేయాలి
- ఎస్‌బీఎస్‌పీ, అప్నాదళ్(సోనేలాల్)



లక్నో : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లపై అధికార బీజేపీ వేసిన రాజకీయ ఎత్తుగడకు సంబంధించి ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మిత్ర పార్టీలు సుహల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్‌బీఎస్‌పీ), అప్నాదళ్(సోనేలాల్) నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లపై ఒక సామాజిక న్యాయ కమిటీ సిఫార్సుల అమలుకు బీజేపీకి 100 రోజుల అల్టిమేటంను ఎస్‌బీఎస్‌పీ జారీ చేసింది. కుల గణన లేని నివేదిక ఆధారంపై అప్నాదళ్(సోనేలాల్) ప్రశ్నలు లేవనెత్తింది. వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, చాలా వెనుకబడిన-మూడు కేటగిరీలుగా వెనుకబడిన తరగతులను విభజించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా గత ఏడాది మే నెలలో కమిటీ సిఫార్సు చేసింది. 'కుల గణన లేకుండా కమిటీ సిఫార్సులు అమలు చేయలేము. ప్రభుత్వం తొలుత కుల గణన చేయాలి. తర్వాత ఎటువంటి సిఫార్సునైనా అమలు చేయాలి. రిజర్వేషన్లు జనాభా ఆధారంగా ఉండాలి. ప్రభుత్వం జనాభా గణన చేయనపుడు, కోటా లోపల కోటా ఎలా ఏర్పాటు చేస్తుంది..?' అని కేంద్ర మంత్రి, అప్నాదళ్(ఎస్) నాయకురాలు అనుప్రియ పటేల్ తెలిపారు. 'కుల గణన లేకుండా ప్రభుత్వం సిఫార్సులను అమలు చేసినట్లయితే, వెనుకబడిన తరగతుల్లో ఘర్షణలు సృష్టించేదిగా ప్రభుత్వ చర్యను చూడాల్సి ఉంటుంది' అని పేర్కొన్నారు. మరోవైపు, ఎస్‌బీఎస్‌పీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి ఓం ప్రకాష్ రాజభర్ మాట్లాడుతూ '100 రోజుల్లో నివేదిక సిఫార్సులను అమలు చేయకపోతే, మా పార్టీ బీజేపీ చెలిమిని వీడుతుంది. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 లోక్‌సభ స్థానాలకు పోటీ చేస్తాం' అని చెప్పారు. 'లోక్‌సభ ఎన్నికలకు ముందు వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల లోపల రిజర్వేషన్లు కల్పిస్తామని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎన్నికలకు 100 రోజుల సమయం ఉంది. మేము ఒంటరి మార్గం ఎంచుకుంటాం' అని రాజ్‌భర్ తెలిపారు. రాష్ట్రంలోని ఓటర్లలో 44 శాతం మంది వెనుకబడిన తరగతుల వారు ఉన్నారు. ఏ పార్టీ రాజకీయ అవకాశాల విషయంలోనైనా ప్రభావితం చేయడంలో వారు కీలక పాత్ర పోషిస్తారని ఆయన పేర్కొన్నారు. కోటా పరిధిలో కోటా అందించడం, వేర్వేరు ఓబీసీ, దళిత ఉపకులాల్లో మూడు వర్గాలుగా విభజించేందుకు ఉత్తరప్రదేశ్ సామాజిక న్యాయ కమిటీ సిఫార్సు చేసింది. అయితే కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో 2019 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కులాలతో ముడిపడిన ఉత్తరప్రదేశ్‌లో వారి రాజకీయ పరిస్థితి మసకబారే అవకాశాలు ఉన్నాయి. అధికార బీజేపీకి చెందిన ఈ రెండు మిత్రపక్షాలు కమిటీ సిఫార్సుల అమలుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కులాలను విభజించే బీజేపీ వ్యూహంగా రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాది పార్టీ(ఎస్పీ) భావిస్తోంది. 'ఇది రాజకీయ ప్రయోజనాల కోసం కులాలను విచ్ఛిన్నం చేసే చర్య' అని ఎస్పీ ఎమ్మెల్సీ రాజ్‌పాల్ కశ్యప్ తెలిపారు. ఇదిలాఉండగా బీఎస్పీ మాత్రం ఈ విషయంలో మౌనంగా ఉంది. కాగా ప్రతి విధాన నిర్ణయాన్ని రాజకీయంగా చూడటం తగదని బీజేపీ పేర్కొంటోంది.



కనక మహాలక్ష్మి ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- కొత్తగా 10 భవనాల కొనుగోలుకు ప్రణాళిక
- టీటీడీ రూ.10 కోట్ల ఆర్థిక సహకారం
- ఆలయ ఈవో జ్యోతి మాధవి వెల్లడి

విశాలాంధ్ర - విశాఖ వన్‌టౌన్ : ఉత్తరాంధ్రవాసుల ఇలవేల్పు శ్రీ కనక మహాలక్ష్మి ఆలయం అభివృద్ధికి యుద్ధప్రాతిపదిక చర్యలు చేపడుతున్నట్లు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ కార్యనిర్వహణాధికారి జ్యోతి మాధవి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అందరి సహకారంతో ఈ ఏడాది అత్యంత వైభవంగా మార్గశిర మాసోత్సవాలు నిర్వహించుకున్నామని, ఆలయ హుండీ ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. ఈ ఏడాది అమ్మవారి ఆలయ విస్తరణ పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం స్థలాభావం నేపథ్యంలో కొత్తగా 10 భవనాలు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. దీనికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 కోట్లు సమకూర్చనుందన్నారు. శిథిలావస్థలోని పలు భవనాలను పునర్నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రహదారి విస్తరణలో ఇబ్బందులు తలెత్తకుండా, ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం త్వరలోనే పూర్తికానుందన్నారు. సమావేశంలో ఆలయ డిప్యూటీ ఈవో రమణ, ఏఈ రాంబాబు, ఐ.సూరిబాబు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ బయోపిక్ తీయడం మహద్భాగ్యం



విశాలాంధ్ర - తిరుపతి : తన తండ్రి ఎన్టీఆర్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న కథా నాయకుడు, మహా నాయకుడు చిత్రాలను నిర్మించడంతోపాటు తాను ఎన్టీఆర్ పాత్ర పోషించటం మహద్భాగ్యమని సినీహీరో నందమూరి బాలకృష్ణ అన్నారు. కథానాయకుడు సినిమా బుధవారం విడుదల నేపథ్యంలో సినిమాలో అక్కినేని నాగేశ్వరరావు పాత్ర పోషించిన హీరో సుమంత్, ఎన్టీఆర్ భార్య పాత్ర పోషించిన హీరోయిన్ విద్యాబాలన్, ప్రముఖ నిర్మాత సాయి కొర్రపాటితో కలిసి బాలకృష్ణ మంగళవారం ఉదయం తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. చిత్ర కథా నాయకుడు నందమూరి బాలకృష్ణ, హీరోయిన్ విద్యాబాలన్‌తోపాటు చిత్ర యూనిట్ సభ్యులు తిరుపతి పీజీఆర్ సినిమా థియేటర్‌లో సినిమా ట్రైలర్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా హీరో బాలకృష్ణ మీడియాతో మాట్లాడుతూ మహానటుడు నందమూరి తారక రామారావు రాజకీయ, సినీరంగం ద్వారా సమాజ శ్రేయస్సు కోసం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సమాజానికి ఎన్టీఆర్ గురించి ఇప్పటి వరకు తెలియని అనేక విషయాలను తెరపైకి తీసుకొస్తున్నామన్నారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులతోపాటు తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ నాయకులు శ్రీధర్‌వర్మ పాల్గొన్నారు.



వ్యవసాయంలో 11 శాతం వృద్ధి సాధించాం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి

విశాలాంధ్ర-రంపచోడవరం : వ్యవసాయ రంగంలో గడిచిన నాలుగు సంవత్సరాలలో మన రాష్ట్రం దేశంలోనే 11 శాతం వృద్ధి రేటు సాధించినట్లు వ్యవసాయ, ఉద్యానవనశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల వినియోగంలోనూ మనమే ముందున్నామన్నారు. తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం మండలం పందిరిమామిడి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. సుమారు రూ.3 కోట్లతో నిర్మించిన తాటి ఉత్పత్తుల తయారీ కేంద్రం, ఉద్యానవన కార్యాలయం, ప్రయోగశాల, కృషి విజ్ఞాన్ కేంద్ర కార్యాలయ భవనాలను ఆయన ప్రారంభించారు. హార్టీకల్చర్ శాఖ ద్వారా కోళ్ళు, మేకలను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ తాటి ఉత్పత్తుల తయారీ కేంద్రం దేశంలోనే మొదటిదన్నారు. ఏజెన్సీలో ఈ కేంద్రం గిరిజన రైతుల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందన్నారు. ప్రైవేటు భాగస్వామ్యంలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం ద్వారా రైతులకు 20 శాతం ఆదాయం పెరుగుతుందన్నారు. ఉద్యానవన పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు త్వరలో 5200 ఖాళీ పోస్టుల్లో పోస్టింగులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ జ్యోతుల నవీన్, ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, కృషి విజ్ఞాన కేంద్రం వీసీ చిరంజీవిరెడ్డి, రంపచోడవరం సబ్ కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

హెచ్‌ఎల్సీలో మొసలి కలకలం



బయట పడ్డ మొసలి

విశాలాంధ్ర - కణేకల్లు : అనంతపురం జిల్లా కణేకల్ మండలంలోని గెణిగేర పొలాల వద్ద హెచ్‌ఎల్సీ కెనాల్‌లో మంగళవారం మొసలి బయటపడటంతో స్థానికులు భయాందోళన చెందారు. హెచ్‌ఎల్సీ నీటి ప్రవాహం పూర్తి స్థాయిలో తగ్గిపోవడంతో మొసలి పాకుతున్న దృశ్యాలను చూసేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. కొన్నేళ్ల క్రితం హెచ్‌ఎల్సీ నీటి ప్రవాహంలో మూడు మొసళ్ళ సంచారంపై అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం హెచ్‌ఎల్సీ కెనాల్‌లో నీటి ప్రవాహం లేకపోవడంతో అక్కడే పాకుతున్న మొసలిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

విజయనగరం జిల్లాకు మూడు అవార్డులు



కలెక్టర్ హరి జవహర్‌లాల్

విశాలాంధ్ర బ్యూరో - విజయనగరం : విజయనగరం జిల్లాకు స్మార్ట్ ఆంధ్ర ప్రదేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు పార్ట్‌నర్స్ అవార్డులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ మంగళవారం ఇక్కడ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్న జట్టు ట్రస్టు స్వచ్ఛంద సంస్థకు, పార్వతీపురం మున్సిపాల్టీ 12వ వార్డును దత్తత తీసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవికి, నెల్లిమర్ల మండలం కొండగుంపాం గ్రామాన్ని దత్తత తీసుకున్న గుమ్మలూరు విశాలాక్షికి అవార్డులు లభించాయి. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పరిశుభ్రత, తాగునీరు, స్వచ్ఛ భారత్, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, సంక్షేమ పథకాలను ఎక్కువ మంది అర్హులకు చేర్చినందుకు ఈ అవార్డులు దక్కాయి. జన్మభూమి ఆఖరి రోజు అవార్డులు అందజేయనున్నారు. జిల్లాలోని గ్రామాలను, వార్డులను దత్తత తీసుకొని తీర్చిదిద్దేందుకు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు

త్రిపురాంతకం.. నకిలీ ఎరువుల కేంద్రం

- బళ్లారిలో తయారీ
- త్రిపురాంతకంలో నిల్వ
- ఐపీఎల్ బ్రాండ్‌తో సరఫరా
- విజిలెన్స్ దాడులతో బట్టబయలు

విశాలాంధ్ర - త్రిపురాంతకం : ప్రకాశం జిల్లా త్రిపురాంతకం కేంద్రంగా సాగుతున్న నకిలీ ఎరువుల వ్యాపారం బండారం బట్టబయలైంది. కర్ణాటకలోని బళ్లారిలో తయారవుతున్న నకిలీ ఎరువులను ఐపీఎల్ బ్రాండ్ పేరుతో ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. నకిలీ ఎరువులను ఉపయోగిస్తున్న రైతులకు వీటి నాణ్యతపై అనుమానం రావటంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు బిల్లులు లేకుండా ఎరువులను విక్రయిస్తున్న ముఠాను వలపన్ని పట్టుకున్న ఘటన మంగళవారం వెలుగు చూసింది. త్రిపురాంతకంలోని శ్రీ రాఘవేంద్ర ఫెర్టిలైజర్స్ యజమాని డోగిపర్తి గుప్తా, శ్రీ లక్ష్మీ సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్ యజమాని అన్నా సుబ్రహ్మణ్యం, నడిగడ్డకు మాధవి ఫెర్టిలైజర్స్ (నడిగడ్డ) యజమాని నాగిరెడ్డి నకిలీ ఎరువులను సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. కర్ణాటకలోని బళ్లారిలో తయారవుతున్న నకిలీ ఎరువులను అనంతపురం డీలర్ రాజు ద్వారా ఐపీఎల్ కంపెనీ పొటాష్ పేరుతో విక్రయిస్తున్నారు. వీటిని బిల్లులు లేకుండానే 13 జిల్లాలకు సరఫరా చేస్తూ రూ.లక్షలు కూడబెడుతున్నారు. ఇటీవల గుంటూరు జిల్లా నరసరావుపేట ఏజెంట్ నాగేశ్వరరావుకు, చీరాలకు నకిలీ ఎరువుల లోడులు వచ్చాయి. ఆ ఎరువులు పని చేయకపోవటంతో రైతులు విజిలెన్స్ అధికారు లకు ఫిర్యాదు చేయగా, అధికారులు ఈ నెల మూడున స్థానిక బాల త్రిపుర సుందరీదేవి ఫెర్టిలైజర్ షాపులో శాంపిల్స్ సేకరించారు. రెండు రోజుల క్రితం శ్రీరామ్ ట్రేడర్స్, వెంకట కదాంబరి, వెంకటేశ్వర ట్రేడర్స్‌పైనా దాడులు చేసి 40 బస్తాల ఐపీఎల్ ఎరువులను సీజ్ చేశారు. వీటి నాణ్యతలో తేడా ఉండటంతో సీఐ భూషణం ఆధ్వర్యంలో నడిగడ్డలోని నాగిరెడ్డి షాపుపై మంగళవారం దాడి చేశారు. దీంతో ఆయన షాపు వదిలేసి పరారయ్యాడు. త్రిపురాంతకంలోని రెండు షాపులపైనా దాడులు చేసి 60 బస్తాలను సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న శ్రీ లక్ష్మీ శ్రీనివాస్ ట్రేడర్స్‌లోని ఎరువులను వేరేచోటకు తరలిస్తుండగా, అధికారులు అడ్డుకున్నారు. నకిలీ ఎరువుల ముఠాలో కీలకమైన నాగిరెడ్డి, డోగిపర్తి గుప్తా పరారవ్వగా, సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఈ దాడులలో ఎస్పై జాని, వ్యవసాయ శాఖ ఏడీ సుదర్శన్‌రాజు, ఏఓలు ఉమాపతి, బాలాజీ నాయక్, జవహర్‌లాల్ నాయక్ పాల్గొన్నారు.



ఎరువుల గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు



ఆధునిక టెక్నాలజీతో నేరాల నియంత్రణ

విశాలాంధ్ర - కర్నూలు : ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ నేరాల నియంత్రణ, శాంతిభద్రత పటిష్టతకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని రాష్ట్ర డీజీపీ ఆర్పీ ఠాకూర్ అన్నారు. కర్నూలులోని జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జిల్లా పోలీసు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కర్నూలు రేంజ్ డీఐజీ డి.నాగేంద్రకుమార్, జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్పతో పాటు జిల్లాలోని సబ్ డివిజన్ పోలీసు అధికారులతో ఆయన శాంతిభద్రతలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నేరాలు తగ్గిన తీరును పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా జిల్లా ఎస్పీ వివరించారు. సాంకేతికతను ఉపయోగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఐపీఎస్ అధికారి విద్యాసాగర్ నాయుడు, అడిషనల్ ఎస్పీలు మాధవరెడ్డి, ఐ. వెంకటేష్, డీఎస్పీలు జె.బాబుప్రసాద్, నజీముద్దీన్, వెంకటరాముడు, శ్రీనివాసులు, ఖాదర్ బాషా, కులశేఖర్, సుధాకర్‌రెడ్డి, గోపాలకృష్ణ, మురళీధర్, రమేష్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలిపిరి వద్ద భక్తులకు వసతి

- రూ.67.29 కోట్లతో 384 గదుల నిర్మాణానికి టెండర్లు ఖరారు
- తిరుమలలో మరో 1050 సీసీ కెమేరాలు
- టీటీడీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్



విశాలంధ్ర - తిరుమల : తిరుపతిలోని అలిపిరి వద్ద భక్తులకు వసతి కోసం మొదటి బ్లాక్‌లో రూ.67.29 కోట్ల వ్యయంతో 384 గదుల నిర్మాణానికి టెండర్లు ఖరారు చేసినట్లు టీటీడీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం పాలక మండలి సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. చిత్తూరు జిల్లా పలమనేరులోని గోశాలలో దేశవాళీ గోవుల సంరక్షణ, గో పర్యాటకం అభివృద్ధి, పాడి రైతులకు శిక్షణ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలతోపాటు ఇతర అభివృద్ధి పనులకు రూ.40.77 కోట్లు మంజూరుకు ఆమోదం తెలిపారు. అమరావతిలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం నిర్మాణ ప్రక్రియలో మహారాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథమండపం, ఆంజనేయస్వామివారి ఆలయం, పుష్కరిణి నిర్మాణం కోసం రూ. 27.29 కోట్లతో టెండర్లు ఖరారు చేశారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మరింత పటిష్ట భద్రత కల్పించేందుకు రెండవ దశలో 1050 సీసీ కెమేరాల ఏర్పాటుకు రూ.15.79 కోట్లు మంజూరు చేశారు. తిరుమలలో సర్వదర్శనం కాంప్లెక్స్ నుంచి ఆళ్వార్ ట్యాంక్ రెస్ట్‌హౌస్ గేటు వరకు రూ.17.21 కోట్లతో క్యూ లైన్ నిర్మాణానికి టెండర్లు ఖరారు చేశారు. తిరుమలలో స్మార్ట్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.2.63 కోట్లు, తిరుపతిలో డేటా సెంటర్‌లో హార్డ్ వేర్ ఏర్పాటుకు రూ.1.97 కోట్లు మంజూరుకు సమావేశం ఆమోదం తెలిపింది. స్వర్గీయ వేదాంతం దేశికాచార్యులు స్థానంలో టీటీడీ అర్చకులు ఎ.అనంతశయన దీక్షితులను రెండేళ్ళ కాలపరిమితితో ఆగమ సలహాదారునిగా నియమించేందుకు ఆమోదం తెలిపారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి సముదాయంలో ఒక రోజుకు నాన్ ఏసీ గది అద్దె రూ. 600, ఏసీ గది రూ.1200, ఏసీ డార్మెటరీలో ఒక వ్యక్తికి రూ.100, నాన్ ఏసీ డార్మెటరీ ఉచిత కేటాయింపునకు ఆమోదం తెలిపారు. అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద కల్యాణ మండపాన్ని రూ.2.27 కోట్లతో నిర్మించేందుకు టెండర్లు ఖరారు చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో శ్రీ వేంకటేశ్వర దివ్యక్షేత్రాల నిర్మాణానికి టెండర్లకు ఆమోదం తెలిపారు. విజయనగరం జిల్లా పార్వతీపురంలో రూ.2.90 కోట్లు, శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో రూ.2.86 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో రూ.2.90 కోట్లు ఖర్చు చేస్తూ పాలకమండలి ఆమోదం తెలిపింది.



అపస్మారకస్థితిలో తల్లి, కుమారులు

అప్పులు చుట్టుముట్టడంతో కుటుంబం ఆత్మహత్యాయత్నం

- తల్లి మృతి, ఇద్దరు కుమారుల పరిస్థితి విషమం
- విశాఖ జిల్లాలో ఘటన

విశాలాంధ్ర - పెందుర్తి : అప్పుల బాధతో ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం విశాఖ జిల్లా పెందుర్తి ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో తల్లి మృతి చెందగా, ఇద్దరు కుమారులు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. పెందుర్తి సమీపంలోని చినముషిడివాడ అంబేద్కర్ నగర్‌లో నివాసం ఉంటున్న కీదరశెట్టి రమ, ఈమె కుమారులు గణేశు తేజ, దుర్గా వరహాలుశెట్టి కలిసి మంగళవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న వీరిని స్థానికులు హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. దారిలో తల్లి రమ మృతి చెందారు. ఇద్దరు కుమారులు మృత్యువుతో పోరాడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. రమ భర్త, మరో కుమారుడు ఇటీవల మరణించారు. తక్కువ సమయంలో కుటుంబం మొత్తం కకావికలం కావడంతో అంబేద్కర్‌నగర్‌లో విషాధచాయలు అలముకున్నాయి.

వ్యాపారంలో నష్టాలతో అప్పులు

విజయనగరం జిల్లా కొత్తవలస మండలానికి చెందిన కీదరశెట్టి రమ కుటుంబం పెందుర్తి ప్రాంతానికి వలస వచ్చి వ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో నష్టాలు పెరిగిపోవడంతో అప్పులు చుట్టుముట్టాయి. అదే సమయంలో కొడుకు అకాల మరణంతో కుంగిపోయిన కుటుంబ యజమాని తునువు చాలించారు. దీంతో కుటుంబ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. సంక్రాంతికి చెల్లించాల్సిన అప్పులకు సంబంధించి ఒత్తిడి పెరగడంతో ఏమి చేయాలో తెలియక ఆ ముగ్గురు పురుగులు మందు తాగినట్లు ప్రచారం సాగుతోంది. ఈ ఘటనతో స్థానికులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

తొమ్మిది మంది మావోయిస్టుల లొంగుబాటు



విశాలాంధ్ర-కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ విశాల్ గున్ని ఎదుట మంగళవారం తొమ్మిది మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు దళసభ్యులు, ఒక మిలీషియా దళ కమాండర్‌తో పాటు ఆరుగురు మిలిషియా సభ్యులు ఉన్నారు. కాకినాడలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మావోయిస్టుల వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు. చింతూరు మండలం పొంగుట గ్రామానికి చెందిన దిర్ధి జోగయ్య అలియాస్ ముకేష్, మడకం జోగయ్య అలియాస్ రఘు శబరిదళ సభ్యులుగా పనిచేస్తున్నారన్నారు. శబరిదళ ఏరియాలో మిలీషియా సభ్యుడు దిర్ధి సోమయ్య మిలీషియాకు కమాండర్‌గా పదోన్నతితో మావోయిస్టుల కార్యకలాపాల్లో పాల్గొంటున్నారన్నారు. కుంజా బండి, ముచ్చికమల్లి, ముచ్చిక ఉంగయ్య, సోడి ఇదమయ్య, మడకం దిలీప్, వంజం పాండు మిలీషియా సభ్యులుగా పనిచేస్తున్నారన్నారు. వీరందరూ మావోయిస్టుల చర్యలకు విరక్తి చెంది జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకుని లొంగిపోయారన్నారు. సమావేశంలో చింతూరు ఓఎస్డీ అమిత్ బర్ధర్, డీఎస్పీ దిలీప్‌కిరణ్, సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్, జిల్లా స్పెషల్ పార్టీ ఏఎన్ఎస్, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

చెత్త భారం రూ.30 కోట్లు

- యూజర్ ఛార్జీల పేరుతో దోపిడీకి జీవీఎంసీ సన్నద్ధం
- రూ.20 నుంచి 50 రూపాయలకు పెంపు
- అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలపై సంక్రాంతి ఛార్జీలు
- పండగ పూట విశాఖ నగర జనం బెంబేలు





విశాలాంధ్ర - విశాఖ సిటీబ్యూరో : పన్నుల భారం పడకుండా కార్పొరేషన్ ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నామన్న జీవీఎంసీ అధికారులు మరో దారిలో జనం నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ పేరుతో ఆపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల నుంచి చెత్త సేకరణకు యూజర్ ఛార్జీలను రెండున్నర రెట్లు పెంచేస్తూ సంక్రాంతి పండగ పూట భారం మోపింది. నగర ప్రజలపై ఏడాదికి ఈ భారం అక్షరాలా 30 కోట్ల రూపాయలు..

పన్నులతో ప్రజలపై ఆర్థిక భారం మోపడం లేదంటున్న ప్రభుత్వం దొడ్డి దారిన వసూళ్లకు తెగబడుతోంది. డొమెస్టిక్‌లో కమర్షియల్ పేరుతో కొత్త కేటగిరీని ఏర్పాటు చేసి రెట్టింపు నీటి పన్ను వసూళ్లు ప్రారంభించిన జీవీఎంసీ ఆ తర్వాత ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ) పేరుతో బాదుడు మొదలుపెట్టింది. కొత్తగా పన్నులు పెంచడం లేదని పదేపదే ప్రకటిస్తున్న రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రస్తుతం ఉన్న వాటిని సవరించాలంటూ అధికారులను ఆదేశిస్తున్నారు. ఈ క్రమంలోనే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 ప్రకారం యూజర్ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు మహా విశాఖ నగర పాలక సంస్థ చెబుతోంది.

ఆ తీర్మానం ఏమిటంటే..?

మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలు అనుసరించి అపార్ట్‌మెంట్ వాసులు, గేటెడ్ కమ్యూనిటీల నుంచి ఘన వ్యర్థాలు సేకరణకు యూజర్ ఛార్జీలు వసూలు చేస్తోంది. ఆయా ప్రాంతాల నుంచి ఎప్పటికప్పుడు సేకరించిన ఘన వ్యర్థాల్ని జీవీఎంసీ సిబ్బందితో డంపింగ్ యార్డుకు తరలించేందుకు ఈ వినియోగ రుసుం విధిస్తోంది. గతంలో రూ.20 మాత్రమే వుండే ఈ రుసుంను ఇకపై కార్పొరేషన్ కౌన్సిల్ తీర్మానాన్ని అనుసరించి గేటెడ్ కమ్యూనిటీల్లోని ఒక్కో ఫ్లాట్ నుంచి 50 రూపాయలు కాగా, అపార్ట్‌మెంట్‌లోని ఒక్కో ఫ్లాట్ నుంచి రూ.50 చొప్పున వసూలు చేయనుంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సూపర్‌వైజర్, హెల్త్ ఆఫీసర్, జోనల్ కమిషనర్‌లకు వారి పరిధుల్లో తగిన రసీదు ఇచ్చి వసూలు చేయనున్నారు. స్వచ్ఛ భారత్‌మిషన్‌కు అనుబంధంగా శాస్త్రీయ పద్ధతిలో మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణ పటిష్టంగా అమలు చేసేందుకు ఈ చర్యలు చేపడుతున్నట్లు జీవీఎంసీ యంత్రాంగం చెబుతోంది.

ఒక్కసారిగా రెండున్నర రెట్లు పెంపు

గతంలో ప్రతి ఫ్లాట్ నుంచి రూ.20 మాత్రమే వసూలు చేసేవారు. ప్రస్తుతం యూజర్ ఛార్జీలు రెండున్నర రెట్లు పెంచేశారు. అంటే 50 రూపాయలు. ఈ లెక్కన ఒక్కో అపార్ట్‌మెంట్‌లోనూ, గేటెడ్ కమ్యూనిటీలోనూ ఒక్కో ఫ్లాట్ నుంచి ఏడాదికి రూ.600 వసూలు చేయనున్నారు. గతంలో రూ.240 మాత్రమే వుండి. నగరంలో 4,500 అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, 150 వరకూ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, 20 గేటెడ్ కమ్యూనిటీలు ఉన్నాయి. వీటిలో మొత్తం 5 లక్షలకు పైగా ఫ్లాట్లు ఉంటాయి. ఒక్కో ఫ్లాట్‌కు ఏడాదికి రూ.600 చొప్పున 5 లక్షల ఫ్లాట్స్ నుంచి అక్షరాలా 30 కోట్ల రూపాయల వసూలుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పన్నుల భారం మోపకుండానే యూజర్ ఛార్జీల భారం నెత్తిన పడేస్తున్న జీవీఎంసీ వైఖరిపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రజా సంఘాలు సైతం పోరాటానికి సిద్ధమవుతున్నాయి. గడిచిన ఆరు నెలలుగా అనాధికారికంగా జీవీఎంసీ ప్రజా ఆరోగ్యశాఖ అధికారులు అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, హోటళ్ళ నుంచి చెత్త సేకరణ పేరుతో యూజర్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

దొడ్డిదారిలో యూజర్ ఛార్జీలు..

చెత్త సేకరణకు యూజర్ ఛార్జీల పేరుతో అధిక మొత్తం వసూలు చేస్తున్నారు. చెత్త ఎత్తివేత కోసం రూ.50 చొప్పున వసూలు చేయడం నగర ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నట్టే. స్వచ్ఛ భారత్ ముసుగులో కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. కొత్త ఏడాది ప్రజలపై పెనుభారం మోపుతున్నారు. యూజర్ ఛార్జీలను ఎత్తివేయకపోతే పోరాటం తప్పదు.

ఎం.పైడిరాజు,
సీపీఐ నగర కార్యదర్శి

ప్రజలపై భారం సరికాదు..

పన్నుల వేయడం లేదంటూనే దాని కంటే పెద్ద భారం ప్రజలపై మోపుతున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో ప్రజలపై ఆర్థిక భారాలు మోపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ తరహా విధానాలు సరికావు. తక్షణమే యూజర్ ఛార్జీల పెంపు తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం తప్పదు.

బి.గంగరావు,
సీపీఎం నగర కార్యదర్శి

'గిన్నిస్'లో రికార్డు సంతోషకరం : దేవినేని ఉమా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పోలవరం ప్రాజెక్టు గిన్నిస్ రికార్డులోకి ఎక్కడం సంతోషకరమైన విషయమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. విజయవాడలోని ఇరిగేషన్ కార్యాలయంలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టు వద్ద 32,315.5 క్యూబిక్ మీటర్ల మేర కాంక్రీట్ వేయడం గొప్ప విషయమన్నారు. వేలాది మంది కార్మికులు, ఇంజనీర్లు 24 గంటలపాటు శ్రమించడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా చంద్రబాబు నిధులను కేటాయించి పనులను పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. నిర్వాసితులకు డబ్బులివ్వాల్సి ఉన్నా కేంద్రం నిధులు విడుదల చేయడంలేదన్నారు. చంద్రబాబు ప్రణాళికల వల్లే రాష్ట్రంలో భూగర్భజలాలు పెరిగాయన్నారు. కృష్ణాడెల్టాలో రెండు పంటలతోపాటు రాయలసీమకు నీరిచ్చామన్నారు. దేశమంతా గర్వపడి తెలుగువారి సత్తాను అభినందిస్తుంటే ప్రతిపక్షనేత జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. మోడీ, కేసీఆర్ దర్శకత్వంలోనే జగన్ టీడీపీపై కుట్రలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

పార్ట్‌టైమ్ లెక్చరర్ల వేతనాల పెంపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంటర్మీడియట్ ఒకేషనల్ విభాగంలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ జూనియర్ లెక్చరర్ల వేతనాన్ని గంట వ్యవధి బోధనా కాలానికి రూ.150 నుంచి రూ.375కు ప్రభుత్వం పెంపుదల చేసింది. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్‌దాస్ మంగళవారం జీవో నంబరు-8 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు.

పార్టుటైమ్ రెవెన్యూ సహాయాధికారుల పారితోషికం పెంపుదల

రెవెన్యూశాఖలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ సహాయ గ్రామ రెవెన్యూ అధికారుల పారితోషికాన్ని ప్రభుత్వం పెంపుదల చేసింది. దాదాపు 105 మందికి నెలకు రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) అధ్యక్ష,కార్యదర్శులు బొప్పరాజు, అంజి ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్లిష్టంగా ఉన్నప్పటికీ రెవెన్యూశాఖలో ముఖ్యభూమిక పోషిస్తున్న పార్ట్‌టైమ్ రెవెన్యూ సహాయాధికారులకు పారితోషికం పెంపుదలపై సీఎం చంద్రబాబు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

కార్మికలోకం కన్నెర్ర



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక లోకం మండిపడింది. జాతీయ స్థాయిలో 10 కేంద్రకార్మిక సంఘాల పిలుపులో భాగంగా తొలిరోజు సార్వత్రిక సమ్మె రాష్ట్రవ్యాప్తంగా విజయవంతమైంది. విజయవాడలో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం లెనిన్ సెంటర్‌లో బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరచి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ మాట్లాడుతూ కోట్లాది కార్మికుల ప్రయోజనాలు, కనీస హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. . ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఏఐసీసీటీయూ నేత హరనాథ్, వైఎస్సార్‌టీయూ నేత విశ్వనాథ రవి, ఏఐయూటీయూసీ నేత కె.సుధీర్, ఏఐఎఫ్‌యూటీ నేత జె.కిషోర్‌బాబు, ఏఐబీఈఏ నేత వై.శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళ ఫోరం నాయకురాలు కె.శైలజ, ఆశావర్కర్స్ ప్రతినిధి కె.శ్రీలక్ష్మి, మధ్యాహ్నభోజన పథకం కార్మికుల నాయకురాలు రమాదేవి, యూటీఎఫ్ నేత పి.బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ నగర కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు పల్లా సూర్యారావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సాంబశివరావు, టీ.తాతయ్య, ప్రజానాట్యమండలి కళాకారులు పి.చంద్రానాయక్, ఆర్.పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో సార్వత్రిక సమ్మె సంపూర్ణం

సార్వత్రిక సమ్మెలో భాగంగా విశాఖలో పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె సంపూర్ణంగా సాగింది.నగరంలోని అన్ని ప్రాంతాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన పోర్టు , స్టీల్‌ప్లాంటు , షిప్‌యార్డ్, డాక్‌యార్డ్, హెచ్‌పీసీఎల్, బీహెచ్‌పీవీ, ఎల్ఐసీ, తపాలా, బ్యాంకుల్లో సమ్మె సంపూర్ణంగా సాగింది. ఆయా కార్యాలయాలు ఎదుట ఉద్యోగ సంఘాలు నిరసన నినాదాలు చేశారు.గాజువాక, పెందుర్తి, ఎన్ఏడీ, మధురవాడ, మల్కాపురం, అనకాపల్లి, భీమిలితో పాటు నగరంలో ప్రధాన రహదారుల్లో సమ్మె ర్యాలీలు సాగాయి. విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఎలక్ట్రికల్ ఉద్యోగుల ఆందోళనలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ.సత్యనారాయణమూర్తి పాల్గొని మాట్లాడారు. సీతమ్మధార ఆంధ్రాబ్యాంకు ఎదుట బ్యాంక్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ నరేంద్రమోడీ నేతృత్వంలో దేశంలో ఎన్‌డీఏ ప్రభుత్వం నిరంకుశ వైఖరితో వ్యవహరిస్తోందన్నారు. మద్దిలపాలెంలో ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, విద్యార్థి, యువజన సంఘాల నేతలు తలలేని కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ తో మద్దిలపాలెంలో ర్యాలీ నిర్వహించారు

అనంతపురంలో : అనంతపురములో కార్మిక సంఘాలు భారీ ర్యాలీ నిర్వహించాయి. అనంతపురములోని కృష్ణకళామందిర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు కొనసాగింది. ర్యాలీ ముగింపు సభలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలు ప్రధానంగా ప్రతి పౌరుడు ఖాతాల్లో రూ. 15 లక్షలు జమ, ఏటా రూ. 2 కోట్ల ఉద్యోగాలు, మూతబడిన పరిశ్రమలు పునఃప్రారంభించి కార్మికులకు ఉపాధి కల్పన, తదితర వాటిని నెరవేర్చకుండా ఎన్నికల మేనిఫెస్టోలో లేని కోట్లాది మంది కార్మికుల కడుపు కొట్టే చట్టాలను తీసుకువచ్చేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా అధ్యక్షులు బయన్న, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, గోవిందు, సహాయ కార్యదర్శి జి.రామకృష్ణ, ఆర్టీసి ఎంప్లాయిస్ ప్రాంతీయ కార్యదర్శి పిఎస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో : కేంద్ర కార్మికసంఘాల పిలుపుమేరకు పశ్చిమ గోదావరి జిల్లాలో సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఏలూరులో వివిధ కార్మికులంతా సంఘటితంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తూ, వారి శ్రమను దోపిడీ చేస్తూ కార్పొరేట్‌వర్గాలకు దోచిపెడుతున్నాయని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను హరించాలని చూస్తూ పతనం తప్పదని పాలకులను హెచ్చరించారు. సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నెక్కంటి సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి కె కృష్ణమాచార్యులు తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

కృష్ణాజిల్లాలో : కృష్ణాజిల్లా వ్యాప్తంగా తొలిరోజు సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. కార్మికసంఘాలన్నీ జిల్లాలోని అన్ని ముఖ్యపట్టణాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. నూజివీడులో సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, ఇబ్రహీంపట్నంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు తదితరులు ఆందోళన కార్యక్రమాలకు నాయకత్వం వహించారు.

శ్రీకాకుళంలో : శ్రీకాకుళంలోని ఆంధ్రా బ్యాంక్ నుండి ర్యాలీగా బయలుదేరిన కార్మిక, బ్యాంకు ఉద్యోగ సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నినాదాలు చేస్తూ పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, శ్రీకాకుళం జిల్లా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐబీఈఏ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సనపల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలో : మంగళవారం దేశ వ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. తిరుపతి నగరంలో కార్మికులు వేలాది మంది రోడ్లెక్కారు.బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు సమ్మెకు దిగారు. ప్రభుత్వాల తీరును ఎండగడుతూ విచిత్ర వేషధారణలు, బ్యానర్లు, ప్లకార్డులు చేతబట్టుకుని నినాదాలతో హోరెత్తించారు. కార్మిక సంఘాల సమ్మెకు సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాలు సంఘీబావం తెలియజేశాయి. కార్పొరేషన్ కార్యాలయం నుండి తిలక్‌రోడ్డు మీదుగా నాలుగుకాళ్ల మండపం, రైల్వేస్టేషన్, గాంధీ విగ్రహం సర్కిల్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు మహాప్రదర్శనలో కార్మికులు కదం తొక్కారు.కార్మిక వ్యతిరేక భూతం దిష్టిబొమ్మను లాక్కోవడానికి ప్రయత్నించారు. కార్మికులు, పోలీసుల మధ్య పెనుగులాట, తోపులాట చోటుచేసుకుంది. చివరకు కార్మికులు దిష్టిబొమ్మను దహనం చేయడంతో పోలీసులు వాగ్వివాదానికి దిగారు. ర్యాలీలో మున్సిపల్, పంచాయితీ, మెడికల్, బిఎస్ఎన్ఎల్, ఆర్టీసీ, బీమా, పోస్టల్, అంగన్‌వాడీ, ఆశ, ఆటో, హమాలీ, రవాణ తదితర రంగాల కార్మికులు, బ్యాంకు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి, పి.మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఐఎన్‌టీయూసి జిల్లా అధ్యక్షులు రత్నకుమార్ సమ్మెకు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామా నాయుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రామచంద్రయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టీ.జనార్ధన్, సీపీఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఏఐఎస్ఎఫ్ నేతలు శివారెడ్డి, శశి, ఉదయ్, మురళి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రసాద్ పాల్గొని సంఘీబావం తెలిపారు.

ఒంగోలులో :సార్వత్రిక సమ్మెను పురస్కరించుకొని వివిధ కార్మిక సంఘాలు ఒంగోలు నగరంలో భారీ ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పీజే చంద్రశేఖర్‌రావు, ఏఐటీయూసీ, సీఐటీయూ ఒంగోలు నగర కార్యదర్శులు ఎస్‌కె మస్తాన్, దామా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో: విజయనగరం జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. జిల్లాలోని శృంగవరపుకోటలో వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామేశ్వరరావు, జిల్లా సీపీఎం కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో : కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు మంగళవారం గుంటూరులో కార్మికసంఘాలన్నీ ఏకమై కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించాయి. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుంటూరు అంబేద్కర్ విగ్రహం వద్ద సభ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, పట్టణ నాయకులు ప్రసంగించారు.

తూర్పుగోదావరి జిల్లాలో : కార్మిక సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రాజమహేంద్రవరంలోని కోటగుమ్మం సెంటర్ నుండి కోటిపల్లి మెయిన్ రోడ్డు మీదుగా బస్టాండు వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు నల్లా రామారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షులు వంగమూడి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో : దేశవ్యాప్తంగా కేంద్రకార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె మొదటి రోజు కర్నూలులో జిల్లాలో పూర్తి విజయవంతమైంది. నిరసన తెలియచేస్తున్న యువజన సంఘం నాయకులను స్యాపిలీలో పోలీసులు అరెస్టు చేశారు. డోన్, ఆదోనిలో పాఠశాలలు నిర్వహిస్తున్న వారిపై విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్త చేస్తూ ఫర్నిచర్ ధ్వంసం చేశారు. కర్నూలు జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, టీయూసీ, యూటీయూసీ, ఐఎఫ్‌టీయూ కార్మికసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి ,సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కె రామాంజనేయులు ,సీపీఎం జిల్లా కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డిలు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జె లలితమ్మ, మనోహర్ మాణిక్యం, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప,సీఐటీయూ నాయకులు గౌస్‌దేశాయ్, వర్కింగ్ ఉమేన్స్ ఫోరం నాయకులు నిర్మలమ్మ, రాజ్యలక్ష్మి .ఐఎన్‌టీయూసీ నాయకులు వైవి రమణ, యుటీయుసీ నాయకులు ఎం నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో : ఆత్మకూరులో బస్టాండు నుంచి వీఆర్‌సీ వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జిల్లా సహాయ కార్యదర్శి దామా అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కడపలో : కార్మిక సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అన్ని కార్మిక సంఘాలు ఏకమై ధ్వజమెత్తాయి. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కడప నగరంలో నిర్వహించిన భారీ ర్యాలీ బహిరంగ సభ విజయవంతం అయ్యాయి. సభను ఉద్దేశించి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కొండల రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి జి. ఈశ్వరయ్య, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బాలకాశి తదితరులు ప్రసంగించారు.

సిద్ధాంత బలంలేని పార్టీలకు మనుగడ ఉండదు

- టీడీపీ, వైసీపీలకు ఎలాంటి సిద్ధాంతాలు లేవు
- రాజకీయాల్లో ఒక స్థాయికి రావాలంటే దశాబ్దం పడుతుంది
- లాంగ్‌టర్మ్ విజన్‌తోనే రాణింపు సాధ్యం
- కర్నూలు జిల్లా సమీక్షలో పవన్ కల్యాణ్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : సిద్ధాంత బలం లేకుండా కేవలం నాయకుల బలం మీద ఆధారపడి నడిచే పార్టీలు ఎక్కువ కాలం మనుగడ సాధించలేవనీ, టీడీపీ, వైసీపీలే దానికి ఉదాహర ణలని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. విజయవాడ జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కర్నూలు జిల్లా నాయకులు, కార్యకర్తలతో ఆయన మంగళవారం సమీక్ష నిర్వ హించారు. పవన్ మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికలు జనసేన పార్టీకి మొదటి పోరాటమేగానీ ఆఖరి పోరాటం కాదన్నారు. రాజకీయాల్లో ఒక స్థాయికి రావాలంటే కనీసం దశాబ్దంపాటు ఓపికగా ఉండాలని హితవు పలికారు. రాష్ట్రంలో కొత్త నాయకత్వం రావాల్సిన సమయం ఆసన్న మైంద న్నారు. అయితే కొత్తవారు ఎంత వరకు నిలబడ తారన్నదే ప్రధాన సమస్య అన్నారు. కర్నూలు జిల్లాతో తనకున్న అనుబంధం ఈనాటి కాదని స్పష్టం చేశారు. హత్తిబెళగల్ పేలుళ్లు జరిగినప్పుడు బాధితులని పరామర్శించడానికి వచ్చినప్పుడు రోడ్లు పట్టనంత జనం వచ్చారని గుర్తు చేశారు. ప్రవహించే నదిలో కూడా పవర్ ఉంటుందనీ, దాన్ని వెలికితీయాలంటే టర్బైన్లను అనుసంధానం చేయాలని తెలిపారు. ప్రస్తుత వ్యవస్థను మార్చాలనే లక్ష్యంతో ముందుకు వచ్చేవారిని ఒక క్రమపద్ధతిలో అనుసంధానం చేయాలన్నారు. అది సమాజానికి ఉపయోగపడే విధంగా రూపొందించాలని సూచిం చారు. 2001 నుంచే ప్రజలు మార్పు కోరుకో వడాన్ని గమనించాననీ, ప్రస్తుత రాజకీయ వ్యవస్థపై విసుగుతో జనం జనసేన వైపు చూస్తున్నారని అన్నారు. నాయకులకి కోట్ల రూపాయిలు దోచే యడంలో ఉన్న శ్రద్ధ యువతికి ఉపాధి కల్పిం చడంలో లేద న్నారు. తన బలం, బలహీనత రెండూ తనకు తెలిసి నంతగా ఎవ్వరికీ తెలియ దన్నారు. అందుకే తాను ఎలాంటి పరిస్థితి నైనా తట్టుకుని నిలబడగలనని స్పష్టం చేశారు. కొత్తవారికి అవకాశం ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినప్పుడు మెజారిటీ శాతం కొత్తవారే ఉండాలన్న లక్ష్యంతో 60 శాతం సీట్లు వారికే ఇస్తామన్నారు. సంక్రాంతిలోపే స్వల్పకాలిక కమిటీలు వేసి వారికి బాధ్యతలు అప్పగిస్తామని పేర్కొన్నారు. రాజకీయా ల్లో రెండు రకాల శక్తులు ఉంటాయన్నారు. ఒకటి పాలసీ మేకింగ్ అయితే, రెండోది మాస్ ఫాలో యింగ్ అన్నారు. జనసేన పార్టీకి రెండు రకాల బలం ఉందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 175 స్థానాలపై స్పష్టత ఉందన్నారు. అన్ని స్థానాల్లో గొప్పవారిని నిలబెట్టాలనే ఆకాంక్ష కూడా ఉందని వెల్లడించారు. లాంగ్‌టర్మ్ విజన్ ఉంటేనే రాజకీయా ల్లో రాణింపు సాధ్యపడుతుందని చెప్పారు. ప్రతి సమస్యపైన బలంగా పోరాటం చేస్తున్నామనీ, అయితే మనకి మీడియా లేదన్నారు. నిజమైన పోరాటం చేయాల్సి వచ్చినప్పుడు అందరికంటే ముందు తానే నిలుస్తా నని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఎం.గంగాధరం, చంద్రశేఖర్ రావు, ఎం.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మోడీ డైరెక్షన్‌లో జగన్ : పుల్లారావు

విశాలాంధ్ర - అమరావతి : ప్రధాని మోడీ డైరెక్షన్‌లోనే సీఎం చంద్రబాబుపై ఆరోపణలు చేస్తూ ప్రతిపక్ష నేత పుస్తకం విడుదల చేశారని, ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని వైసీపీ నేత జగన్‌కు పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సవాలు విసిరారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డికి తన ఆస్తులు ప్రకటించే దమ్ముందా అంటూ ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ నేతలపై అసత్య ఆరోపణలపై చర్చకు తాము సిద్ధమని, పుస్తకంలోని అంశాలన్నీ నిరాధారమైన ఆరోపణలని అన్నారు. రూ.6 లక్షల కోట్లు అవినీతి అని రాశారని, రాష్ట్ర బడ్జెట్ ఎంతో తెలుసా అని ప్రశ్నించారు.

మంత్రి నారాయణ 3,129 ఎకరాలు రాజధానిలో కొనుగోలు చేశారని ఆరోపించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రాజధాని పరిధిలో రెండు వేల ఎకరాలు మాత్రమే అమ్మకాలు, కొనుగోలు జరిగినట్లు తెలిపారు. జగన్ ఆస్తులు ప్రజలకు పంచాలని డిమాండు చేశారు. రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులతో 5 లక్షల ఉద్యోగాలు కల్పించామని వివరించారు. చంద్రబాబుపై గతంలో 24 కేసులు పెట్టారని వాటిలో ఒక్కటైనా రుజువు చేయగలిగారా అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి తన అవినీతిని కప్పి పుచ్చుకునేందుకు ఇటువంటి విషయాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబుని 2014లో ప్రజలు నమ్మారని అదే నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. 2019లో సైతం చంద్రబాబు నాయకత్వాన్ని బలపరుస్తారని ఆకాంక్షించారు.

అగ్రవర్ణాల రిజర్వేషన్లు ఎన్నికల స్టంట్ : యనమల

విశాలాంధ్ర - అమరావతి : అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఆహ్వానించదగిందే అయినప్పటికీ ఎన్నికల స్టంట్‌గానే దీన్ని చూస్తారని ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శిం చారు. మంగళవారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోడీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయాలని చూశారని ఆరోపించారు. ఆర్బీఐ, సీబీఐ సంస్థల స్వయం ప్రతిపత్తి దెబ్బ తీశారని ఈడీ, ఐటీ దర్యాప్తు సంస్థలను సొంతానికి వాడుకున్నారని విమర్శించారు. బీజేపీ పెద ధోరణులకు సుప్రీం తీర్పు చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. ఈబీసీల రిజర్వేషన్ల వెనక బీజేపీ చిత్తశుద్ధి ప్రశ్నార్థకమని, కుల, మతపరమైన రిజర్వేషన్లు గతంలో వ్యతిరేకించిన చరిత్ర బీజేపీదని అన్నారు. ఐదు రాష్ట్రాల్లో చిత్తుగా ఓడిపోవటంతోనే ఈ బిల్లు తెచ్చారని విమర్శించారు. ప్రజలు రాబోయే ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెబుతారని అన్నారు.



తనిఖీ అధికారుల వైఖరి మారాలి

ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: బస్సులను తనిఖీ చేసే అధికారుల వైఖరి మారాలని ఆర్టీసీ ఎండీ, వైస్ చైర్మన్ ఎన్.వి.సురేంద్రబాబు సూచించారు. విజయవాడలోని జోనల్ శిక్షణ కేంద్రంలో బస్సు చెకింగ్ అధికారులు, ప్రమాదాలకు కారకులైన డ్రైవర్లకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సురేంద్రబాబు తనిఖీ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ సిబ్బంది, ప్రయాణికుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. తనిఖీ కోసం బస్సును నిలిపిన వెంటనే ఈ విషయం ప్రయాణికులకు తెలిపి సహకరించాలని కోరాలన్నారు. కేసులు నమోదు చేయాలనే ధోరణి వీడనాడి, నిజమైన లోటుపాట్లు ఏమిటో గుర్తించాలన్నారు. అవసరమైన కారణాలతో కేసులు రాస్తే సంస్థ ఆదాయానికి నష్టం కలిగేందుకు ఆస్కారం ఉందన్నారు. అధికారులు తమ అనుభవాలతో వృత్తినైపుణ్యాన్ని మెరుగు పరచు కోవాలన్నారు. డ్రైవర్లతో ఎండీ మాట్లాడి ప్రమాదాలకు గల కారణాలను ఆరా తీశారు. ప్రమాదాల్లో ఎక్కువ శాతం మానవ తప్పిదాలవల్లే జరుగుతాయి కనుక వాటిని నివారించే అవకాశాలు డ్రైవర్ల చేతుల్లోనే ఉందన్నారు. డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరిగితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సంస్థలో అనేక సంవత్సరాలు ఒక్క ప్రమాదం కూడా చేయని వారున్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మద్యం సేవించడం వల్ల ప్రమాదాలకు దారి తీస్తుందని, మద్యం, ధూమపానం, గుట్కా వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని డ్రైవర్లకు సురేంద్రబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) జి.జయరావు, సీటీఎం బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

70ఏళ్లు దాటిన.. పెన్షనర్లకు తీపికబురు..!

అదనంగా 10శాతం పెంచిన సర్కారు -70వేల మందికి ప్రయోజనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో 70ఏళ్లు నిండిన విశ్రాంత ఉద్యోగులకు 10శాతం చొప్పున అదనంగా పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 70ఏళ్లు దాటిన దాదాపు 70వేల మంది విశ్రాంత ఉద్యోగులకు అదనపు ప్రయోజనం చేకూరుతుంది. దీనివల్ల ప్రభుత్వంపై రూ.200కోట్ల అదనపు భారం పడుతుంది. గతంలో 75ఏళ్లు నిండిన వారికి 15శాతం అదనపు పెన్షన్ ఇచ్చేవారు. ఏపీ జేఏసీ అమరావతి ప్రభుత్వానికి అందజేసిన వివిధ డిమాండ్లలో పెన్షన్ల అంశముంది. ఉద్యోగ సంఘాల వినతి మేరకు 10వ పీఆర్సీ తన నివేదికలో 75ఏళ్లకు బదులు 70ఏళ్లకే 15శాతం పెన్షన్లు మంజూరు చేయవచ్చని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదనను ఏపీ జేఏసీ అమరావతి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లింది. దీంతో 70ఏళ్లు నిండిన పెన్షనర్లకు 10శాతం అదనపు పెన్షన్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

పెన్షన్ల పెంపు హర్షణీయం: బొప్పరాజు, ఫణి పేర్రాజు

విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ల పెంపు పట్ల సీఎం చంద్రబాబుకు, ఉన్నతాధికారులకు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫణి పేర్రాజు అభినందనలు తెలిపారు. వాస్తవంగా ప్రభుత్వానికి 15శాతం పెంచాలని విన్నవించగా, దీనిపై ప్రభుత్వం అధ్యయనం చేసి 10శాతానికి పెంచిందని వివరించారు. విశ్రాంత ఉద్యోగుల పట్ల సానుకూలంగా ప్రభుత్వం స్పందించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

జేపీ నివేదిక కేంద్రానికి చెంపపెట్టు

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు

విశాలాంధ్ర - అమరావతి : శ్వేతపత్రాల్లోని అంశాలన్నీ నిజమేనని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ నేతృత్వంలోని నిపుణుల కమిటీ స్పష్టం చేయటం, కేంద్రానికి చెంప పెట్టని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావు అన్నారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు ఇవ్వాల్సిన రూ.750 కోట్లు తక్షణమే చెల్లించాలని నీతి ఆయోగ్ స్పష్టం చేసిందన్నారు. జయ ప్రకాష్ నారాయణ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ విడుదల చేసిన నివేదిక పునర్విభజన చట్టం ప్రకారం ఏపీకి రూ.85 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపిందన్నారు. 14వ ఆర్థిక సంఘం బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలని చెప్పిందన్నారు. రాష్ట్రంపై కక్ష పెంచుకున్న ప్రధాని మోడీ బీజేపీ కార్యకర్తలతో పచ్చి అబద్దాలు చెబుతున్నారని దుయ్య బట్టారు. ఏపీ విద్యుత్ సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం రూ.5 వేల కోట్ల బకాయి ఉందని ఇదే విషయమై జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో కేసు నడుస్తున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. అప్పు చేసి పప్పు కూడు తిన్నట్లు పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నేతలు ఓర్వలేకనే అసత్యపు పుస్తకాలు ప్రచురిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీకి వస్తే కదా వాస్తవాలు తెలియటానికి అని ఎద్దేవా చేశారు. జాతీయ సంస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను తిరిగి నియమిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రుజువు చేసిందని వెల్లడించారు.

ఏపీ శకటం తిరస్కరణకు సీపీఎం ఖండన

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: జనవరి 26వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న రిపబ్లిక్‌డే పేరేడ్‌లో ఏపీ శకటాన్ని తిరస్కరించడాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు మంగళవారం ప్రకటన చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా రాష్ట్రం పట్ల వివిధ సందర్భాల్లో పక్షపాతంతో వ్యవహరిస్తోందన్నారు. తాజాగా ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన శకటాన్ని ఎటువంటి సహేతుక కారణాలు లేకుండా తిరస్కరించిందన్నారు. ఇది తెలుగు ప్రజల్ని అవమానించడమే అన్నారు. కేంద్రం రాష్ట్ర పట్ల వివక్షను, కక్షసాధింపు చర్యలను విడనాడాలని సీపీఎం తరపున ఆయన డిమాండ్ చేశారు.

చైల్డ్‌వెల్ఫేర్ సూపర్‌వైజర్ పోస్టులకు మహిళలే అర్హులు: ఏపీపీఎస్సీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన ఏపీ ఉమెన్ డవలప్‌మెంట్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్ సూపర్‌వైజర్(గ్రేడ్-1) పోస్టులకు దరఖాస్తు చేసేందుకు మహిళలే అర్హులని కమిషన్ అదనపు కార్యదర్శి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. చైల్డ్‌వెల్ఫేర్ విభాగం జనరల్ రిక్రూట్‌మెంటు పోస్టుల భర్తీకిగాను డిసెంబరు 21వ తేదీన ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 4జోన్ల పరిధిలో మొత్తం109 పోస్టులు న్నాయి. వాటికి దరఖాస్తు చేసేందుకుగాను డిగ్రీలో సోషల్ వర్క్ లేదా ఫుడ్‌సైన్స్ అండ్ న్యూట్రిషన్‌ను అర్హతగా ఏపీపీఎస్సీ నిర్ణయించింది.

డీబీపీ అధ్యక్షుడిగా వేదవ్రత్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దళిత బహుజన పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా సీనియర్ నేత వేదవ్రత్ నియామకమయ్యారు. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ మంగళవారం నియామక పత్రం అందజేశారు. వేదవ్రత్ మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం, ప్రయోజనాల పరిరక్షణ కోసం ఉద్యమిస్తానని తెలిపారు. దళితులను సమీకరించి ఆత్మగౌరవ ఉద్యమాలు సాగిస్తామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా పార్టీని పటిష్ఠ పరుస్తానని తెలిపారు.

విశాలాంధ్ర

క్రీడలు

భారత్‌లోనే ఐపీఎల్



ముంబై : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2019 సీజన్‌కు ముహుర్తం ఖరారైంది. ఈ ఏడాది ఐపీఎల్ జరిగే సమయంలో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో భద్రతా కారణాల దృష్ట్యా ఐపీఎల్‌ని విదేశాల్లో నిర్వహించనున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ వార్తలకు బీసీసీఐ బ్రేక్ వేసింది. బోర్డు మాత్రం ఐపీఎల్ 2019 సీజన్‌ను భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం బీసీసీఐ అధికారిక ప్రకటన చేసింది. ఐపీఎల్ వేదికల విషయమై చర్చించేందుకు సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ మంగళవారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు.

ఐపీఎల్ 2019 సీజన్‌ను

'ఐపీఎల్ 2019 సీజన్‌ను ఎక్కడ నిర్వహించాలనే దానిపై మంగళవారం బీసీసీఐ పాలకుల కమిటీ ఢిల్లీలో సమావేశమైంది. ప్రాథమిక చర్చల అనంతరం జాతీయ, రాష్ట్ర ఏజెన్సీల అంచనా ప్రకారం 12వఎడిషన్‌ను భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించారు" అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

మార్చి 23 నుంచి..

'మార్చి 23, 2019న ఐపీఎల్-12 సీజన్ ప్రారంభమవుతుంది. బోర్డు అధికారులతో సమావేశమైన తర్వాత పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేస్తాం. ఐపీఎల్ 2019 షెడ్యూల్‌ను ప్రకటించడానికి ముందు స్టేక్ హోల్డర్స్‌తో బీసీసీఐ పాలకుల కమిటీ సమావేశం కానుంది' అని బీసీసీఐ అందులో పేర్కొంది.

గతేడాది కంటే ముందే..

గత సీజన్‌ను ఏప్రిల్ 7 నుంచి ప్రారంభించగా.. ఈసారి అంతకు ముందే ఐపీఎల్ ప్రారంభం కానుంది. ఐపీఎల్ 2019 సీజన్ మ్యాచ్‌లు జరిగే సమయంలోనే ఎన్నికలు కూడా జరగనుండటంతో.. భద్రతా ఏర్పాట్లు చేయలేమని ఇప్పటికే నిర్వాహకులకు అధికారులు తేల్చి చెప్పేశారు. టోర్నీలోని 8 ఫ్రాంఛైజీలు.. భారత్ వెలుపల మ్యాచ్‌లు నిర్వహిస్తే? భారీగా ఆదాయం కోల్పోవాల్సి వస్తుందని ఆ నిర్ణయంపై విముఖత వ్యక్తం చేశాయి. దీనిని పరిగణనలోకి తీసుకున్న బోర్డు ఐపీఎల్ 2019 సీజన్‌ను భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించింది.

గతంలో ఇలా...

గత లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తొలిసారి 2009లో టోర్నీ దక్షిణాఫ్రికాలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 2014లో సగం టోర్నీ యూఏఈలో, మిగతా సగం భారత్‌లో జరిగిన సంగతి తెలిసిందే. అయితే, ఈసారి కూడా అలానే జరగనుందని వార్తలు వచ్చాయి. కాగా, మార్చిలో ఐపీఎల్ మొదలవడం ఇది రెండోసారి. 2010లో తొలిసారి టోర్నీని మార్చిలోనే ప్రారంభించారు. ఆ తర్వాత ఏటా ఏప్రిల్‌లో ప్రారంభిస్తున్నారు. అయితే ఈ ఏడాది ఇంగ్లండ్ వేదికగా మే 30 నుంచి వన్డే వరల్డ్‌కప్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో 15 రోజుల గ్యాప్ ఉండేలా ఐపీఎల్ షెడ్యూల్ విడుదల చేయనున్నారు.

పుజారాకు మూడు

- రికార్డు ర్యాంకు అందుకున్న రిషబ్
- అగ్రస్థానంలో కోహ్లి



దుబాయి: ఐసీసీ మంగళవారం ప్రకటించిన టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బ్యాట్స్‌మన్ పుజారా మూడో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో అతడు 521 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అలాగే, ఆ సిరీస్‌లో 350 పరుగులు చేసిన టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఒక్కసారిగా 21 స్థానాలు ఎగబాకి 17వ స్థానంలో నిలిచాడు. ధోనీ టెస్టు కెరీర్‌లో 19వ ర్యాంకే అత్యుత్తమం కాగా అతడి రికార్డును పంత్ అధిగమించాడు. 1973లో టీమిండియా వికెట్ కీపర్ ఫరూఖ్ ఇంజినీర్ టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో 17వ స్థానంలో నిలిచాడు. ఇప్పుడు అతడి సరసన పంత్ నిలిచాడు. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లే ముందు పంత్ 59వ స్థానంలో ఉన్నాడు. కాగా, టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి మళ్లీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియా సిరీస్‌లో రాణించిన రవీంద్ర జడేజా, మయాంక్ అగర్వాల్ కూడా బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. ఆరు స్థానాలు ఎగబాకిన జడేజా 57వ స్థానంలో నిలవగా, మయాంక్ ఐదు స్థానాలు మెరుగుపర్చుకుని 62వ స్థానంలో నిలిచాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో పలువురు టీమిండియా బౌలర్లు తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. కుల్దీప్ యాదవ్ ఏడు స్థానాలు ఎగబాకి 45వ స్థానంలో నిలవగా, జస్ప్రిత్ బుమ్రా 16, షమీ 22వ స్థానాల్లో నిలిచారు. జడేజా ఒక స్థానం మెరుగుపర్చుకుని ఐదో స్థానంలో నిలిచాడు. ఐసీసీ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో టాప్-5లో వరుసగా విరాట్ కోహ్లి (భారత్), విలియమ్సన్ (న్యూజిలాండ్), పుజారా (భారత్), స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా), రూట్స్ (ఇంగ్లండ్) ఉన్నారు. బౌలింగ్ టాప్-5లో వరుసగా రబాడా (దక్షిణాఫ్రికా), అండర్సన్ (ఇంగ్లండ్), ఫిలండర్ (దక్షిణాఫ్రికా), కమ్మిన్స్ (ఆస్ట్రేలియా), జడేజా (భారత్) ఉన్నారు.

బుమ్రాకు విశ్రాంతి.. సిరాజ్‌కు పిలుపు



సిడ్నీ: టెస్టు సిరీస్‌లో సరికొత్త చరిత్ర లిఖించిన కోహ్లిసేన, ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లకు సిద్ధమవుతోంది. టెస్టు సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు తదుపరి వన్డే సిరీస్‌లకు బీసీసీఐ విశ్రాంతి కల్పించింది. ఆస్ట్రేలియాతో జరగబోయే వన్డే మ్యాచ్‌లు అలాగే న్యూజిలాండ్ పర్యటనలో బుమ్రా ఆడట్లేదని ప్రకటించింది. అతడి స్థానంలో హైదరాబాద్ కుర్రాడు మహ్మద్ సిరాజ్‌కు అవకాశం కల్పించింది. 'తర్వాతి సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడమే మంచిదని భావించాం. ఆస్ట్రేలియాతో వన్డే మ్యాచ్‌లు, న్యూజిలాండ్ పర్యటనలో బుమ్రా స్థానంలో మహ్మద్ సిరాజ్ ఆడతాడు' అని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలి పింది. తాజా టెస్టుల్లో బుమ్రా అద్భుత ప్రదర్శన చేసిన విషయం తెలిసిందే. కేవలం 12 నెలల క్రితమే టెస్టుల్లో అరంగేట్రం చేసిన బుమ్రా.. ప్రస్తుతం కీలక పేసర్‌గా మారిపో యాడు. ఆసీస్‌తో జరిగిన నాలుగు టెస్టుల సిరీస్‌లో 21 వికెట్లు తీయడం విశేషం. జన వరి 12 నుంచి భారత్-ఆస్ట్రేలియా మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ అనంతరం ఐదు వన్డేలు, మూడు టీ20లు ఆడేందుకు టీమిండియా న్యూజి లాండ్ బయల్దేరుతుంది. జనవరి 23 నుంచి న్యూజిల్యాండ్ సిరీస్ ప్రారంభం కానుంది.

కోహ్లిసేనకు భారీ నజరానా

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియాలో గడ్డపై తొలి టెస్టు సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించిన కోహ్లిసేనకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి నగదు బహుమతి ఇవ్వనుంది. దాదాపు 71 ఏళ్లకు టీమిండియా ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపైనే ఓడించి 2-1 తేడాతో టెస్టు సిరీస్ కైవసం చేసుకుంది. దిగ్గజ క్రికెటర్లకు సాధ్యం కాని లక్ష్యాన్ని సాధించింది. ఈ ఘనతకు నజరానా ఇవ్వాలని బీసీసీఐ పాలకుల కమిటీ నిర్ణయించింది. మ్యాచ్ ఫీజ్‌కు సమానంగా బోనస్ ఇవ్వనుంది. అంటే ఒక్కో మ్యాచ్‌కు ఫీజు రూ.15 లక్షల వరకు ఉంటుంది. నాలుగు మ్యాచ్‌లు ఆడిన వారికి రూ.60 లక్షల వరకు బహుమానం దక్కనుంది! రిజర్వు ఆటగాళ్లకు మ్యాచ్‌కు రూ.7.5 లక్షలు ఇస్తారు. కోచ్‌లకు తలో రూ.25 లక్షలు ఇవ్వనున్నారు. సహాయక సిబ్బందికి ప్రొ రేటా వేతనం లేదా ప్రొఫెషనల్ ఫీజుకు సమానంగా బోనస్ ఇస్తారు. సుప్రీం కోర్టు నియమించిన పాలకుల కమిటీ ఇందుకు ఆమోదం తెలిపింది.

కలిసి పోటీ చేద్దాం

- సార్వత్రిక ఎన్నికలపై సూత్రప్రాయ నిర్ణయం
- పవన్‌తో వామపక్షాల నేతల భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సార్వత్రిక ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని జనసేన, వామపక్ష పార్టీలు సూత్రప్రాయంగా నిర్ణయించాయి. సార్వత్రిక ఎన్నికల్లో కలిసి పోటీ చేయడం ద్వారా రాష్ట్రంలో సత్తా చాటాలని భావిస్తున్నారు. ఈమేరకు మంగళవారం విజయవాడలోని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నివాసంలో ఆయనతో వామపక్ష పార్టీల నేతలు భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, నిరుద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో చురుగ్గా వ్యవహరించాలని నిర్ణయించారు. దేశ, రాష్ట్ర రాజకీయాలు, ఏపీకి ప్రత్యేకహోదా, విభజన హామీల అమలుపై సమీక్షించారు. ప్రత్యేక హోదా సాధన కార్యాచరణపై చర్చించారు. అపరిష్కృతంగా ఉన్న ప్రధాన సమస్యలపై ఐక్యంగా పోరాడాలని నిర్ణయించారు. భేటీలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లి విల్సన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, కేంద్ర కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సీహెచ్ బాబూరావుతో పాటు జనసేన నేత నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల బిల్లు పెద్ద జిమ్మిక్కు



న్యూఢిల్లీ : ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఈబీసీ)కు చెందిన వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు లోక్‌సభలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు పెద్ద జిమ్మిక్కుగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి పేర్కొన్నారు. రాఫెల్ కుంభకోణం, అవినీతి, ధరల పెరుగుదల, కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఈ విధమైన జిమ్మిక్కులకు పాల్పడుతోందని విమర్శించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల చివరి రోజున ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టడంతో ఎటువంటి తీవ్రత లేకుండా పోయిందని మంగళవారం ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. 2014 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నెరవేర్చడంలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను ప్రైవేట్‌రంగానికి విస్తరించాలన్న డిమాండు తీవ్రంగా ఉన్నప్పటికీ ఎన్డీయే ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనాలేదన్నారు. మండల్ కమిషన్ నివేదికను అమలు చేయడానికి ముందు సీపీఐతోపాటు కొన్ని వామపక్ష పార్టీలు ఈబీసీ రిజర్వేషన్లను సూచించాయి. అయితే, ఏ రిజర్వేషన్లు అయినా 50 శాతం దాటకూడదని సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చింది. రాజస్థాన్, హర్యానా, యూపీ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కొన్ని ఇతర రాష్ట్రాలల్లో అగ్రవర్ణాల నుంచి ఈ విధమైన రిజర్వేషన్లకు సంబంధించిన డిమాండ్లు వస్తున్నాయి. ఈ డిమాండ్లను తిరస్కరించలేక రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరిస్తుంటే న్యాయస్థానాలు నిలిపివేస్తున్నాయి. రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ బిల్లు పార్లమెంట్‌లో సాధారణ పరిశీలనకు నిలవదు. రిజర్వేషన్లకు సామాజిక, సాంస్కృతిక వెనుకబాటుతనాన్ని ప్రామాణికంగా రాజ్యాంగం పేర్కొంటోంది. తగిన చర్చ , అన్ని పార్టీలలో ఏకాభిప్రాయం లేకుండా ఆదరాబాదరాగా చివరి రోజున రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఉపాధికల్పిస్తామన్న ఎన్నికల హామీని నెరవేర్చడంలో ఎన్డీయే ప్రభుత్వం వైఫల్యంతో దూరమైన ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నమే ఇదని సురవరం పేర్కొన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాలను సృష్టించడంలో విఫలంచెందింది. ఊహాజనిత ఉద్యోగాలపై ప్రజల మధ్య వివాదాన్ని సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈబీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రామాణికత 8 కోట్ల ఈబీసీలలో మెజారిటీ ప్రజలకు లబ్ధిచేకూరుస్తుందా అన్న సందేహం కూడా ఉన్నదన్నారు. ప్రజలకు సామాజిక న్యాయం కల్పించే మౌలిక లక్ష్యంతో విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషను కల్పించారని, ప్రభుత్వ తాజా నిర్ణయం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వంటి కేటగిరీల వారికి సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లపై గందరగోళం సృష్టిస్తుందన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు, రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు, కాకుమాని శ్రీనివాసరావు, ఎన్. అంజయ్య, చంద్రానాయక్, మనోహర్ నాయుడు

మూఢభక్తి మంచిది కాదు : నల్లూరి

విశాలాంధ్ర ప్రతినిధి-విజయవాడ : మూఢ భక్తి మంచిది కాదని, ప్రతి ఒక్కరూ హేతుబద్ధంగా ఆలోచించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) చెప్పారు. విజయవాడలోని స్వరాజ్య మైదానంలో నిర్వహిస్తున్న 30వ పుస్తక మహోత్సవ ప్రాంగణం లోని యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వేదికపై విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ మంగళారం రాత్రి జరిగింది. ఆచార్య నన్నపనేని అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రముఖ రచయిత ముక్కామాల నాగభూషణం రచించిన 'శతావతారాలు' పుస్తకాన్ని నల్లూరి వెంకటేశ్వర్లు, ఇంజినీర్, రచయిత చట్టి శ్రీనివాసరావు రచించిన 'గులాబి మేఘాలు' నవలను సాహితీ విమర్శకులు, రచయిత డాక్టర్ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు, డాక్టర్ తెన్నేటి జయరాజు రచించిన 'ఆహారంపై ఆంక్షలా?' పుస్తకాన్ని డాక్టర్ కాకుమాని శ్రీనివాస రావు ఆవిష్కరించారు. అనంతరం నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రచయిత ముక్కామాల నాగభూషణం అతిసామాన్యంగా ఉండే మేధావి అని చెప్పారు. అనేక గ్రంథాలను అధ్యయనం చేసిన తర్వాత 'శతావతారాలు' రాశారని తెలిపారు. రామాయణం, భారతంలో పేర్కొన్న అంశాలు నిజంగా జరిగాయా, ఎప్పుడు జరిగాయి, ఏది ముందు జరిగిందనే అంశాలపై ఏళ్లగా చర్చ జరుగుతోందన్నారు. ఈ క్రమంలో పాఠకులను మరింత ఆలోచింపజేసే విధంగా, శాస్త్రీయంగా 'శతావతారాలు' పుస్తకం ఉందని చెప్పారు. శాస్త్రవేత్తల పరిశోధనల అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సైన్స్‌ను కేవలం పాఠ్యాంశంగా చూడకుండా శాస్త్రీయంగా జీవితానికి అన్వయించుకుని ఆలోచన చేయాలని సూచించారు. కొన్ని వేల సంవత్సరాల పరిణామ క్రమంలో ప్రస్తుతం ఉన్న నాగరికత ఏర్పడిందని తెలిపారు. హేతుబద్ధమైన ఆలోచనల వల్లే సమాజం ముందుకు సాగుతుందని, విద్యార్థులు, యువత, భక్తులు 'శతావతారాలు' పుస్తకాన్ని చదవాలని కోరారు. డాక్టర్ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు మాట్లాడుతూ, శాస్త్రీయ దృక్పథం కలిగిన పౌరులు ఉండాలని భారత రాజ్యాంగం చెబుతోందన్నారు. సైన్స్‌ను కేవలం మార్కు కోసమే చదవడం బాధాకరమన్నారు. ఈ క్రమంలో నవల రూపంలో ఉంటే సైన్స్‌ను ఎక్కువ మంది చదవి, నూతనంగా ఆలోచన చేసే అవకాశం ఉంటుందని సోవియట్ యూనియన్‌లో ఇంజినీరింగ్ చదువుకున్న చట్టి శ్రీనివాసరావు రష్యన్ సైన్స్ ఫిక్షన్ నవలను 'గులాబి మేఘాలు'ను తెలుగులోకి అనువదించారని తెలిపారు. స్వేచ్ఛా అనువాదం వల్ల మన ప్రాంతంలో జరిగిన కథలా, కొత్త ఆలోచనలను ప్రేరేపించేలా 'గులాబి మేఘాలు' నవల ఉందన్నారు. డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశంలోని జనాభాను అమానవీయంగా 6 వేల కులాలుగా విభజించారని పేర్కొన్నారు. ప్రపంచంలో దేశ జనాభాలో రెండో స్థానం, పశు సంపదలో మొదటి స్థానంలో ఉన్నప్పటికీ, మానవాభివృద్ధిలో 135వ స్థానం, ఆర్థికాభివృద్ధిలో 140వ స్థానంలో ఉన్నామని చెప్పారు. ఆచార్య ఎన్.అంజయ్య మాట్లాడుతూ, కొందరు తమకు నచ్చని ఆహారం తింటున్నారని, 'లించింగ్' పేరుతో గోవుమాంసం తినేవారిని హత్య చేయటం దారుణమన్నారు. ఆహారపు అలవాట్లపై ఆంక్షలు విధించడం మంచి పద్ధతి కాదన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి మనోహర్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పి చంద్రానాయక్ పాల్గొన్నారు.

బీజేపీ, టీడీపీలకు రాజకీయ సమాధి

- న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాల్సిందే
- సుప్రీం తీర్పును అమలు చేయాలన్న జ్ఞానం లేదా?
- సార్వత్రిక సమ్మెలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు



మాట్లాడుతున్న ఓబులేసు. చిత్రంలో పల్లా సూర్యారావు తదితరులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరచి కార్మికుల న్యాయమైన 18 డిమాండ్లను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండు చేశారు. లేకుంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీలకు రాజకీయ సమాధి ఖాయమని ఆయన హెచ్చరించారు. కేంద్రకార్మిక సంఘాల పిలుపులో భాగంగా రెండురోజుల సమ్మెలో మొదటి రోజైన మంగళవారం విజయవాడలో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. లెనిన్‌సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఓబులేసు మాట్లాడారు. కనీసవేతనం రూ.18వేలు చెల్లించ మనే న్యాయమైన కోర్కెను పాలకులు ఎందుకు పరిష్కరించ లేదు? అని ప్రశ్నించారు. కేరళ, గోవా, పాండిచ్చేరి వంటి చిన్న రాష్ట్రాల్లో కనీస వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. ఉక్కు, బొగ్గు, సిమెంటు, ఆయిల్, విద్యుత్ రంగాల్లోని కార్మికులకు న్యాయ సమ్మతంగా రావాల్సిన వేతనాలను ఇవ్వడంలేదని మండిపడ్డారు. గత సమ్మెలో 18 కోట్లమంది కార్మికులు హాజరైతే, ఈ సమ్మెలో 25 కోట్ల మంది పాల్గొంటున్నారని, ఇన్ని కోట్లమంది కార్మికులు ప్రత్యక్ష కార్యాచరణకు దిగినప్పటికీ పాలకుల్లో చలనం రాకపోవడం శోచనీయమన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలనే కనీస ఇంగితజ్ఞానం కూడా లేదా?, ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసే హక్కు ఎవరిచ్చారు?, అని ఆయన కార్మికుల పక్షాన కేంద్రాన్ని ప్రశ్నించారు. రాఫెల్ యుద్ధవిమానాల తయారీ విషయంలో హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)ను దెబ్బతీస్తూ ప్రైవేటు కంపెనీకి వేలాది కోట్ల రూపాయాలను ధారాదత్తం చేయడం దారుణమన్నారు. పెద్దనోట్ల రద్దు ద్వారా బ్యాంకింగ్ సెకార్టును నాశనం చేశారని, జీఎస్టీ విధించి సామాన్య ప్రజానీకంపై అదనపు భారాన్ని మోపుతున్నారని ఆయన కేంద్రం తీరును దుయ్యబట్టారు. జాతి సంపదను సృష్టించే కార్మికవర్గాన్ని పాలకులు బానిసలుగా చూస్తే వారి పిడికిళ్ల మధ్య నలిగిపోవడం ఖాయమని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు పనుల్లో గిన్నిస్ బుక్ రికార్డులను బద్దలు కొట్టడానికి కార్మికులు రోజుకు 12 గంటలకుపైగా కష్టపడిన విషయాన్ని సీఎం చంద్రబాబు గుర్తించాలన్నారు. వయోజన విద్యలో నూరుశాతం అభివృద్ధి సాధించినా, తల్లీబిడ్డ పథకంలో అంగన్‌వాడీ, శిశుసంరక్షణ, సంక్షేమ సమితి కాపాడిన ఉద్యోగులు, కార్యకర్తలకు మాత్రం ప్రభుత్వాలు న్యాయం చేయడంలేదన్నారు. ఇదే తీరును కొనసాగిస్తే బీజేపీ, టీడీపీలకు కార్మికలోకం మరణశాసనం రాయడం ఖాయమని ఓబులేసు హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ముందున్న 12 కనీస డిమాండ్లపై చర్చించేందుకు ప్రధాని మోడీకి తీరికలేకలేదని విమర్శించారు. కోటి మంది స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండు చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఏఐసీటీయూ నేత హరనాథ్, వైఎస్సార్‌టీయూ నేత విశ్వనాథ రవి, ఏఐయూటీయూసీ నేత కె.సుధీర్, ఏఐఎఫ్‌యూటీ నేత జె.కిషోర్‌బాబు, ఏఐబీఈఏ నేత వై.శ్రీనివాసరావు ప్రసంగించారు. శ్రామిక మహిళ ఫోరం నాయకురాలు కె.శైలజ, ఆశావర్కర్స్ ప్రతినిధి కె.శ్రీలక్ష్మి, మధ్యాహ్నభోజన పథకం కార్మికుల నాయకురాలు రమాదేవి, యూటీఎఫ్ నేత పి.బాబురెడ్డి పాల్గొన్నారు. ఏఐటీయూసీ నగర కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు పల్లా సూర్యారావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సాంబశివరావు, టి.తాతయ్య హాజరయ్యారు. కార్యక్రమ ప్రారంభంలో ప్రజానాట్యమండలి కళాకారులు పి.చంద్రానాయక్, ఆర్.పిచ్చయ్య విప్లవ గేయాలను ఆలపించారు.

రైలింజన్‌లో మంటలు.. ప్రయాణికులు సురక్షితం



సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లోని హిమాలయన్ క్వీన్ ఎక్స్‌ప్రెస్ పర్యాటక రైలులో మంగళవారం మంటలు చెలరేగాయి. కుమర్‌హతి-ధరమ్‌పూర్ మధ్య సోలన్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో రైలులో 200 మంది ప్రయాణికులు ఉన్నారు. కేవలం ఇంజిన్‌లో మాత్రమే మంటలు చెలరేగడంతో గమనించిన రైలు లోకో పైలట్ వెంటనే అధికారులకు సమాచారం అందించాడు. స్పందించిన అధికారులు రైలు నుంచి ఇంజిన్‌ను వేరు చేసి, మరో ఇంజిన్‌ను అక్కడికి పంపి ప్రయాణికులను సిమ్లాకు తరలించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.